www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 02 పుటలు : 52

# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి కార్తిక శుద్ధ తదియ
04-10 నవంబర్ 2024
వెల : ₹20/-



Swadeshi Mela
• Experience • Explore • Enjoy

# స్వదేశీ, స్వావలంబనే భవిష్యత్తు

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

**With Best compliments from :**

# COASTAL
## CORPORATION LTD.

(CIN : L63040AP1981PLC003047)

GOVT. OF INDIA RECOGNISED ★ ★ TWO STAR EXPORT HOUSE

Regd. Off.:15-1-37/3, Nowroji Road, Maharanipeta,
Visakhapatnam- 530 002. INDIA
Phone No : 0891-2567118, Fax : 0891-2567132
E-mail : cclinvestors@gmail.com, info@coastalcorp.co.in
www.coastalcorp.co.in

Plant Unit 1 : Marikavalasa (V), Paradesipalem Panchayat, Visakhapatnam Dist.
Plant Unit 2 : P. Dharmavaram Village, S.Rayavaram Mandal, Visakhapatnam Dist.

# దీపావళి నుండి సంక్రాంతి వరకు
# జాగృతి కానుక !

## సంవత్సర చందా రూ. 750/-
## ఐదు సంవత్సరాల చందా రూ. 3500/-

ధర్మరక్షణ కోసం, ఈ మట్టి పరిమళంతో వెలువడుతున్న పత్రిక జాగృతి...
1948లో ప్రారంభమై 77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ భావాల పత్రిక..
జాగృతి.. గర్వించదగిన తెలుగు వారపత్రిక... ఎన్నో ప్రత్యేక సంచికలను వెలువరిస్తున్నది.

**ఇలాంటి పత్రికలో మీరు కూడా భాగాస్వాములు కావాలని**

**నవంబర్ 1 నుంచి జనవరి 15 వరకు**

**సం॥ర చందాలో రూ.100/- మరియు 5 సం॥రాల చందాలో రూ.500లు**

**ప్రత్యేక తగ్గింపును అందిస్తుంది.**

**కావున వెంటనే మీరు చందారులుగా చేరండి.. చేర్పించండి...**

సంవత్సర చందా రూ. 750/-
http://payit.cc/S18970

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో
మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే
గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

5 సం.రాల చందా రూ. 3500/-
http://payit.cc/S18973

సం.ర చందా మ్యాగ్జిన్ పోస్టు
వెల : రూ.1374/-
https://payit.cc/S32796

**Jagriti Bank A/c details**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch,
Hyderabad. IFSC : UTIB0002157,

వివరాలకు సంప్రదించండి
సర్క్యులేషన్ మేనేజర్ :
**040-2756 1453**
**99599 97013**

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagrititv 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | – |
| సబ్ ఎడిటర్ : | – | **9959991304** |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అంకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**


– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

**భా**రతదేశం మీదకి సెక్యులరిజం భూతాన్ని విడిచిపెట్టినది కాంగ్రెస్ పార్టీ. ఇక్కడ క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు కూడా మైనారిటీలే. కానీ మైనారిటీ అంటే ముస్లింలకు మారుపేరు అన్నట్టే తయారయింది. మిగిలిన మతాల వారికీ రాజ్యాంగం అదే హోదాను ఇచ్చిన సంగతి కాంగ్రెస్ సహా సెక్యులరిస్టు పార్టీలన్నీ ఏనాడో గాలికి వదిలేశాయి. ఇటీవల సెక్యులరిజం ముస్లిం మైనారిటీలను కొత్త పుంతలు తొక్కుస్తున్నది.ఆ పేరుతోను, చాలా రాజకీయ పార్టీల బుజ్జగింపు బలహీనత ఆసరాగా వక్ఫ్‌బోర్డ్ అనే కవచాన్ని అడ్డం పెట్టుకుని దేశంలో ప్రతి ఎకరాన్ని తమ ఖాతాలో వేసుకోవాలని ముస్లిం మతోన్మాదులు చూస్తున్నారు. వక్ఫ్ చట్టానికి సవరణలు చేసే ఉద్దేశంతో బీజేపీ ప్రభుత్వం వేసిన తొలి అడుగుతో వక్ఫ్ బోర్డులు రెచ్చిపోతున్నాయి. అంటే ముస్లిం మతోన్మాదులు రెచ్చిపోతున్నారు. ఈ ధోరణికే కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నది. అసలు అది వక్ఫ్ చట్టమా? మధ్యయుగాల నాటి ముస్లిం దురాక్రమణదారుల అవశేషమా? పార్లమెంట్ భవనం కట్టిన స్థలం వక్ఫ్‌దేనట. సుప్రీంకోర్టు కట్టిన నేల వక్ఫ్‌దేనట. ఆఖరికి చోళుల కాలం నుంచి పూజాపునస్కారాలు అందుకుంటున్న దేవస్థానం సైతం వక్ఫ్‌దేనట. ఇదీ వక్ఫ్ వాదన. నిజానికి ఇది మధ్య యుగాల దురాక్రమణదారుల దుండగీడుతనం.

వక్ఫ్ బోర్డు నిర్వాకాలతో జాతి మండిపడుతున్నది. అయినా పట్టు వదలకుండా ఆ మంటను పెంచుతూనే ఉన్నారు ముస్లిం మతోన్మాదులు, కాంగ్రెస్ నాయకులు. దీనికి కమ్యూనిస్టుల అండ ఎలాగూ ఉంటుంది. కర్ణాటకలోని విజయపుర అనే చోట జరిగిన ప్రహసం ఇందులో భాగమే. అక్కడి 1200 ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు చెందుతుంది కాబట్టి, ఇన్నాళ్లు సాగు చేసుకున్న రైతులు ఖాళీ చేయాలని ఇటీవల కర్ణాటక ప్రభుత్వం తాఖీదులు జారీ చేసింది. అయితే రైతులు తిరగబడడంతో కాంగ్రెస్ ప్రభుత్వం తోక ముడిచింది. తరువాత కథే పరమ జుగుప్సాకరంగా ఉంది. 1974 గజట్ ప్రకటనలో దొర్లిన తప్పిదం వల్ల రైతులకు తాఖీదులు వెళ్లాయని పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ చావు కబురు చల్లగా చెప్పారు. అంతేనా! ఆ 1200 ఎకరాల భూమిలో కేవలం 11 ఎకరాలే వక్ఫ్ బోర్డుకు చెందుతాయని

**శాలివాహన 1946 శ్రీ క్రోధి కార్తీక శద్ధ తదియ**

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**స్వదేశీ, స్వావలంబనే భవిష్యత్తు**
6లో

అభినందన
**2024 నోబెల్ పురస్కారాలు**

20లో

ప్రత్యేక వ్యాసం
**'వారసత్వ' పరిరక్షణపై నిర్లిప్త ధోరణి**

26లో

# జాగృతి

## సంపాదకీయం

అలవోకగా నాలుక మడతేశారు. రైతులు ఆందోళన చేయనక్కరలేదని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఎక్కడ 1200 ఎకరాలు? ఎక్కడ 11 ఎకరాలు? అంతేమరి! కాంగ్రెస్ తప్పిదాలు ఎప్పుడూ ఖరీదైనవే. 1974 నాటి గజట్‌లో తప్పు దొర్లింది. తాఖీదులు ఇచ్చినప్పుడైనా అది ఎందుకు బయటపడలేదు? ఇప్పుడేమో రైతులకు చెందిన ఒక్క అంగుళం భూమి అయినా వక్ఫ్ బోర్డు పరిధిలోకి వెళ్లనివ్వబోమని మంత్రి బీరాలు పలికారు. ఈ విషయాన్ని బీజేపీ రాజకీయం చేయడం సరికాదని హితబోధ మొదలుపెట్టారు. సాక్షాత్తు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భూబకాసురుడని తేలింది. కాంగ్రెస్ పార్టీ జాతీయ

# ఇద్దరి కపట నాటకం

అధ్యక్షుడు, కర్ణాటకకు చెందిన మల్లికార్జున ఖర్గే కుటుంబం కూడా మరొక భూబకాసుర దుకాణమని తేలిపోయింది. చేజిక్కించుకున్న భూములు తిరిగి ఇచ్చేస్తామని ప్రకటించి తాము దోషులమేనని కాంగ్రెస్ పెద్దలు తిరుగులేకుండా వెల్లడించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే చేస్తున్నది. గజట్ పొరపాటు అంటూ ఆ భూములు ఇచ్చేస్తామని చెబుతోంది. ఇదంతా నమ్మదగిన వివరణేనా? ఇంతకీ ఆ ఎకరాలు మీద వక్ఫ్ బోర్డు పచ్చ ముద్ర ఎలా వేసింది ప్రభుత్వం? రాత్రికి రాత్రి వక్ఫ్ బోర్డు పేరు రెవెన్యూ రికార్డులలో చొరబడిందని బీజేపీ ఆరోపణ. రాత్రికి రాత్రి వక్ఫ్ బోర్డును హక్కుదారుగా చేర్చారన్న ఈ ఆరోపణ తీవ్రమైనది. దీనికి సమాధానం ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ఇది అతి ప్రమాదకర కుట్ర.

ఇంతకీ వక్ఫ్ బోర్డు భూదాహం మీద బీజేపీ మాట్లాడుతున్నది కాబట్టి ఇది హిందూత్వ అంశమైపోతుందా? వక్ఫ్ బోర్డు దురాగతాలకు వ్యతిరేకంగా కేరళ క్రైస్తవ సమాజం జరుపుతున్న ఆందోళనల మాటేమిటి? వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక సమీపిస్తున్న తరుణంలో మూనాంబం అనే గ్రామంలో కేథలిక్ చర్చి ఆరంభించిన ఆందోళనకు మూలాలు ఏమిటి? వక్ఫ్ బోర్డు భూ జిహాద్ కాదా! కేరళను దశాబ్దాలుగా పాలిస్తూ ముస్లిం మతోన్మాదానికి రాచబాట వేసిన వామపక్ష కూటమినీ, కాంగ్రెస్ కూటమినీ కూడా నమ్మవలసిన అవసరం లేదని క్రైస్తవులు బాహాటంగానే చెబుతున్నారు. ఆ రెండు కూటములు కూడా మూనాంబం మత్స్యకారులకు వెన్నుపోటు పొడిచాయని కేథలిక్ చర్చి అధికార పత్రిక 'దీపిక డైలీ' సంపాదకీయంలో ఆరోపించింది. ఈ కూటములు కేరళ ప్రజలను బీజేపీవైపు చూడక తప్పని పరిస్థితిని కల్పించాయని కుండ బద్దలు కొట్టింది. ఆ గ్రామంలోని 600 మత్స్యకారుల కుటుంబాల వారి భూములను వక్ఫ్‌బోర్డు భూములని ప్రభుత్వం నిస్సిగ్గుగా ప్రకటించడం అందరినీ ఆగ్రహావేశాలకు గురిచేసింది. సాక్షాత్తు కాంగ్రెస్ పెద్ద కుటుంబం సభ్యురాలు, స్వయంగా క్రిస్టియన్ ప్రియాంక గాంధీ వాద్రా వయనాడ్ నుంచి బరిలోకి దిగారు. మూనాంబం గ్రామస్థుల కన్నీళ్లను తుడిచే ప్రయత్నం చేయకుండా వక్ఫ్ బిల్లును సమర్థిస్తున్నందుకు ఇప్పుడు తమ రాజకీయ అభిప్రాయాలను ప్రజలు మార్చుకోక తప్పదని కేథలిక్ చర్చి హెచ్చరిస్తున్నది.

వక్ఫ్ చట్టం–1995 దేశాన్ని దారుణ సంక్షోభం వైపునకు తోసుకుపోతున్నది. భారతీయ వ్యవస్థకు, భారతీయ వైవిధ్యానికి ఇదొక శాపం. పీవీ నరసింహారావు తీసుకువచ్చిన ఈ చట్టంలోని 40వ నిబంధన వక్ఫ్ బోర్డులకు ఇంతటి దుర్మార్గపు అధికారాలను కట్టబెట్టింది. కాంగ్రెస్‌కు హిందువులంటే విరోధం. హిందూ సంస్కృతి అన్నా ద్వేషమే. ఇటీవల ఒక దశాబ్దంగా రైతుల పైనా కక్ష కట్టినట్టు వ్యవహరిస్తున్నది. విజయపురి ఇదే చెబుతోంది. ★

04 నవంబర్ 2024, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




28లో

కథ

**బస్తీ బడాపన్**

– దాసరి మోహన్




ద్రవిడవాదం నీరుగారుతోందా? (జాతీయం) - 12
ప్రణాళికాబద్ధంగా ఆలయాలపై దాడులు (తెలంగాణ) - 14
అమరావతి పునర్నిర్మాణం ప్రారంభం (ఆంధ్రప్రదేశ్) - 16
సరిహద్దులలో శాంతి కోసం ఒప్పందం (అంతర్జాతీయం) - 24
గ్యాంగ్‌స్టర్‌ల స్వర్గధామం కెనడా (అంతర్జాతీయం-1) - 32
విజయవాడలో 'హైందవ శంఖారావం' (పిలుపు) - 34
కళల మణిదీపికలు (మహిళ) - 38
ఓ అమ్మాయి అంతరంగం -పి.వి.ఎస్. కృష్ణకుమారి (కథ) - 40
నాడు ఆనంద్...నేడు అర్జున్ ! (క్రీడ) - 43
కంచికి చేరిన 'క'థ! (సినిమా) - 50




# స్వదేశీ,

"స్వదేశీనా? ఏంటి మమ్మల్ని పదిహేనవ శతాబ్దానికి తీసుకువెడదామనుకుంటున్నారా?"... నాయకుల ఎగతాళి.
"అయినా ఆర్ఎస్ఎస్‌కు ఆర్థికశాస్త్రం ఏం తెలుసు?".. మేధావుల అహంకారం...
"స్వదేశీ జాగరణ్ మంచ్ వాజ్‌పేయి ప్రభుత్వానికి అసలైన ప్రతిపక్షమా?" అంటూ పత్రికల ఎత్తిపొడుపులు...

స్వదేశీ జాగరణ మంచ్ తన మూడు దశాబ్దాల ప్రయాణంలో ఎదుర్కొన్న అనేకానేక వెటకారాలు, ఎత్తిపొడుపులూ, విమర్శలను అధిగమిస్తూనే, నేటి ప్రభుత్వ విధానాలలో స్వదేశీ అంశాలు ఉండేలా ప్రభావితం చేసిందంటే అతిశయోక్తి కాదేమో! ప్రపంచ వాణిజ్య సంస్థ షరతులను గుడ్డిగా ఆమోదించవద్దని, జన్యు మార్పిడి చేసిన విత్తనాలను అమ్మే ఎమ్మెన్సీలకు వ్యతిరేకంగా, వాజ్‌పేయి ప్రభుత్వ కాలంలో పెట్టుబడుల ఉపసంహరణకు వ్యతిరేకంగా దేశమే ప్రధానమంటూ స్వదేశీ జాగరణ్ మంచ్ ఉద్యమించి, అనేక విజయాలను సాధించింది. భారతీయ అభివృద్ధి నమూనాతోనే దేశ అభివృద్ధి సాధ్యమని విశ్వసించి, అందుకు అనుగుణమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ, స్వదేశీ వస్తువులను ప్రోత్సహిస్తూ, ప్రజలలో స్వదేశీ భావనను జాగృతం చేస్తూ వస్తోంది.

నిజానికి స్వదేశీ భావన శతాబ్దమున్నర కాలం కిందటిది. అనంతరం లోకమాన్య బాలగంగాధర్ తిలక్, వీరసావర్కర్, అరవింద ఘోష్, మహాత్మా గాంధీ వంటి దార్శనిక నాయకులు స్వాతంత్ర్య పోరాటానికి దీనిని మార్గదర్శక శక్తిగా మార్చారు.




నేటి 'ఆత్మనిర్భర్ భారత్', 'మేకిన్ ఇండియా', 'విశ్వకర్మ యోజన' సహా పలు పథకాలలో అంతర్లీనంగా ఉన్నది స్వదేశీ భావనే. దేశ ప్రజలలో జాగరూకమై ఉన్న ఈ భావనను మేల్కొలిపేందుకు, దీనిని ఒక జీవన విధానంగా అలవాటు చేసేందుకు స్వదేశీ జాగరణ్ మంచ్, స్వావలంబి అభియాన్ సహా పలు సంస్థలతో కలిసి పని చేస్తూ జిల్లా, మండల స్థాయి వరకూ వ్యాపించింది. పేదల ఆదాయం పెరిగే వరకూ, ఉపాధి, నైపుణ్యాలు పెరగనంత వరకూ నిజమైన అభివృద్ధి సాధ్యం కాదన్నది స్వావలంబి భారత్ అభియాన్ విశ్వసించి ప్రచారం చేస్తోంది. అట్టడుగు స్థాయిలో ఉన్న సమాజానికి, జాతీయ స్థాయిలో ఉన్న విధానకర్తలకు మధ్య లంకెగా మారే స్థితికి ఎదిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేయడం, ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వానికి తెలిసేలా చేయడం ద్వారా పరోక్షంగా విధాన రూపకల్పనను ప్రభావితం చేస్తోంది.

స్వదేశీని ఒక జీవన విధానం చేయడానికి అత్యంత ముఖ్యమైన ఆర్థిక స్వేచ్ఛను భారత్ స్వాతంత్ర్యాన్ని సాధించిన కొన్ని దశాబ్దాల తర్వాత కూడా పొందలేకపోవడం ప్రమాదకరమని భావించి భారతీయ మజ్దూర్ సంఘ్, భారతీయ కిసాన్ సంఘ్, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తదితర సోదర సంస్థలతో కలిసి 1980ల్లో స్వదేశీ కోసం ఉద్యమించారు. ఈ ఉద్యమానికి ఒక స్వరూపాన్ని ఇచ్చేందుకు స్వదేశీ జాగరణ్ మంచ్‌ను ప్రారంభించాలని నిర్ణయించి, 1991, నవంబర్ 22న నాగపూర్‌లో మొదలుపెట్టారు. బీఎంఎస్, బీకెఎస్ వ్యవస్థాపకులైన దత్తోపంత్ ఠెంగ్డే మార్గదర్శనంలో జాతీయ సంస్థలు బిఎంఎస్, ఎబివిపి, బికెఎస్, అఖిల్ భారతీయ గ్రాహక్ పంచాయత్, సహకార భారతి ఈ నిర్ణయం తీసుకున్నాయి. తమ ఉద్యమాన్ని సరైన దిశలో ముందుకు తీసుకు వెళ్లేందుకు ఒక కేంద్ర కమిటీని ఏర్పాటు చేసి, దానికి కన్వీనర్‌గా నాగపూర్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్‌గా డా॥ ఎం.జి బోకారేను నియమించారు. మరు ఏడాది, జనవరి 12న వివేకానంద జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా భారీ ఉద్యమాన్ని ప్రారంభించారు. అన్ని రంగాలకు చెందిన, భిన్న భావజాలాలకు చెందినప్పటికీ అందరూ ఆర్థిక సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించేందుకు కలిసి వచ్చారు.

దేశం స్వయం సమృద్ధిని సాధించాలంటే, వ్యవస్థాపకతను మించిన మార్గం లేదన్న భావనతో యువతను వ్యవస్థాపకత దిశగా మళ్లేలా మార్గ దర్శనం చేస్తూ, ప్రోత్సాహాన్ని అందిస్తూ వస్తున్న తెలంగాణ రాష్ట్ర శాఖకు చెందిన స్వదేశీ జాగరణ్





# స్వావలంబనే భవిష్యత్తు

మంచ్, స్వదేశీ అభియాన్‌లు సంయుక్తంగా హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో అక్టోబర్ 23 నుంచి 27వరకు 'స్వదేశీ మేళా'ను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మేళాను ప్రారంభించారు. మేళాలో భాగంగా సాఫ్ట్‌వేర్, ఫార్మా, బ్యాంకింగ్ వంటి సంస్థల సహకారంతో 'ఉద్యోగ మేళా'ను నిర్వహించి, అర్హులైన నాలుగువేలమంది యువతకు నియామక పత్రాలను అందించారు. మేళాలో చేతివృత్తుల వారు, హస్తకళాకారులు, ఆయుర్వేద ఉత్పత్తులు, మూలికలు, దేశవాళీ విత్తనాలు, దుస్తులు సహా డ్రోన్లను కూడా ప్రదర్శించారు. ముఖ్యంగా, చిరుధాన్యాలతో చేసిన ఆహార ఉత్పత్తులు, మూలికలు కలిపి తయారు చేసిన టీ వంటివి సందర్శకులను బాగా ఆకర్షించాయి.

ఈ స్వదేశీ మేళాను కేవలం ఒక ప్రదర్శనగా కాకుండా, అవగాహనా కార్యక్రమానికి వేదికగా కూడా నిర్వాహకులు ఉపయోగించడం విశేషం. ఇందులో భాగంగా పలు రంగాలకు చెందిన ప్రముఖులు స్వదేశీ అంటే ఏమిటి, దాని ప్రాధాన్యం ఎంతటిది వంటి అంశాలపై ప్రసంగించి, యువతలో స్ఫూర్తిని నింపే యత్నం చేశారు.

### మహత్తర దేశానికి వారసులం

తొలిరోజు ఉదయం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వేదిక్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. సదాశివమూర్తి ప్రసంగిస్తూ, 'సర్వే భవంతు సుఖినః' అంటూ ఈ మొత్తం ప్రపంచపు సంక్షేమాన్నీ కోరే సంస్కృతి కేవలం భారతీయులదేనని అన్నారు. కనుక, భారతీయులు మాత్రమే ప్రపంచానికి నాయకత్వం వహించగలరని చెప్పారు. ప్రకృతి సహా సకల జీవరాశుల సమాజానికీ, ప్రపంచానికీ మధ్య ఉన్న గొప్ప అంశమే దేశమని, మనది భారతదేశం, ఇందులో 'భా' అంటే జ్ఞానమని, 'రత' అంటే ఆసక్తి అని, జ్ఞానం పట్ల ఆసక్తి కలిగిన వారు భారతీయులని వివరించారు. అంతటి మహత్తర ప్రదేశానికి మనం ప్రతినిధులమని అన్నారు. మన ఆధునిక విద్యలో ప్రాచీన విజ్ఞానాన్ని సమ్మిళితం చేయవలసిన అవసరం ఉందని సూచించారు. నిన్నటి రష్యా మనసు కమ్యూనిజంలో ఉంటే, చైనాది మావోయిజంలో, యుఎస్ఏది ఆధిపత్యంలో ఉండగా, భారత్ ఆత్మ మాత్రం జ్ఞానంలో ఉందని అన్నారు. ప్రకృతిలోని ప్రతి అంశం బోధిస్తుందనే విషయాన్ని మనం అంగీకరించామని, అందుకే మన జ్ఞాన వ్యవస్థలు మనకు చక్కటి వ్యక్తిత్వాన్ని, మూర్తిమత్వాన్ని అందిస్తాయన్నారు. మనం వ్యక్తిత్వం అనే పదాన్ని తరచుగా వింటుంటామని, దాని అర్థం మనలో ఉన్న నైపుణ్యాల గురించి మనకు తగిన అవగాహన ఉండడమే అని ఆయన వివరించారు. మనలోకి మనం చూసుకున్నప్పుడే ఇది ప్రారంభం అవుతుందని, ఎందుకంటే మన మనసులో ఉండే అద్దం సత్యాన్ని ప్రతిఫలిస్తుందని అన్నారు. మనలో ఉన్న నైపుణ్యాలను పెంచి పోషించనంత వరకూ అవి వృథా అని, అందుకు కారణం



సమాజంలో మనలో ఉన్న నైపుణ్యాలను బట్టే మన వ్యక్తిత్వాన్ని గుర్తిస్తుందని ఆయన బోధించారు. ఈ నైపుణ్యాలను దేశ సేవకు ఉపయోగిస్తే, దేశం నీ సంరక్షణను చూసు కుంటుందంటూ ఆయన విద్యార్థులకు ప్రేరణ ఇచ్చారు. మన జ్ఞాన వ్యవస్థలు అన్నీ ప్రకృతి అనుకూల జీవనాన్ని బోధిస్తాయని, అందుకు అనుగుణమైన అభివృద్ధిని సూచిస్తాయని ఆయన అన్నారు. రక్షణ, ఆరోగ్యం, ప్రకృతి సంరక్షణ, ఆర్జన సహా పలు అంశాలను మన ప్రాచీన శాస్త్రాలు బోధిస్తాయని ఆయన తెలిపారు. తాను మార్గాన్ని, ద్వారాన్ని సూచిస్తున్నానని, జ్ఞానాన్ని విద్యార్థులే అభివృద్ధి చేసుకోవాలని, మనకు తోడ్పడే జ్ఞానాన్ని ఆర్జించాలని ఆయన వారికి దిశానిర్దేశం చేశారు.

**అమెరికా సాయం లేకున్నా అభివృద్ధి**

సాయంత్రం సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్ఎస్ఎస్ సీనియర్ ప్రచారక్ రవికుమార్ అయ్యర్ మాట్లాడుతూ, ఆంధ్ర దేశ గొప్పతనాన్ని వివరించారు. మహమ్మద్ ఘోరీ దాడి చేసిన సమయంలో ఆ ప్రాంత రాజును వివాహం చేసుకున్న తెలుగు మహిళ



నాయకీదేవి అతడిని యుద్ధంలో ఓడించిందని, అతడు తిరిగి దండెత్తలేదని ఆయన చెప్పారు. తంజావూరును తెలుగు నాయక వంశ రాజులు పాలించారని ఆయన అన్నారు. మనం ఈ దేశ పౌరులమైనందుకు గర్వంతో ఉన్నప్పుడే మనం నిశ్చితంగా మాట్లాడగలమని ఆయన అన్నారు. ఆ దృఢ విశ్వాసమే మనకు సాహసాన్ని ఇస్తుందని ఆయన చెప్పారు. మారిషస్‌కు ప్రధానులు, అధ్యక్షులు అయిన వారిలో 28మంది భారతీయ సంతతికి చెందిన వారేనని ఆయన తెలిపారు. వెస్టిండీస్ ప్రధానిగా భారతీయ సంతతికి చెందిన కమలా బిశ్వేశ్వర్ ఉన్నారని, పోర్చుగల్ ప్రధానిగా ఉన్న డీ కోస్టా గోవా నుంచి వెళ్లి అక్కడ స్థిరపడిన వారి సంతతేనని, యుఎస్ఎ తొలి మహిళా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌లో భారతీయ రక్తం ప్రవహిస్తోందని, ఒకవేళ ఈసారి ట్రంప్ గెలిస్తే, సెకెండ్ లేడీ (ఉపాధ్యక్షుడి భార్య) భారతీయ సంతతికి చెందిన మహిళే అవుతుందని ఆయన వివరించారు.

అమెరికా తోడ్పాటు లేకుండానే భారత్ పురోగమించగలదని ఆయన అన్నారు. అందుకు ఉదాహరణగా, కొవిడ్ మహమ్మారి కాలంలో ప్రపంచమంతా విలవిలలాడుతున్న సమయంలో స్వదేశీ సంస్థ అయిన భారత్ బయోటెక్ తొలి టీకా 'కోవాక్సిన్'ను తయారు చేయడాన్ని, దానిని పేద దేశాలకు ఉచితంగా సహా మొత్తం 98 దేశాలకు కోట్లాది వాక్సిన్లను ఎగుమతి చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మనం పురోగమిస్తున్నప్పుడు, అభివృద్ధి చెందుతున్నప్పుడు మనం అన్ని దేశాలనూ సంరక్షిస్తూ ముందుకు వెడతామని ఆయన అన్నారు. అనేకమంది ప్రొఫెషనల్స్ ఇతర దేశాలకు వలస వెళ్లడాన్ని విమర్శిస్తుంటారని, కానీ, ఆ ఎన్ఆర్ఐలు మనకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నారని ఆయన వివరించారు. ఆ రకంగా మన సంస్కృతిని, సభ్యతను ఇతర దేశాలకు తీసుకువెళ్లగలుగు తున్నామని చెప్పారు. ప్రధానమంత్రి కూడా యోగాను అంతర్జాతీయం చేయడంలో కీలకపాత్ర పోషించారని చెప్పారు. భారత్ అంతర్జాతీయ యవనికపై తన ఉనికిని సుస్థిరం చేసుకుంటున్న తరుణంలో ప్రవాసీ భారతీయులు అందుకు ఎంతో తోడ్పడుతున్నారని ఆయన వారిని ప్రశంసిం చారు. భారత్‌ను ఇష్టపడని వారు దాని అభివృద్ధిని అడ్డుకోవడానికి నిరంతరం కృషి చేస్తున్న విషయాన్ని ఆయన పట్టి చూపారు. ప్రపంచంలోనే అతిపెద్ద యూనికార్న్‌లు భారత్ నుంచి వచ్చినవేనని, నేటి యువత భారీ స్థాయిలో ఆవిష్కరణలు జరుపుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

**కొనుగోలే శక్తి పెరిగింది**

మరురోజు సాయంత్రం జరిగిన సభలో అతిథులుగా పాల్గొన్న జెఎన్‌టియు ప్రొఫెసర్ వేంకటేశ్వరరావు, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి ప్రసంగించారు. ప్రపంచంలోని అగ్రరాజ్యాలు మూడవ ప్రపంచ దేశాలపై పెత్తనం చేసేందుకు వినియోగ వస్తువులను ఆ దేశాలకు అమ్మి, వారిని దోచుకునేందుకు ప్రయత్నం చేశారని గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి చెప్పారు. ఈ క్రమంలో స్థానిక పరిశ్రమలు కుదేలు అయ్యాయని ఆయన అన్నారు. దిగుమతి సుంకాన్ని తప్పించుకొని, ఈ దేశాలపై పెత్తనం చేయాలనే ప్రపంచ వాణిజ్య సంస్థను



ముందుకు తెచ్చారని, ఈ క్రమంలోనే స్వదేశీ జాగరణ్ మంచ్ ఏర్పాటు గురించి ఆలోచన జరిగి, అది సాకారమైందని ఆయన సంస్థ ఆవిర్భావం గురించి వివరించారు. గ్రామ స్థాయిలో ఉండే చిన్న చేతివృత్తుల వారికి కూడా అవకాశం ఇవ్వడం, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడమే దీని లక్ష్యంగా ఉందని ఆయన అన్నారు. ప్రస్తుతం అటువంటి పని చేస్తున్న వారికి సాంకేతికతను అందించడం ద్వారా ఉత్పత్తిని పెంచవచ్చని చెప్పారు. నేడు ప్రజలలో ఖర్చు పెట్టే తత్వం పెరిగిందని, ఈ క్రమంలో వారు స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా దేశాభివృద్ధిలో పాలుపంచుకోవచ్చని ఆయన అన్నారు. నేటి పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం, దేశవాళీ విత్తనాలను పరిరక్షించడం అత్యవసరం అని ఆయన చెప్పారు.

**భారత్ ఓ యువరాజ్యం**

మరురోజు జరిగిన సభలో లీడర్‌షిప్ కోచ్ వై.నవీన్‌కుమార్, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ జి. సతీశ్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు కేవలం ఉద్యోగం చేయాలన్న ఆలోచనలో ఉండకుండా, వ్యవస్థాపకత దిశగా కూడా ఆలోచించాలని నవీన్‌కుమార్ అన్నారు. పారిశ్రామిక వేత్త అదానీ ముందు ఓడరేవులో పని చేశాడని, ఒకసారి మాట్లాడుతూ తాను ఓడరేవునే కొంటా నంటూ అనడమే కాదు, ఆ స్థాయికి ఎదిగాడని ఆయన వివరించారు. మంచి వ్యవస్థాపకత అనేది మనతోనే ప్రారంభమవుతుందని ఆయన అన్నారు.

నేటి భారత్ శక్తి యువతేనని, ప్రస్తుతం దేశ జనాభాలో 50 నుంచి 60 శాతం యువతే ఉన్నారని సతీశ్‌రెడ్డి తెలిపారు. ఒక సర్వే ప్రకారం, రానున్న ఐదారేళ్లల్లో భారతదేశంలో నైపుణ్యాలు కలిగిన యువత 40 శాతానికి చేరుకుంటుందని, ఇది ఎంతో సానుకూల పరిణామమని ఆయన అన్నారు. ఇటీవలి కాలంలో దేశంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. గతంలో దేశం మొత్తంలో కొద్ది ఇంజినీరింగ్ కాలేజీలు, ఐఐటీలు ఉండేవని, కానీ నేడు ప్రతి జిల్లాలోనూ ఒక యూనివర్సిటీనే వచ్చిందని చెప్పారు. నేడు వేలాది ఇంజినీరింగ్ కాలేజీల నుంచి ప్రతి ఏడాదీ 14 లక్షల మంది ఇంజినీర్లు బయటకు వస్తున్నారని ఆయన గణాంకాలు చెప్పారు. ఇంతకు ముందు అనేకమంది వ్యక్తులు దేశంలో అవకాశాలు లేక విదేశాలకు వెళ్లి స్థిరపడ్డారని, కానీ ఇప్పుడు దేశంలో పరిణామాలు చూసి తిరిగి రావాలనుకుంటున్నారని ఆయన తెలిపారు. అలాగే, ఐఐటిల నుంచి బయటకు వచ్చిన వారిలో 75 శాతం మంది విదేశాలకు వెళ్లే వారని, కానీ నేడు వారు దేశంలోనే ఉండిపోతున్నారని, ఇది మారుతున్న యువత దృక్పధానికి ఒక ఉదాహరణ అని ఆయన అన్నారు. ప్రస్తుతం దేశంలో స్టార్టప్

కల్చర్‌కు ఎంతో ప్రోత్సాహం లభిస్తోందని, ప్రతి కాలేజీలోనూ వీటికి చేయూతనిచ్చేందుకు ఇన్‌క్యుబేషన్ సెంటర్లను ప్రారంభించారన్నారు. గతంలో పరిశ్రమ పెట్టడమే చాలా కష్టంగా ఉండేదని, ఒకవేళ పెట్టినా పెద్ద సంస్థలకు అనుబంధ సంస్థలుగా మాత్రమే పెట్టగలిగేవారని ఆయన అన్నారు. సాఫ్ట్‌వేర్ యాప్స్ తయారీలో 2016 నాటికి 450 స్టార్టప్‌లు వచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

నేటి యువత ఆవిష్కరణల దిశగా మొగ్గు చూపుతోందని, ముఖ్యంగా ప్రపంచంలో ఎక్కడా లేని ఉత్పత్తిని తయారు చేయాలని యోచిస్తోందని, అది ఎంతో అభినందనీయమైన, ప్రోత్సాహకరమైన విషయమని అన్నారు. అనుబంధ సంస్థల స్థాయి నుంచి ప్రపంచంలోనే పోటీ పడే స్థాయికి నేడు ఎదిగామని ఆయన అన్నారు. స్థానిక స్కైరూట్ అన్న స్టార్టప్‌కు వందల కోట్ల నిధులు వచ్చాయని ఆయన చెప్పారు. బెంగళూరుకు చెందిన సుహాస్ గోపీనాథ్ అనే బాలుడు తన 10 ఏళ్ల వయసులోనే కంపెనీని ప్రారంభించాడని, అతనికి పదిహేనేళ్లు వచ్చేనాటికి ఆ కంపెనీ విలువ పెరగడమే కాదు, ఫార్చ్యూన్ 500 కంపెనీలలో ఒకటిగా ఎదిగిందని ఆయన చెప్పారు. స్టార్టప్‌లు పెరగడమే కాదు, నేడు కళాశాలల్లో పరిశోధన, అభివృద్ధి కూడా ప్రోత్సాహం లభిస్తోందని అన్నారు. నేడు మనం అనేక రంగాలలో ఎగుమతులు చేయగలుగుతున్నామని చెప్పారు. ఒకనాడు మన దేశం రక్షణ దిగుమతులలో ఒకటి లేక రెండవ స్థానంలో ఉండేదని, నేడు మనం వాటిని ఎగుమతులు చేసే దశకు ఎదిగామని ఆయన చెప్పారు. డిఆర్‌డిఓ చేపట్టిన బయోడిగ్రేడబుల్ బ్యాగులు నేడు తిరుమలలో కూడా ఉపయోగిస్తున్నారని, విస్తర్లు, గ్లాసులు తయారు చేసే సాంకేతికతకు కేవలం 5 నుంచి 7 లక్షల పెట్టుబడి ఉంటే చాలని వివరించారు. ఎక్కడి నుంచి వచ్చామన్నది ముఖ్యం కాదని, ఎలా ఆలోచిస్తున్నారనేది ముఖ్యమని ఆయన అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే







ఆవిష్కరణ చాలా ముఖ్యమని తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్ కలను సాకారం చేయాలంటే యువత ఆవిష్కర్తలు కావాలని ఆయన అన్నారు.

ఈ స్వదేశీ మేళాను నిర్వహిస్తున్నందుకు, యువతకు ఉపాధి కల్పన కోసం డ్రైవ్‌ను చేపట్టినందుకు ఆయన నిర్వాహకులను అభినందించారు.

**అమ్మభాష, స్వధర్మం విస్మరించవద్దు**

నాటి సాయంకాల సభలో ఎన్‌హెచ్‌ఆర్‌సి చైర్‌పర్సన్ శ్రీమతి విజయభారతి పాల్గొని ప్రసంగిస్తూ, మన ఆలోచన, ఆచరణ, వస్త్రధారణ భాష అన్నీ స్వదేశీగా ఉండాలన్న విషయాన్ని మరువరాదని సూచించారు. మాతృభాష, స్వధర్మం, స్వాభిమానం మరవద్దన్నారు.

**రామరాజ్య కల్పనే స్వదేశీ**

మేళా చివరి రోజున ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆర్ఎస్ఎస్ సీనియర్ ప్రచారక్, స్వదేశీ జాగరణ మంచ్ అఖిలభారత సహ సంఘటన మంత్రి, సతీశ్, వీరేంద్రగౌడ్ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అపారమైన చారిత్రిక వైభవం కలిగిన హైదరాబాద్‌లో ఈ కార్యక్రమం జరగడం పట్ల మంత్రి జూపల్లి హర్షాన్ని వ్యక్తం చేశారు. మన సంప్రదాయాలూ, సంస్కృతే అన్ని ప్రాంతాలనూ కలుపుతాయని, భిన్నత్వంలో ఏకత్వమే మన గొప్పతనమని ఆయన అన్నారు. స్వయం సమృద్ధికి ప్రాధాన్యతను ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం తగిన సహకారాన్ని అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

అనంతరం ఎస్‌జేఎం దక్షిణ ప్రాంత ప్రముఖ్, కేంద్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా॥ లింగమూర్తి ప్రసంగిస్తూ, 'జననీ జన్మ భూమిశ్చ..' అన్న శ్రీరాముడే స్వదేశీని ప్రారంభించాడని ఆయన అన్నారు. నిజానికి రామరాజ్య కల్పనే స్వదేశీ అని ఆయన అన్నారు. ఆర్థిక వైభవాన్ని తేవడమే స్వదేశీ అన్నారు. మన భాషను, జీవనవిధానాన్ని అలవరచుకోవడమే స్వదేశీ అని ఆయన ఉద్వేగంగా చెప్పారు. జోహో కంపెనీని ప్రారంభించిన శ్రీధర్ వేంబు జీవనశైలి స్వదేశీ అని ఆయన ప్రశంసించారు. ఎక్కడో అమెరికాలో ఉన్న ఆయన భారత్‌కు వచ్చి తమిళనాడులో కుగ్రామంలో ఉంటూ తన కార్యకలాపాలను నిర్వహించడాన్ని ఆయన వివరించారు. దాదాపు 17వ శతాబ్దం వరకూ ఎగుమతులు చేసిన ఏకైక దేశం భారత్ అని ఆయన అన్నారు. స్వదేశీ ఆర్థిక వ్యవస్థ ద్వారా జీవన విధానాన్ని నడిపించాలని, ఇందులో అందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపిచ్చారు.

దాదాపు 19 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో స్వదేశీ మేళాను నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ మేళ ఆత్మ స్వదేశీ అని ఆయన అన్నారు. నేడు ప్రపంచంలోనే అతిపెద్ద నాలుగవ ఆర్థిక వ్యవస్థగా బారతదేశం ఉందని, 2047 నాటికి మనం మొదటి స్థానంలోకి వచ్చే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయని ఆయన చెప్పారు. జపాన్, చైనా, అమెరికా, యూరోప్ దేశాలలో వృద్ధ జనాభా పెరుగుతోందని, మన దేశంలో సగటు వయసు 27 సంవత్సరాలని, అయితే మనం కూడా మన జననాల రేటును పెంచుకోకపోతే, ఆ దేశాలు ఎదుర్కొంటున్న పరిస్థితులనే ఎదుర్కొంటామని ఆయన అన్నారు. దేశం ఎప్పుడూ యువ దేశంగా ఉన్నప్పుడే ఆ దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.

వ్యవస్థాపకత అనేది భారతీయ డిఎన్ఎలోనే ఉన్నదని, ప్రాచీన భారతం స్వయం సమృద్ధిగా ఉందంటే అందుకు కారణం వ్యవస్థాపకతేనని చెప్పారు. ఇదే దేశభక్తి అని ఆయన అన్నారు.

కార్యక్రమాన్ని ముగిస్తూ, అక్టోబర్ 23 నుంచి 27 వరకూ సాగిన మేళా నివేదికను నిర్వాహకులలో ఒకరైన ఇంద్రసేనారెడ్డి వివరించారు. దాదాపు రెండు నెలల పాటు శ్రమించి 15 బృందాలతో ఈ ఏర్పాట్లు చేయగలిగాయని ఆయన చెప్పారు. గంగోత్రి గ్రూప్ సహా పలు సంస్థలు తమకు సహకరించాయని అన్నారు.

# వైవిధ్య భరితం ఈ మేళా

ఒకవైపు అవగాహన కార్యక్రమాలు, మరొకవైపు ఆకట్టుకునే ప్రదర్శనతో ప్రజలలో స్వదేశీ పట్ల జాగృతిని తెచ్చే కార్యక్రమాన్ని నిర్వాహకులు తమ భుజస్కంధలపై వేసుకున్నారు. మేళా చూసేందుకు వచ్చినవారే కాదు, అక్కడ ప్రసంగించిన ప్రతి అతిథీ, ప్రదర్శన మొత్తాన్ని సందర్శించి, స్టాళ్లు నిర్వహిస్తున్న వారితో ముచ్చటించడం విశేషం.

### వేప చెక్కతో విగ్రహాలు

శిలలపై కాకుండా చెక్కపై కూడా విగ్రహాలను చెక్కి అవి రాతివేమోననే భ్రమకు లోనయ్యేలా చేసిన శిల్పి కరీంనగర్‌కు చెందిన రాము. శ్రీ వేంకటేశ్వరుడు సహా పలు దేవతా విగ్రహాలను, రకరకాల సైజుల్లో చెక్కిన ఆయన 'జాగృతి'తో మాట్లాడుతూ, చిన్న విగ్రహమైనా, పెద్ద విగ్రహమైనా కావలసిన ఏకాగ్రత ఒక్కటేనన్నారు. బ్యాచలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చేసిన రాము, తనకు ఎంతో ఇష్టమైన





శిల్పకళను తన వృత్తిగా ఎంచుకుని, అనేక ప్రదర్శనలు, మేళాల్లో తన విగ్రహాలను ప్రదర్శి స్తున్నట్టు చెప్పారు. పూర్తిగా వారసత్వంగా వచ్చింది కాకపోయిన ప్పటికీ, తన తాతగారు శిల్పాలు చెక్కేవారని, శిల్పి కావడానికి అదే తనకు ప్రేరణ అని ఆయన అన్నారు. విగ్రహాలను చెక్కేటప్పుడు వేలి గోరుతో సహా ప్రతి అంగానికీ కొలతలు ఉంటాయని, వాటికి అనుగుణంగా చెక్కుతామని వివరించారు. ముఖ కవళికలు, రకరకాల భావాలను ఒలికేలా చెక్కాలనుకున్నప్పుడు సృజనాత్మకంగా ఉండాల్సిందేనని అన్నారు. పూర్తిగా చేతితో చేసే ఈ పనిలో సహాయపడేందుకు తనకు ఐదుగురు సహాయకులు ఉన్నారని ఆయన చెప్పారు. గ్రామాలలో అనేక చేతివృత్తులలాగానే, ఈ కళ కూడా అంతరించిపోతోందని, రుణాలు లభ్యం కావడం కూడా అంత సులభం కాదని ఆయన అన్నారు. చేతితో చెక్కిన విగ్రహం కనుక సహజంగానే యంత్రం ఉత్పత్తి చేసిన దానికన్నా ఖరీదు ఎక్కువ ఉంటుందని, దానివల్ల తమ ఉత్పత్తులు సాధారణ ఎగ్జిబిషన్లలో అంత ఎక్కువగా అమ్ముడుపోవని, ఒక రకంగా చూస్తే ఆర్థికంగా అంత లాభదాయకం కాదని అన్నారు. తన ఉత్పత్తులను దేశ వ్యాప్తంగా జరిగే ప్రదర్శనలలో, స్టూడియోలలో ప్రదర్శిస్తానని, ప్రకృతి, తదితర విగ్రహాలకు ఎక్కువ డిమాండ్ కనిపిస్తుందని అన్నారు.

### సేవాభారతి స్టాల్

చక్కటి సువాసనలు వెదజల్లే కొవ్వొత్తులు, అందమైన రబ్బర్ బాండ్లు, ఫోటో ఫ్రేమ్‌లు, బ్యాగులు సహా చేతితో చేసిన ఉత్పత్తులను ప్రదర్శనకు పెట్టారు ఆ యువతులు. సేవాభారతికి చెందిన ఆ స్టాల్‌లో రకరకాల రూపాలలో పరిమళాలు వెదజల్లే క్యాండిల్స్ ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటాయి. సేవా భారతి చేపట్టే పలు కార్యక్రమాల్లో భాగంగా, కౌమారంలో ఉన్న ఆడపిల్లలకు పలురకాల చేతివృత్తులలో ఇచ్చిన శిక్షణనిచ్చి, వారిని ఉత్పత్తులు చేసేలా ప్రోత్సహించి, మార్కెటింగ్ చేస్తున్నారు. కిశోరి దశలో ఉన్న ఆ బాలికలకు జీవించడానికి ఒక కళతో పాటు, పాకెట్ మనీ కూడా వస్తుంది. మురికివాడలలో ఉన్న పిల్లలు, స్కూల్ డ్రాప్ ఔట్లను ఎంపిక చేసి వారికి శిక్షణ నిస్తున్నారు. రిటర్న్ గిఫ్ట్






ఇవ్వాలనుకున్న వారు తమకు ఆర్డర్ ఇస్తే సరసమైన ధరలో చేసిపెడతామని స్టాల్‌లో ఉన్న యువతులు వివరించారు.

### స్వచ్ఛమైన పళ్లరసాలు

ఎటువంటి రంగులు, రుచికి అవసరమైన పదార్థాలను కలుపకుండా స్వచ్ఛమైన పళ్లరసాన్ని అందిస్తోంది ఎన్‌కోల్డ్ సంస్థ. శరీరానికి తగిన ఫలాన్ని ఎంచి దాని రసాన్ని ఇంటి వరకూ సరఫరా చేస్తున్నారు ఈ సంస్థవారు. మూడు రోజుల వరకూ మాత్రమే నిల్వ ఉండే ఈ రసాలలో మామూలు రసాలలో కన్నా 40 శాతం అధిక పౌష్ఠికత ఉంటుందని సంస్థ ప్రతినిధి కృత్తిక తెలిపారు. బీపీ, షుగరు వంటి వ్యాధులు చర్మం, వెంట్రుకలు, రోగ నిరోధకత వంటివాటి కోసం పౌష్టికాహార నిపుణుల సలహా మేరకు తాము పళ్లరసాలను తయారుచేసి సరఫరా చేస్తున్నామన్నారు. నగరంలో నాలుగువేల మంది క్లైంట్లు ఉన్నారని, నెలకు రూ. 3,000కు 26 సీసాల పళ్ల రసాన్ని (250 ఎం.ఎల్)అందిస్తామని చెప్పారు. వ్యక్తులు తమ సమస్యకు అనుగు ణంగా నెల, మూడు నెలల ప్యాకేజీలను ఎంచుకోవచ్చున్నారు.

### కార్యక్రమ సారథులు



ఫోటోలో : స్వదేశీ మేళా కన్వీనర్ బి. ఇంద్రసేనారెడ్డి, హరీష్ బాబు – స్వదేశీజాగరణ్ మంచ్, స్వప్నాబల్లా స్టాల్స్ ఇంఛార్జ్, కేశవ సోనీ మీడియా సంబంధాలు











**చిరుధాన్యాలతో 'మావీ న్యూట్రిషన్'**

జి.20 సదస్సుకు వచ్చిన నాయకులకు ప్రధాని నరేంద్ర మోదీ చిరుధాన్యాలతో చేసిన రకరకాల పదార్థాలను తినిపించారు. చిరుధాన్యాల ప్రాధాన్యం వారికి తెలియ చేయడమే కాక, అవి ఎంత పౌష్టికతను ఇస్తాయో తెలియ చేయడమే అందులోని ప్రధాన ఉద్దేశం. చిరుధాన్యాలు సరే వాటితో ఏమేం వండి




వడ్డించుంటారో కదా అనుకున్నామప్పుడు, కానీ ఏమైనా చేసుకోవచ్చని రుజువు చేస్తోంది మావీ న్యూట్రిషన్ సంస్థ ఇన్‌స్టాంట్ ఇడ్లీ, దోశ పిండ్ల దగ్గర నుంచి నూడుల్స్, పలావ్, రోటీల వరకూ తయారు చేసి వినియోగదారులకు అందిస్తోంది. వీరి ఉత్పత్తులలో ముఖ్య ఆకర్షణ 'టీ కప్పులు', మనం ఐస్‌క్రీం కోన్‌ను తిన్నట్టుగానే టీతో పాటు తినే విధంగా తయారు చేసిన కప్పులు చూడముట్టగా అనిపిస్తాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి చిరుధాన్యాలను సేకరించి, వీటిని తయారు చేస్తున్నామని, పౌష్టికాహార నిపుణుల సలహా మేరకే తమ పదార్థాలలోని పాళ్లు ఉంటాయని వివరించారు. అన్ని వయసుల వారికీ తగిన ఆహార పదార్థాలను తయారు చేస్తున్న ఈ సంస్థకు ఆన్‌లైన్ డెలివరీ సౌకర్యం కూడా ఉన్నది.

**స్వదేశీ ఉత్పత్తులు**

ఏ మాత్రం రసాయనాలు లేని జీవ వ్యవసాయం ద్వారా పండిన వస్తువులను, చేత్తో తయారు చేసిన సబ్బులనూ ప్రదర్శనకు పెట్టిన రాజుశెట్టి, తాను 2017లో పొందిన వ్యవసాయ శిక్షణే తనకు స్ఫూర్తినందించిందని చెప్పారు. ఆరోగ్యానికి ఎటువంటి హానీ కలిగించని, రసాయన రహిత ధాన్యాలను, సువాసనలు వెదజల్లే నెయ్యి, నూడుల్స్, బిస్కెట్లు తదితరాలను ప్రదర్శనకు పెట్టారు. ఇందులో రసాయన రహితంగా చేసిన అత్తర్లు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. పసి పిల్లలకు




కూడా పూసేందుకు వీలుగా ఎటువంటి రసాయనాన్ని వాడకుండా వాటిని తయారు చేశామని ప్రదర్శకులు చెప్పారు. రసాయన ఆధారిత వస్తువులు కాకుండా మనకు సంప్రదాయంగా వస్తున్న గోమూత్రం, పేడ వంటివి ఉపయోగించి చేసే వ్యవసాయం ద్వారా వచ్చే వస్తువులు మనిషి ఆరోగ్యాన్ని అన్నిరకాలుగా సంరక్షిస్తాయని ఆయన చెప్పారు. తాము ఇంటికి కూడా సరుకును పంపే సౌకర్యాన్ని కలిగి ఉన్నామని, కూకటపల్లి మెట్రో స్టేషన్ పక్కనే తమ స్టోర్ ఉందన్నారు.

**అర్బన్ క్లాప్‌కు ప్రత్యామ్నాయం సహాయక్**




నేటి బిజీ జీవితంలో అనేక పనులకు వ్యక్తులు ఆన్‌లైన్‌పైనే పడుతున్నారు. ఇల్లు సర్దడం నుంచి క్షవరం చేయడం వరకూ ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకుని, ఇంటికి పిలిపించి పూర్తి చేసుకుంటున్నారు. అయితే, ఇటువంటి యాప్‌ల ద్వారా వచ్చేవారి కారణంగా జరుగుతున్న దుస్సంఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. అందుకే, జనహిత సేవా ట్రస్ట్ సహాయక్ యాప్‌ను మార్కెట్‌లోకి తెచ్చింది. తమ యాప్‌లో బుక్ చేసుకున్న వారికి తమ వద్ద శిక్షణ పొందిన వ్యక్తులను పంపుతామని, నిర్వాహకులు యనమండ్ర గణేశ్ తెలిపారు.

**డ్రోన్ దీదీలకు డ్రోన్లు**

ప్రస్తుతం వ్యవసాయంలో కూలీల కొరత ఎక్కువగా ఉంది. పైగా రసాయనాలను నేరుగా వ్యక్తులే జల్లడం వల్ల ఆరోగ్యపరమైన దుష్పరిణామాలు సంభవిస్తున్నాయి. వీటన్నింటికీ పరిష్కారంగా, దేశీయంగా తయారు చేసిన డ్రోన్లను ఏరియల్ టెక్నాలజీస్ సంస్థ ప్రదర్శనకు పెట్టింది. ప్రధాన మంత్రి డ్రోన్ దీదీల పథకానికి అనుగుణంగా తయారు చేసిన ఈ డ్రోన్ వ్యవసాయంలో తక్కువ శ్రమ, తక్కువ ఖర్చు, ఎక్కువ పొదుపుతో అవసరమైన ఎరువులను జల్లేందుకు ఉపయోగించవచ్చు. సుమారు ఏడు లక్షల రూపాయల విలువైన ఈ డ్రోన్‌ను కొనుగోలు చేయడం ద్వారా కూలీ రేట్లను తగ్గించుకోవడమే కాదు, ఆదాయాన్ని కూడా పెంచుకోవచ్చని, సంస్థ యజమాని రమేష్ తెలిపారు. కేవలం పావు గంటలో ఒక ఎకరానికి ఎరువును జల్లడమే కాకుండా, మామూలుగా జల్లే ఎరువులో 15 నుంచి 25 శాతం ఎరువును ఆదా చేయవచ్చని ఆయన వివరించారు. ఈ మేళాలో ప్రధానంగా దేశీయంగా తయారు చేసిన వస్తువులే కాదు, స్వయంగా తయారు చేసిన వస్తువులను కూడా ప్రదర్శించడం విశేషం. గానుగాడించిన నూనెలు, ఇంట్లో చేసిన స్నాక్స్‌తో పాటుగా, దేశవాళీ విత్తనాలు, ఏకల్ అభియాన్ వారి దుకాణాలు, ఆయుర్వేద క్లినిక్, మూలికలతో తయారు చేసిన దవా చాయ్ స్టాల్, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి కృషి విజ్ఞాన కేంద్రం వారి ఉత్పత్తులు, వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత చీరలు, డ్రస్సులు, స్వెట్టర్లు, సాహితీ నికేతన్ వారి పుస్తకాలయం, గోమయంతో చేసిన ప్రమిదలు, వస్తువులను ప్రదర్శించారు. దాదాపు యాభై వేల మందికి పైగా ప్రజలు ఈ మేళాను సందర్శించారు.

**– డి. అరుణ**

ఫోటోలు : ఎన్. రవీంద్ర

# ద్రవిడవాదం

**అదే ఒరవడి. అదే కూర్పు. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు సినీ తారడు ముదిరి రాజకీయ నాయకుడయ్యాడు. దళపతి బిరుదాంకితుడు విజయ్ తన రాజకీయ పక్షానికి లాంఛనంగా తొలి క్లాప్ కొట్టారు. ఈ పక్షం పేరు తమిళగ వెట్రి కళగం (టీవీకే). వెండితెర మీద తనకు ఉన్న ఆకర్షణ రాజకీయ రంగానికి కూడా బదలీ అవుతుందని విజయ్ ఊహ. అక్టోబర్ 27న తమిళనాడులోని విల్లుపురం జిల్లా విక్రవాండి వద్ద భారీఎత్తున నిర్వహించిన టీవీకే తొలి మహానాడులో లక్షలాది మంది కార్యకర్తల సమక్షంలో విజయ్ ప్రసంగించారు. ఇది టీవీకే రాష్ట్ర స్థాయి తొలి సమావేశం. విజయ్ 46 నిమిషాలు మాట్లాడారు. రెండు విషయాలను మాత్రం నీళ్లు నమలకుండా చెప్పారు. ఒకటి ద్రవిడ మోడల్ అంటూ ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) మోసగిస్తున్నది. కాబట్టి టీవీకే రాజకీయ శత్రువు డీఎంకే. రెండు- సైద్ధాంతికంగా శత్రువుగా భావించేది బీజేపీ అట. ఎందుకంటే సమాజంలో చీలికలు తీసుకువస్తున్నదట. ఇప్పుడు అంతా వేసుకుంటున్న ప్రశ్న- టీవీకే తమిళ రాజకీయాలలో తేగలిగే మార్పు ఏమిటి?**

విక్రవాండి సభలో చాలా గంభీరమైన మాటలే ఈ యాభయ్ ఏళ్ల నటుడు పలికారు. కొంత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మీద, ఇంకొంత రాష్ట్రంలో అధికారంలో ఉన్న డీఎంకే పార్టీ మీద విమర్శలు కురిపిస్తూ ఆయన తన ఉపన్యాసాన్ని రక్తి కట్టించడానికి తన వంతు కృషి చేశారు. టీవీకే తమిళనాడులో ఉనికిలోకి వచ్చిన మరొక మామూలు రాజకీయ పార్టీ అయితే కాదని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా ప్రజలు భావించినా, ఇది రాజకీయాలలో గుణాత్మకమైన మార్పు తీసుకురావడం తథ్యమని అన్నారు. టీవీకే ఈ సంవత్సరం ఫిబ్రవరిలోనే ఉనికిలోనికి వచ్చింది. ఇప్పుడు రాష్ట్ర స్థాయి తొలి సమావేశం జరుపుకుంది. మూడు లక్షల నుంచి ఆరు లక్షలు వచ్చారని ఒక్కొక్క మీడియా ఒక్కొక్క లెక్క చెబుతోంది. ఆ అంచనాలు ఎలా ఉన్నా, జనం బాగానే వచ్చారని, అది లక్షలలోనే అని చెప్పక తప్పదు. తమిళనాడు నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చి ఆయన ఉపన్యాసం విన్నారు.

2026లో రాష్ట్ర అసెంబ్లీకి జరిగే ఎన్నికలే విజయ్ లక్ష్యమని స్పష్టమవుతూనే ఉంది. టీవీకే అభ్యర్థులను 234 స్థానాలలోను బరిలోకి దించడమే ఆయన ఉద్దేశమని చాలామంది భావిస్తున్నారు.

తెర మీద కనిపించేవారు, తెర వెనుక నడిపించేవారు ఇద్దరూ తమిళ రాజకీయాలలో కీలకంగానే కనిపిస్తారు. ఎంజీ రామచంద్రన్, జయలలిత, విజయ్‌కాంత్, కమల్ హాసన్ తెర మీద వచ్చిన కీర్తిని రాజకీయాలలో ఉపయోగించుకున్నారు. కరుణానిధి తెర వెనుక ప్రముఖుడు. ఇప్పుడు సనాతన హిందూ ధర్మం మీద అవాకులూ చెవాకులూ పేలి ప్రసిద్ధుడైన ఉదయనిధి స్టాలిన్ కూడా తెర మీది జీవే. విజయ్ తన సినీ జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉన్న సమయంలో రాజకీయ అరంగేట్రం చేశారు.

దశాబ్దాలుగా తమిళ రాజకీయ రంగం రెండు పార్టీల ఆటస్థలంగా ఉండిపోయింది. ఒకటి అన్నా డీఎంకే, రెండు డీఎంకే. ఈ రెండు పార్టీలే జాతీయ పార్టీలను శాసిస్తూ ఉంటాయి. అటు కాంగ్రెస్‌తోను, ఇటు బీజేపీతోను కలసి ప్రయాణం చేసిన చరిత్ర రెండు పార్టీలకు ఉంది. ఇవి కాకుండా ఇతర రాజకీయ పార్టీలు కూడా అక్కడ ఉన్నాయి. వాటిలో వైకో పార్టీ, డాక్టర్ రామదాస్ నాయకత్వాలలోని పార్టీలకు మంచి పేరే ఉంది. ఇటీవలి పరిణామం- కె.అన్నామలై నాయకత్వంలో బీజేపీకి ఒక ఊపు రావడం. సీట్లు రాకపోయినా ఓట్లు దండిగానే వచ్చాయి. అన్నామలై ఆకర్షణకు నరేంద్ర మోదీ పట్ల ఆదరణ కూడా అందుకు కారణం. అయితే దేశమంతా, ఈశాన్య భారత్ సహా చాలా చోట్ల బీజేపీ చొచ్చుకుపోయింది. 2024 లోక్‌సభ ఎన్నికలలో ఈ పార్టీ 18.27 శాతం ఓట్లు సాధించింది. బీజేపీ పోటీ చేసిన 39 స్థానాలలో 12 చోట్ల అన్నా డీఎంకేను రెండో స్థానం దగ్గర నిలువరించగలిగింది. అయినా తమిళనాడు కమలానికి కొరుకుడు పడడం లేదన్న రాజకీయ పండితుల మాట కాదనలేనిది.

మరొక నటుడు విజయ్‌కాంత్ డీఎండీకే అనే పార్టీని 2005లో ఆరంభించారు. కానీ దాని ప్రభావం స్వల్పకాలమే. 2018లో కమల్ హాసన్ ఎంఎన్ఎం అనే పార్టీని ప్రారంభించారు. ఆయన నినాదం కూడా అవినీతి డీఎంకే, అన్నా డీఎంకేలను ఓడించడమే. అలాగే తన పార్టీ ఆ పార్టీలకు ప్రత్యామ్నాయమనే కమల్ చెప్పారు. ఈ పార్టీ తమిళ రాజకీయాలను ఏ విధంగాను ప్రభావితం చేయలేక పోయిందన్నది నిజం. ఎంజీఆర్ కొద్దికాలం కాంగ్రెస్‌తో, మరికొంతకాలం డీఎంకేతో ప్రయాణించి, తరువాత అన్నా డీఎంకేను ప్రారంభించారు. విజయ్‌కాంత్ రాజకీయాలలోకి రాకముందు ప్రజాసేవలో ఉన్నారు. ఇలాంటి అంచనాలకు ఇప్పుడు రాజకీయ విశ్లేషకులు రావడానికి కారణం లేకపోలేదు. కేవలం తెర మీద ఉన్న ఆకర్షణ ఒక్కటే రాజకీయవేత్తగా స్థిరపడడానికి తమిళనాడులో ఉపకరించడం లేదు. సిద్ధాంతం, రాజకీయ అనుభవం ఉండాలి. లేని పక్షంలో ఏం జరుగుతుందో మనం చూశాం. విజయ్‌కాంత్, కమల్‌హాసన్ రాజకీయ జీవితం ఇదే చెబుతుంది అని విశ్లేషకులు చెబుతున్నారు. దీనిని బట్టి విజయ్ సభలకి మూడు లక్షలు వచ్చినా, ఆరు లక్షలు వచ్చినా కారణం తెర మీద ఆకర్షణ మాత్రమే అని ఇప్పుడే విశ్లేషకులు తేల్చేశారన్న మాట. మరొక విషయం కూడా ఉంది. కమల్ హాసన్ 2016లో రాజకీయాలలోకి వస్తున్నట్టు ప్రకటించారు. మరుగున ఉండిపోయిన విషయం- అదే సంవత్సరం విజయ్ కూడా రాజకీయాలలోకి వస్తున్నట్టు ప్రకటించారు. జె.జయలలిత మరణించిన సంవత్సరం అదే. ఆమె

> **ఇప్పుడు సనాతన హిందూ ధర్మం మీద అవాకులూ చెవాకులూ పేలి ప్రసిద్ధుడైన ఉదయనిధి స్టాలిన్ కూడా తెర మీది జీవే. విజయ్ తన సినీ జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉన్న సమయంలో రాజకీయ అరంగేట్రం చేశారు.**

లేని అన్నా డీఎంకే ఎలాగూ శూన్యమేనని చాలామంది నమ్మారు. కొంచెం ఆలస్యమైనా అదే నిజమని రుజువైంది. ఆ శూన్యం తమకు అనుకూలంగా మలుచుకోవాలన్నదే కమల్, విజయ్‌ల అభిప్రాయంలా ఉందన్నదే ఇప్పుడు వినిపిస్తున్న అభిప్రాయం. ఆనాటికి డీఎంకే మనుగడ పట్ల పెద్ద పెద్ద అనుమానాలే ఉండేవి.

ఇప్పటి వరకూ ఆడియో లాంచ్ ప్రోగ్రామ్‌లలో ప్రసంగించిన తాను తొలిసారిగా ఇంతమంది ప్రజల ముందు, వారి సంక్షేమమే ధ్యేయంగా ప్రసంగించడం ఎంతో గర్వంగా ఉందని విజయ్ చెప్పారు. 'రాజకీయాలు పాములాంటివి. నేను రాజకీయాల్లో చిన్న పిల్లాడినే కావచ్చు. నాకు అనుభవం కూడా లేకపోవచ్చు. అయి నా బరిలోకి దిగిన తర్వాత ఎవ్వరికీ భయపడేదే లేదు' అన్నారాయన. ఈవీ రామస్వామినాయకర్, కె.కామరాజ్, బీఆర్



# నీరుగారుతోందా?

అంబేడ్కర్, రాణి వేలు నాచియార్, అంజలి అమ్మాళ్ వారసత్వాన్ని కొనసాగిస్తారట. వారి ఆశయాలతో పార్టీని ముందుకు తీసుకెళ్తారట. కానీ ఆయన రాజకీయాలలో నీతినియమాల గురించి తనకు పట్టింపు గురించి ఏమీ చెప్పలేదు. లౌకిక, సామాజిక న్యాయ సిద్ధాంతాల ప్రాతిపదికగా పనిచేస్తారట. నీట్ నిర్వహణకు టీవీకే వ్యతిరేకమట. జాతీయ స్థాయిలో మెడికల్ ఎంట్రన్స్ పరీక్ష అవసరం లేదని తేల్చారాయన.

'సమాజంలో విభేదాలు సృష్టించేవారు, అవినీతిపరులు మనకు మొదటి శత్రువులు. ద్రావిడ భావజాలాన్ని కాపాడుతున్నామని చెప్పుకొంటూ రాష్ట్రాన్ని కుటుంబ సంస్థలా వాడుకుంటున్న వారు తదుపరి శత్రువులు' అంటూ విజయ్ చేసిన వ్యాఖ్య జాతీయ మీడియాను కూడా ఆకర్షించింది. మరొకటి కూడా అంతగానూ ఆకర్షించింది. పదే పదే బీజేపీని ఫాసిస్టు పార్టీ అంటున్నారు కదా, మరి మీ పార్టీ అందుకు ఏమైనా మినహాయింపా? అని నిలదీశారు. ఆ విషయం వరకు మీకూ వాళ్లకీ ఏమిటి తేడా? అని స్పష్టంగానే విమర్శించారు. ద్రవిడ, తమిళ జాతీయవాద సిద్ధాంతాలు పాటిస్తామని, పుట్టుకతో అందరూ సమానులే అన్నది తమ పార్టీ సిద్ధాంతమని కూడా అన్నారు. తమిళనాడు ప్రజలపై తిరుగులేని విశ్వాసం, నమ్మకంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. తమిళనాడు రాజకీయ ముఖచిత్రంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని, రాజీపడే ప్రసక్తే లేదని, సర్దుబాటు రాజకీయాలుండబోవని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజకీయాల్లోకి రాలేదని, సామాజిక నిబద్ధతతో వచ్చానని చెప్పారు.

తమిళనాట ద్రావిడ తరహా సుపరిపాలన అందిస్తున్నామంటూ ఓ కుటుంబ పరిపాలన కొనసాగుతోందని, దాన్ని అంతమొందించడమే తన కర్తవ్యమని విజయ్ ధ్వజమెత్తారు. పెరియార్, అన్నాదురై పేర్లు చెప్పుకుని రాష్ట్రంలో ఓ గుంపు కుటుంబ పాలన కొనసాగిస్తోందని పరోక్షంగా డీఎంకేపై విరుచుకుపడ్డారు. పేదలకు ఇళ్లు, ఆహారం, ఉపాధి కల్పించడంలో విఫలమైన ఈ ప్రభుత్వం ఉంటే ఏంటి, ఊడితే ఏమిటంటూ అంటూ విరుచుకు పడ్డారు. కానీ డీఎంకే వలెనే తమిళ జాతీయవాదమే (ఇదెక్కడిదో?) తమను నడిపిస్తుందని అంటున్నారు. దీనికి ద్రవిడ సిద్ధాంతాలు మూలమని చెప్పారు.

ఈవీ రామస్వామి నాయకర్‌ను సమర్ధించడం అంటే, ఈ దేశ సాంస్కృతిక రాజకీయ ఐక్యతను నిరాకరించడమే. కానీ కామరాజ్ నాడార్ కూడా తమకు మార్గదర్శకమేనని అంటున్నారు. ఆయన జాతీయ కాంగ్రెస్ నుంచి వచ్చినవారు. ఆయన సిద్ధాంతాలకీ, ఈవీ అతికి ఎప్పటికీ పొంతనే ఉండదు. వేలు నాచియార్ ఎవరో, ఆమె ఎందుకోసం పనిచేశారో కూడా విజయ్ తెలుసుకుంటే మంచిది. ఇంతకీ తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతిని విజయ్ ఎందుకు ప్రస్తావించలేదు. ఈ ప్రశ్నకు సమాధానం ఈవీ రామస్వామి నాయకర్ సిద్ధాంతాన్ని పాక్షికంగా అనుసరిస్తానని చెప్పడంలోనే ఉంది. ఈవీ రామస్వామి నాయకర్ సిద్ధాంతానికీ, నాస్తికత్వానికి (ప్రధానంగా హిందూ వ్యతిరేకత) అవినాభావ సంబంధమే ఉంటుంది. దీనిని కాదనడం విజయ్ హిపోక్రసీ మాత్రమే. తన తండ్రి, తమిళ సినీ దర్శకుడు చంద్రశేఖరన్ ప్రేరణే విజయ్‌ను రాజకీయం వైపు నడిపించింది.

ఈ సమావేశంలో విజయ్ డీఎంకే మీద నేరుగానే విమర్శలకు దిగారు. అవి బీజేపీ మీద చేసిన విమర్శలలో ఘాటు తక్కువే. ద్రవిడవాదం పేరుతో ఒక కుటుంబం దోచుకుంటున్నదని ఆయన విమర్శించారు. ఇంతకు ముందు డీఎంకే పెద్ద కుటుంబానికి సంబంధించి, అంటే కరుణానిధి కుటుంబ అవినీతి గురించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అయితే బోషాణాల కొద్దీ రుజువులు గవర్నర్‌కు అందచేశారు. ఏ విధంగా చూసినా ద్రవిడవాదం పేరుతో ఇంతకాలం సాగిన దగాను ప్రజలకు తెలియచేసే ప్రక్రియ మొదలైందనే అనిపిస్తుంది. ఇది ఇప్పుడు అత్యవసరం. అటు అన్నామలైకీ, ఇటు విజయ్‌కీ లభిస్తున్న ఆదరణను బట్టి ద్రవిడ పైత్యం కరగడం మొదలైందనే అనుకోవచ్చునేమో కూడా.

తమ పార్టీకి ద్రవిడ ఉద్యమ నేత పెరియార్ ఆదర్శమని, అయితే దేవుడు లేడంటూ ఆయన బలపరచిన నాస్తికవాదాన్ని మాత్రం తమ పార్టీ అంగీకరించే ప్రసక్తేలేదని విజయ్ స్పష్టం చేశారు. తమిళనాడును శాసిస్తున్న రెండు ద్రవిడ పార్టీలకి ప్రత్యక్షంగాను, కమల్‌హాసన్ వంటివారు స్థాపించిన పార్టీకి పరోక్షంగాను నాస్తికత్వం ఒక సూత్రం. అది మాత్రం తన పార్టీకి ఉండదని విజయ్ చెప్పారు. ఆ పార్టీల నుంచి ఈ కొత్త పార్టీని వేరు చేస్తున్నది బహుశా ఇదొక్కటే. మిగిలినదంతా కొత్త సీసాలో పాత సారాయే.

– జాగృతి డెస్క్

ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనూ ఇలాంటి దాడులకు ఫుల్‌స్టాప్ పడలేదు. కుట్రలు, కుతంత్రాలు, దాడులు, వికృత చేష్టలు కొనసాగుతూనే ఉన్నాయి. నిందితుల కుట్రకోణం, వాళ్లు కావాలనే చేశారన్న ఆధారాలు దొరికినా.. సీసీ కెమెరాల దృశ్యాలు లభించినా.. చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారన్న వాదనలు జోరుగా సాగుతున్నాయి. అంతేకాదు.. తమ మనోభావాలు దెబ్బతీశారన్న ఆవేదనతో ఆందోళన చేపడుతున్న బాధితులపైనే లాఠీచార్జి వంటి ఘటనలు చోటు చేసుకోవడం మరింత కుంగిపోయేలా చేస్తున్నాయి. ప్రభుత్వ, పోలీసుల చర్యలు బాధను రెట్టింపు చేస్తున్నాయని హిందూ సంఘాలు మొత్తుకుంటున్నాయి. పైగా ప్రభుత్వ పెద్దల ప్రకటనల్లో వాళ్ల మానసిక స్థితులను అంచనా వేసి, ఆధారాలు సేకరించి నిందితులపై చర్యలు తీసుకుంటామని స్పష్టంగా చెప్పడం హైందవ సంస్కృతి పరిరక్షణకు పాటుపడుతున్న సంఘాలు, సమూహాలను మరింత నీరు గార్చేలా చేస్తున్నాయి.

ప్రభుత్వాలు మారినా పరిస్థితులు మారడం లేదు. ప్రధానంగా మెజారిటీ వర్గంగా ఉన్నవాళ్లకు రక్షణ కరవవుతోంది. మెజారిటీ పేరుతో ప్రాధాన్యత తగ్గిపోతోంది. చివరకు తమకు ఇష్టమైన దేవుళ్లను పూజించడం, దేవతల ఆలయాలు నిర్మించుకొని పూజలు చేయడం కూడా కంటగింపుగా మారుతోంది. మైనారిటీ పేరుతో సకల సదుపాయాలూ అనుభవిస్తున్నవాళ్లు.. ప్రభుత్వాల నుంచి అన్ని సౌకర్యాలూ పొందుతున్న వాళ్లు.. ఇతర మతాలమీద అక్కసుతో, కుట్రలతో, సమాజంలో అశాంతిని రెచ్చగొట్టే ఉద్దేశ్యంతోనే దాడులకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా తెలంగాణలో మతసామరస్యంపై ఓ ప్రణాళిక ప్రకారం కుట్రలు సాగుతున్నాయన్న ఆనవాళ్లు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చూసినా పలు సందర్భాల్లో నవరాత్రుల సమయాల్లో హిందూ దేవుళ్లపై, హిందూ దేవతా విగ్రహాలపై దాడులు జరిగాయి. ఆ దాడులకు బాధ్యులపై పోలీసులు, విచారణాధికారులు, ప్రభుత్వ అధికారులు పెద్దగా చర్యలు తీసుకోకపోగా.. మతిస్థిమితం సరిగా లేదన్న కారణంతో వారిని వదిలేసిన సందర్భాలున్నాయి.

# ప్రణాళికాబద్ధంగా

మొత్తానికి రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు హిందూ దేవాలయాలపై దాడుల అంశాన్ని మరింతగా చర్చకు దారి తీస్తున్నాయి. దసరా నవరాత్రుల సమయంలో హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అమ్మవారి ఆలయంలో విగ్రహం ధ్వంసం చేసిన అంశం మరువక ముందే.. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో అరాచకం సృష్టించిన మానవమృగం వ్యవహారం అమ్మవారి భక్తులందరి లోనూ ఆవేశాన్ని కలిగించింది. ఆలయంలోని సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలు ప్రతి ఒక్కరినీ వీరావేశానికి గురిచేశాయి. కానీ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదనే ఒకే ఒక్క ఆలోచనతో.. చట్టాన్ని గౌరవించి, ప్రభుత్వాలు, పోలీసులపై గౌరవంతో పెల్లుబికిన ఆగ్రహావేశాలను అణచుకున్నారు. అయితే, ఈ అకృత్యానికి పాల్పడిన వాడు కావాలనే చేశాడని, దీనికి సంబంధించి కొద్ది రోజులుగా శిక్షణ తరగతులు కూడా జరుగుతున్నాయన్న భయంకర వాస్తవాలు బయటపడ్డాయి. ఈ పరిణామాలు, ఆధారాలు ఎవరినీ కుదురుగా ఉండనీయలేదు. కానీ, వాళ్లపై చర్యలు తీసుకోవడంలో మాత్రం తాత్సారం జరుగుతూనే ఉండటం బాధిస్తోంది.

అక్టోబర్ 14వ తేదీన సికింద్రాబాద్ మోండా మార్కెట్ పరిధిలోని కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలో అరాచకం చోటు చేసుకుంది. తెల్లవారు జామున ఆలయం గేటు బలవంతంగా తీసుకొని లోపలికి వెళ్లిన కొందరు దుండగులు అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. హిందువులు అత్యంత పవిత్రంగా భావించే అమ్మవారి విషయంలో చెప్పుకోలేని విధంగా చేష్టలతో చెలరేగిపోయారు ఆ దుర్మార్గులు. ఆ దృశ్యాలు అక్కడ సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. తెల్లవారే సరికి ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అత్యంత పవిత్రమైన అమ్మవారి ఆలయంలో ఇలా చేసిన కిరాతకులపై ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. అయితే, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఉండేందుకు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఆ దృశ్యాలను తర్వాత తొలగించారు. ఆలయంలో ఆరాచకానికి పాల్పడుతున్న సమయంలో ఆ పరిసరాల్లో ఉన్నవాళు ఓ దుండగుడిని పట్టుకున్నారు. మిగతా వాళ్లంతా స్థానికులను చూసి పారిపోగా.. ఒకడిని మాత్రం వెంటాడి బంధించి, పోలీసులకు అప్పగించారు. ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో 234/2024 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

అయితే, సంఘటన తర్వాత జరిగిన పరిణామాలు ఆసక్తికర చర్చను లేవనెత్తాయి. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు వచ్చాడని, మత విద్వేషాలు రెచ్చగొట్టే లక్ష్యంతోనే ఈ దురాగతానికి పాల్పడ్డాడని స్పష్టంగా వీడియోల ఆధారంగా తెలుస్తున్నప్పటికీ... దొంగతనానికి వచ్చాడని చెప్పి కేసు తీవ్రతను తగ్గించే ప్రయత్నాలు జరిగాయన్న వాదనలు కూడా ఉన్నాయి. సల్మాన్.. ఆ సమయంలో ఆలయంలో చోరీ చేసేందుకు వచ్చాడని.. వెండి, ఇతర విలువైన వస్తువులు, విగ్రహాలను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశాడన్న ప్రచారానికి ఊతమిచ్చే సంకేతాలు వచ్చాయి. కానీ, అమ్మవారి విగ్రహాన్ని, గుడిని లక్ష్యంగా చేసుకొని ఆ మత విద్వేషకులు వచ్చినట్లు ఆలయ నిర్వాహకులు, స్థానికులు స్పష్టం చేశారు. అంతేకాదు.. ఆలయ గర్భగుడిలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన తర్వాత.. ఆలయం పైకి ఎక్కి అక్కడున్న విగ్రహాన్ని కూడా ధ్వంసం చేసేందుకు ప్రయత్నించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఆ సమయంలో సల్మాన్ సలీంతో పాటు.. మరో ఇద్దరిని కూడా చూసినట్లు స్థానికులు వాంగ్మూలం ఇచ్చారు.

అయితే, సంఘటన విషయం తెలియగానే హిందువులు, హిందూ సంఘాల వారు ముత్యాలమ్మ ఆలయానికి చేరి, బైఠాయించి శాంతియుతంగా నిరసనలు తెలిపారు. హిందువుల మనోభావాలు దెబ్బతీశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో పోలీసులు ఆందోళన కారులను అడ్డుకున్నారు. మరుసటి రోజుకు కూడా కేసు విచారణలో పురోగతి లేకపోవడంతో అమ్మవారి భక్తులు మళ్లీ ఆందోళన చేపట్టారు. పోలీసుల తీరుపై అసహనం ప్రదర్శించారు. భక్తులను నిరసనలు చేపట్టకుండా పోలీసులు నియంత్రించారు. ఈ క్రమంలో పోలీసులకు ఆందోళనకారులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. కొందరు తమపైకి చెప్పులు విసిరారన్న కారణంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఆందోళనకారుల్లో కొందరి తలలకు, ఇతర శరీరభాగాలకు గాయాలయ్యాయి. చాలామంది ఆసుపత్రి పాలయ్యారు. వాళ్లలో ఎక్కువమంది బీజేపీ, వీహెచ్‌పీ, హిందూ సంఘాలకు చెందిన వాళ్లు ఉన్నారు.

మరోవైపు.. ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని





# ఆలయాలపై దాడులు

ధ్వంసం చేసిన వ్యక్తిని ముంబయి సమీపంలోని ముంబ్రాకు చెందిన సల్మాన్ సలీం ఠాకూర్ అలియాస్ సల్మాన్‌గా పోలీసులు గుర్తించారు. విగ్రహారాధనపై వ్యతిరేకత, అతివాద మనస్తత్వం పెంచుకున్న అతను ఈ దుర్మార్గానికి ఒడిగట్టినట్లు పోలీసు అధికారులు ప్రకటించారు. కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన సల్మాన్ సలీం.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ, ఇస్లాం మత ప్రచారకుడు జకీర్ నాయక్ సహా పలువురి ప్రసంగాలను ఫేస్‌బుక్, యూట్యూబ్ లలో వింటూ విగ్రహారాధనపై ద్వేషాన్ని పెంచుకున్నాడని పోలీసు ఉన్నతాధికారులు చెప్పారు. అంతేకాదు..ఆతనిపై మహారాష్ట్రలోనూ ఇలాంటి తరహాకు సంబంధించినవే రెండు కేసులు నమోదయ్యాయి. సెప్టెంబరు 6, 2022 న ముంబయిలో గణేశ్ మండపంలోకి చెప్పులు వేసుకుని వెళ్లి పూజలను అపహాస్యం చేస్తూ స్థానికులతో వాదనకు దిగాడు. అలాగే, ఆగస్టు 1, 2024న మీరా రోడ్డులోని ఆలయంలో శివుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనలపై సల్మాన్ సలీంపై కేసులు నమోదయ్యాయని గుర్తించారు. అంటే.. సల్మాన్ సలీం..పనిగట్టుకొని మరీ ఇలాంటి అపచారాలకు పాల్పడుతున్నట్లు తేలింది. అయితే, అమ్మవారి ఆలయంలో వీడి పాపం పండింది. స్థానికులకు చిక్కి పోలీసులకు దొరికిపోయాడు.

సల్మాన్ అక్టోబరు మొదటి వారంలో హైదరాబాద్‌కు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్ సమీపంలోని మెట్రో పోలిస్ హోటల్‌లో ఇంగ్లిష్ హౌస్ అకాడమీ ఆధ్వర్యంలో నెలరోజుల వ్యక్తిత్వ వికాస, ఇంగ్లిష్ స్పీకింగ్ వర్క్‌షాప్ పేరుతో ఏర్పాటు చేసిన మత సంబంధ శిక్షణ తరగతులకు వచ్చాడు. హోటల్ ఆవరణను అద్దెకు తీసుకుని మునావర్ జమా, ఎండీ ఖలీల్ అహ్మద్ తదితరులు నిర్వహించిన వర్క్‌షాప్‌లో దాదాపు వివిధ ప్రాంతాల నుంచి 151 మంది పాల్గొన్నట్లు గుర్తించారు. హోటల్‌లోని మూడు, నాలుగో ఫ్లోర్‌లలో 50 గదులను అద్దెకు తీసుకొని మరీ మత విద్వేష పాఠాలు బోధిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఎలాంటి అనుమతులూ లేకుండా వర్క్ షాప్ నిర్వహించారనే ఆరోపణలపై హోటల్ యాజమాన్యం, కార్యక్రమ నిర్వాహకులపై గోపాలపురం పోలీసులు కేసు నమోదు చేశారు. మెట్రో పోలీసులు హోటల్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు సీజ్ చేశారు.

హిందువుల ఆందోళనలు, భక్తుల ఆగ్రహం మధ్య పోలీసులు ఆలస్యంగానైనా ముత్యాలమ్మ గుడిపై దాడి కేసులో కాస్త సీరియస్‌గా దృష్టి సారించారు. మోటివేషనల్ స్పీకర్ మునావర్ జామ, మెట్రో పోలీస్ హోటల్ యజమాని అబ్దుల్ రషీద్, హోటల్ మేనేజర్ రెహమాన్‌పై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ మేరకు తొలి కేసుకు అదనంగా రెండో కేసును కూడా నమోదు చేశారు. ఎస్ఐ సురేష్ ఫిర్యాదుతో 299, 192, 196, 223, 49 బీఎన్ఎస్ ప్రకారంగా కేసు పెట్టారు. ముగ్గురిని నిందితులుగా పేర్కొనగా.. వీరిలో మోటివేషనల్ స్పీకర్ మునావర్ జామ, మెట్రో పోలీస్ హోటల్ యజమాని అబ్దుల్ రషీద్, హోటల్ మేనేజర్ రెహమాన్ ఉన్నారు. గుడిపై దాడికి పాల్పడ్డ వ్యక్తులు హోటల్‌లో బస చేసినట్లు విచారణ పోలీసులు గుర్తించారు. దాడికి పాల్పడిన సల్మాన్ హోటల్‌లో ఉన్నాడని పోలీసులు తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 31 వరకు మెట్రో పోలీస్ హోటల్‌లో మునావర్ జామ ఒక సదస్సు ఏర్పాటు చేశాడు. ముఖ్యంగా హిందూమతానికి వ్యతిరేకంగా ఈ సదస్సు ఏర్పాటుచేసి కొందరిని ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టినట్లు పోలీసుల విచారణలో తేలింది. మొత్తం 151 మందికి ఈ హోటల్‌లో బస కల్పించారని పోలీసులు గుర్తించారు. మొత్తం 49 గదులను నిందితులు బుక్ చేశారని, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మునావర్ జామ్ సదస్సు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అంతేకాదు.. మునావర్ జామ సదస్సుకు మెట్రో పోలీస్ హోటల్ యజమాని సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. మునావర్ జామ్ రెండు మతాల మధ్య విద్వేషం రెచ్చగొట్టడం కోసమే సదస్సు ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఎస్ఐ సురేష్ ఫిర్యాదు చేశారు. మునావర్ మోటివేషన్ క్లాస్ తర్వాతే అమ్మవారి గుడిపై సల్మాన్ దాడి చేసినట్టు పోలీసులు గుర్తించారు.

**సుజాత గోపగోని,**
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

జాగృతి నిర్వహించిన ఏపీయూఎస్ వ్యవస్థాపక కార్యదర్శి
స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక
నవలల పోటీలో ద్వితీయ బహుమతి రచన




త్వరలో..



గన్నవరపు నరసింహమూర్తి
తూర్పు - పడమర





# అమరావతి పునర్నిర్మాణం

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే రాష్ట్ర అభివృద్ధికి పలు ప్రాజెక్టులు మంజూరు చేయగా, రాజధాని నిర్మాణానికి రూ.15,000 కోట్లు సహాయం అందిస్తోంది. అమరావతి చుట్టూ జాతీయ రహదారుల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. అమరావతిలో నూతన రైల్వేలైన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దానితో పాటు పోలవరం నిర్మాణానికి అడ్వాన్సుగా రూ.2 వేల కోట్లు కేటాయించింది. ఇక రాజధానికి కేంద్రం నుంచి భారీ నిధుల హామీ లభించడంతో అమరావతి పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

రాజధాని అమరావతి పునఃనిర్మాణానికి ప్రభుత్వం తిరిగి పూనుకుంది. గత ఐదేళ్లుగా అర్థంత రంగా నిలిచిపోయిన ప్రభుత్వ భవనాలతో పాటు నగర నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించింది. నెలరోజు లుగా జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తికావటంతో అమరావతిలో నిర్మాణ పనులపై దృష్టి కేంద్రీక రించింది. ఇందులో భాగంగా రాయపూడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న సీఆర్డీఏ, అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్), ఇతర ప్రభుత్వ భవనాలకు తుదిమెరుగులు దిద్దే ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రస్తుతం సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంతో పాటు ఏడీసీఎల్ విజయవాడలో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. రాజధాని పునర్ని ర్మాణం నేపథ్యంలో ముందుగా రైతులు, రైతుకూలీలు, రాజధాని గ్రామాల ప్రజల సౌలభ్యం కోసం సీఆర్డీఏ, ఏడీసీఎల్ కార్యాలయాలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. జీ ప్లస్ 7 అంతస్తుల ఈ భవనాలను పూర్తి చేసేందుకు రూ. 160 కోట్లు మంజూరు చేసింది.

భవనాల పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్టోబరు 19న భూమిపూజ చేశారు. పనులను ఆరునెలల్లో పూర్తిచేసేలా తొలుత కార్యాచరణ రూపొందించారు. అయితే 120 రోజుల్లో (నాలుగు నెలలు)గా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. రాయపూడిలో ప్రత్యేకంగా చేపట్టిన శంకుస్థాపన కార్యక్రమాన్ని పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, ఏడీసీఎల్ ఎండీ లక్ష్మీపార్థసారథి, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి పర్యవేక్షించారు. ముఖ్యమంత్రికి సీఆర్డీఏ కమిషనర్ నిర్మాణానికి సంబంధించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రాజధాని అమరావతికి ప్రపంచ బ్యాంక్ అందించే రూ.15వేల కోట్ల రుణాలకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన నేపథ్యంలో సీఆర్డీఏ పనుల్లో స్పీడ్ పెంచింది. రైతులకిచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో మౌలిక సదుపాయాలతో పాటు అసైన్డ్ భూముల రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందించింది. జంగిల్ క్లియరెన్స్ పూర్తయి పనులు ప్రారంభం కావటంతో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు గతంలో కేటాయించిన భూముల్లో కార్యాలయాల ఏర్పాటుకు సుముఖత వ్యక్తమవుతోంది. వివిధ కేంద్ర ప్రభుత్వ కార్యాల యాలు, బ్యాంకులు, జాతీయ విద్యాలయాలకు ఐదేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం భూకేటాయింపులు జరిపింది. అయితే తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల నిర్ణయాన్ని ప్రకటించడంతో పాటు జాతీయ సంస్థల కార్యాలయాల ఏర్పాటుకు ఆసక్తి చూపలేదు. తిరిగి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఏకైక రాజధానిగా అమరావతినే ప్రకటించి అభివృద్ధికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో కేంద్ర సంస్థలతో సీఆర్డీఏ జరిపిన సంప్రతింపులు ఫలించాయి. కార్యాలయాల నిర్మాణానికి సానుకూ లత వ్యక్తమవుతోంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వ పరిధిలో విజయవాడ బైపాస్ రోడ్డు పనులు చకచక సాగుతున్నాయి. రాజధాని నగర అంతర్గత రహ దార్లు జాతీయ, రాష్ట్ర రహదార్లకు అనుసంధాన మయ్యేలా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. దీంతో పనులు ఊపందుకున్నాయి. అమరావతిని అనుసంధానిస్తూ రైల్వేలైనుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. అమరావతికి చుట్టూతా అవసర మైన రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

## సుందరనగరంగా అమరావతి

అమరావతిని అత్యంత సుందరమైన నగరంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం తెలిపింది. రాజధాని ప్రాంతాన్ని విశాలమైన రహదారులతో, నీటి సరఫరా, విద్యుత్, ఇంటర్నెట్ కేబుళ్ల వంటివన్నీ భూగర్భంలోనే వెళ్లేలా బెస్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. సీఆర్డీఏ పరిధిలో రాజధాని ప్రాంత పరిధి 8,603 కిలోమీటర్లు కాగా అందులో 217 చదరపు కిలోమీటర్ల పరిధిలో రాజధాని నిర్మిస్తారు. మరో 16.9 చ.కి.మీ పరిధిలో కోర్ కేపిటల్ ఉంటుంది. ఇదంతా అభివృద్ధి చేసేందుకు అమరావతి ప్రాంతంలో 183 కిలో మీటర్ల పరిధిలో ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) ఏర్పాటవుతుంది. అమరావతిలో విశాలమైన రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటవుతుంది.. ఐటీ, విద్యుత్, వరదనీటి నిర్వహణ వ్యవస్థలతో పాటు బ్లూ, గ్రీన్ సిటీగా అమరావతికి డిజైన్లు రూపొందించారు.

## గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత

రాజధానిలో కాలుష్యం లేకుండా గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యమిస్తారు. విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈవీ స్టేషన్లు, నడక దారులు, సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు. ఎలక్ట్రికల్ సైకిళ్లను పెద్ద సంఖ్యలో ప్రోత్స హించి.. 20– 30 కి. మీ.ల దూరంలోని ఆఫీసులకు వాటిపైనే వెళ్లేలా చూడాలనేది లక్ష్యం. జపాన్‌లో ఒక్కో రోడ్డులో ఒక్కో రకం పూల చెట్లు ఉంటాయి. ప్రతి సీజన్‌లోనూ ఏదో ఒక రోడ్డులో కన్నుల పండుగలా




# ప్రారంభం

అవి పుష్పిస్తూనే ఉంటాయి. అక్కడి కొండల్నీ అలాగే తీర్చిదిద్దారు. వాటిని చూసేందుకే ప్రత్యేకంగా పర్యాటకులు వస్తారు. సెంట్రల్ విస్టా ఏర్పాటు చేస్తారు. అమరావతికి దేశంలోని 10 అగ్రశ్రేణి యూనివర్సిటీలు, పదిటాప్ ఆస్పత్రులు, 10 అత్యుత్తమ పాఠ శాలలు, 10 టాప్ హోటళ్లు తీసుకొస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే ఎయిమ్స్, విఐటీ, ఎస్ఆర్ఎం, అమృత వర్సిటీలు రాగా ప్రముఖ విశ్వవిద్యాలయాలైన కేజే, ఎక్టెస్ఆర్ఐ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, లా యూనివర్సిటీ, బిట్స్ పిలాని కూడా రానున్నాయి. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల కోసం 12 టవర్లు ఐఏఎస్, ఐపీఎస్ కు ఆరు టవర్లు, ప్రిన్సిపల్ సెక్రటరీల కోసం 90 క్వార్టర్లు, గజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల కోసం 4 టవర్లు, నాన్ గజిటెడ్ అధికారులకోసం 20 టవర్లు మొదలు పెట్టారు. న్యాయమూర్తుల కోసం 36, మంత్రులకు 35 భవనాల నిర్మాణం పూర్తిచేస్తారు. వీటితో పాటు శాసనసభ, సచివాలయం, హైకోర్టు శాశ్వత భవనాల పనులు కూడా త్వరలో ప్రారంభిస్తారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు దీటుగా అమరావతి చుట్టుపక్కల ప్రాంతాల్ని కలుపుకొని మహానగరంగా అభివృద్ధి చెందాలని, ఇక్కడి కోటి జనాభా ఉండాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోంది.

**సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు**


'అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు. ఉపాధికి కేంద్రంగా, పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు అవసరమైన ఆదాయం సృష్టించే వనరుగా ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం పెట్టాల్సిన పెట్టుబడి చాలా తక్కువ. మొత్తం 54 వేల ఎకరాల్లో రైతులకు స్థలాలు కేటాయించగా 10-12 వేల ఎకరాలు మిగులుతుంది. దానిలో మౌలిక వసతులకు కొంత తీసేసినా, మిగిలిన భూమిని విక్రయించి ఆ నిధులతో అమరావతి నిర్మాణం పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక అమరావతితో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా భూముల ధరలు పెరిగాయి. విజయవాడ పశ్చిమ బైపాస్ నిర్మాణం దాదాపు కొలిక్కి వచ్చేసింది. తూర్పు బైపాస్ నిర్మాణం కూడా త్వరగా పూర్తిచేస్తే చిన్న రింగ్‌రోడ్డు ఏర్పాటవుతుంది. అమరావతికి అవుటర్ రింగ్ రోడ్డు కూడా ఏర్పాటవుతుంది. రాజధానిలో ప్రధాన రహదారుల్ని దానితో అనుసంధానం చేస్తేనే ఈ ప్రాంతం మొత్తం అభివృద్ధి చెందుతుందని, దాని నిర్మాణం వల్ల కేంద్ర ప్రభుత్వానికీ ఆదాయం పెరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటుంది. అమరావతికి భూసమీక రణలో భూములిచ్చిన రైతులకు, ఇటు ప్రభుత్వానికి ప్రయోజనం చేకూరుతోంది. అదే స్ఫూర్తితో ఓఆర్ఆర్‌కి కూడా రైతులు సహకరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. రాజధాని అమరావతిలో విజయవాడ పశ్చిమ బైపాస్ రహదారి వంతెన మీదినుంచి సీడ్యాక్సెస్ రోడ్డు పైకి వాహనాలు దిగేలా కనెక్షన్ ఉండాలని, ఆ మేరకు డిజైన్‌లో మార్పులు చేయాలని జాతీయ రహదారుల సంస్థ (ఎన్హెచ్ఏఐ) అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. విజయవాడ తూర్పు బైపాస్‌కు అనుసంధానిస్తూ మహానాడు జంక్షన్ నుంచి నిడమనూరు వరకు 6 లేన్‌ల ఫ్లై ఓవర్ నిర్మాణానికి కేంద్రం అనుమతిం చింది. రూ.800 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే ఈ ప్రాజెక్టుకు త్వరలో టెండర్లు పిలిచి, వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో నిర్మాణ పనులు ప్రారంభిస్తారు. రెండున్నరేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలనేది లక్ష్యం. మహానాడు ఫ్లై ఓవర్, విజయవాడ ఈస్ట్ బైపాస్‌తో బెజవాడ ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడనుంది. విజయవాడ నుంచి నిడమానూరు వెళ్లే మార్గంలో ప్రభుత్వాసుపత్రి జంక్షన్, రామవరప్పాడు జంక్షన్, ఇన్నర్‌రింగ్ జంక్షన్, ప్రసాదంపాడు, ఎనికేపాడు వరకు మొత్తం కలిపి 27 ట్రాఫిక్ జంక్షన్ పాయింట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఎన్‌హెచ్-16 నాలుగు వరసలతో ఉంది. వాహనాల రాకపోకలతో మాటిమాటికీ ట్రాఫిక్ ఆగిపోతోంది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే ప్రధానమార్గం కావటం వల్ల ఇక్కడ నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు నిడమానూరు ఫ్లై ఓవర్ చక్కటి పరిష్కారం.

**రూ.2,245 కోట్లతో అమరావతి రైల్వే లైన్**

అమరావతి నూతన రైల్వేలైన్‌కు రూ.2,245 కోట్లతో కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. గంటకు 160 కి.మీ.వేగంతో రైళ్లు వెళ్లేలా లైనును పటిష్టంగా నిర్మిస్తారు. మూడేళ్లలో దీని నిర్మాణం పూర్తిచేస్తారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు 57 కిలోమీటర్ల మేర నిర్మిస్తారు. పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టు ముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావూరు స్టేషన్లు నిర్మిస్తారు. అమరావతి, పెద్దాపురం, కొప్పురావూరు స్టేషన్లు పెద్దగా ఉంటాయి. గుంటూరు జిల్లా పెద కాకాని మండలం కొప్పు రావూరు, పెదకాకాని.. తాడికొండ మండలంలోని కంతేరు, మోతడక, తాడికొండ.. తుళ్లూరు మండలంలోని వడ్డమాను, పెదపరిమి గ్రామాల్లో భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చారు. పరిటాల వద్ద ఎక్కువ సంఖ్యలో గూడ్స్ రైళ్లు నిలిపేందుకు వీలుగా నిర్మాణాలు చేస్తారు. కొత్తపేట - వడ్డమాను మధ్య కృష్ణానదిపై 3.2 కి.మీ.మేర వంతెన నిర్మిస్తారు. విజయవాడ-గూడూరు మధ్య మూడో లైన్ దాదాపు పూర్తయింది. రద్దీని దృష్టిలో ఉంచుకొని, నాలుగో లైన్ కూడా ఏర్పాటు చేయనున్నారు.


**పోలవరానికి అడ్వాన్స్ నిధులు**

పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర జలశక్తి శాఖ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2 వేల కోట్లను అడ్వాన్స్‌గా విడుదల చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నిర్ణయం రాష్ట్రానికి భారీ ఊరటగా భావించవచ్చు. 2014 రాష్ట్ర విభజన చట్టం ప్రకారం పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. అప్పటి నుంచి ప్రాజెక్టు నిర్మాణ ఖర్చులు తొలుత రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తే.. ఆ తరువాత కేంద్రం ఆ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తోంది. అయితే, కొంత కాలంగా పోలవరం నిర్మాణంలో చోటు చేసుకున్న పరిణామాలు.. ఒక సీజన్ నష్ట పోకుండా పనులు చేయాలంటే ముందుగా అడ్వాన్స్ ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం పదే పదే కేంద్రాన్ని కోరుతోంది. పోలవరం ప్రాజెక్టుకు సవరించిన అంచనాలకు కొద్ది రోజుల క్రితమే కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. అందులో భాగంగా ప్రస్తుతం పోలవరం పనుల కోసం రూ 2,000 కోట్లు అడ్వాన్స్‌గా విడుదల చేసింది. అదే సమయంలో రీయంబర్స్ మెంట్ కింద మరో రూ 800 కోట్లను ప్రభుత్వం విడుదల చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీంతో, పోలవరం ప్రాజెక్టుకు ఇంత భారీ మొత్తంగా ఏకంగా రూ 2,800 కోట్లు విడుదల చేయటంతో ఏపీ ప్రభుత్వానికి పెద్ద వెసులుబాటు దక్కనుంది.



**తురగా నాగభూషణం**

సీనియర్ జర్నలిస్ట్




44

# మనో నిగ్రహాన్ని ప్రబోధించే అద్వైత సిద్ధాంతం

అద్వైతులకు శంకరాచార్యులవారు ఒక అవతారపురుషుడు.మిగతా ప్రపంచానికి ఆయన ఒక మేధావి. పాశ్చాత్య పండితుల దృష్టిలో భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన మహా వ్యక్తులలో ఆయన ఒకరు. మహాపురుషులందరి వలెనే ఆయనను కూడా అపార్థం చేసుకున్నారు. ఆయన గ్రంథాలన్నిటినీ అధ్యయనం చేసినవారు తప్ప మిగిలినవారు ఆయన 'ఈ ప్రపంచం మిథ్య' అని చెప్పినట్లు ఆయనను అవహేళనం చేయడం కద్దు. ఆయన ఏ ప్రాతిపదికపై జగత్తును మిథ్య అని అన్నారో పరిశీలిద్దాం.

ఉన్నది ఒక్కటే అనేది ఆయన ముఖ్య సిద్ధాంతం. ఇతరులు ఈశ్వరుడు, జీవాత్మ, జగత్తు అనే మూడు పదార్థాలు ఉన్నవని చెపుతారు. జీవాత్మ, పరమాత్మ ఒకటేననీ, జగత్తు నిజానికిలేదని శంకరులు చెప్పారు. జగత్తు ఉన్నట్లు కనపడుతుందనీ, వాస్తవానికి దానికి అస్తిత్వం లేదని వారన్నారు. ఏదో ఒక వస్తువు ఉన్నదని ఆయన అంగీకరించారనీ, ఆ వస్తువుకు ఆత్మ పదార్థానికి భిన్నమైనది కాదని శంకరులు చెప్పారని కూడా మనం చెప్పుకోవచ్చు. కనుక ఆయన జగత్తు లేదని అన్నారని చెప్పడం పొరపాటు. మనం ఇప్పుడు జగత్తు అని పిలిచేదానిలో పరమేశ్వరుణ్ణి చూడగలిగేందుకై ఆధ్యాత్మిక దృష్టిని అలవరచు కోవాలని ఆయన మనకు చెపుతున్నారు. జగత్తులో వివిధ నామములు, రూపాలు వస్తూ పోతూ ఉంటాయి. కనుక వాటికి నిజమైన అస్తిత్వం లేదు. సర్వ కాలాలలో ఉన్నదానినే ఉన్న దానినిగా నిలుప గలం. క్షణభంగురములైన ఈ నామరూపాల మధ్య ఒక శాశ్వతమైన తత్వం ఉన్నది. వివేకావంతుడు దానిని మాత్రమే గుర్తించాలి. ఒక బంగారు గొలుసునుగాని, ఉంగరాన్ని కాని మనంచూద్దాం. ఈ వస్తువులు ఏమిటి?అని ఎవరినైనా అడిగితే అతడు అది ఒక గొలుసునీ, ఒక ఉంగరమనీ చెపుతాడు. మరొక వ్యక్తి మరొక విధంగా జవాబు చెప్పవచ్చు. గొలుసు, ఉంగరం తాత్కాలికమైనవనీ, ఏ సమయంలో అయినా పగలడంవల్ల బకాని, కరగడంవల్ల కాని తమ పేరును, ఆకారమును కోల్పోవచ్చుననీ, తనకు చూపిన వస్తువు 'బంగారం' అనీ అతడు భావించ వచ్చు.

మనం ఈ రెండు జవాబులను పోల్చి చూచి నప్పుడు రెండవ జవాబులోనే ఎక్కువ నిజం ఉన్నదని అంగీకరించక తప్పదు. అదే విధంగా మానవులు, పశుపక్ష్యాదులు, స్థావర జంగములు కలిగిన ఈ జగత్తును క్షణభంగురములై, తాత్కాలికములైన నామరూపాలుగా కాక దాని మూలతత్వంగానే పరి గణించడం ఉత్తమం.

ఈశ్వరుడు జగత్తుకు భౌతిక కారణమనే అర్థం దీనికిలేదు. అద్వైత సిద్ధాంతం ప్రకారం ఈ జగత్తుకు భౌతికమైన కారణం కాని, సాధన పూర్వకమైన కారణం కాని లేదు. కుమ్మరి మట్టి నుండి కుండను చేసినట్లు, సాలీడు తన శరీరంనుండి గూడు అల్లినట్లు ఈశ్వరుడు జగత్తును దేని నుంచీ సృష్టించ లేదు. చీకటిలో తాడు ఆధారంగా మనస్సు నుంచి పాము జనించినట్లుగా, ఈశ్వరుడనే ఆధారంపై మనస్సు నుంచి జగత్తు జనిస్తుంది. వెలుతురు తాడుపైన ఉన్న పాము అనే భ్రమను తొలగించే విధంగా ఆధ్యాత్మిక జ్ఞానం పరమాత్మపై ఉన్న జగత్తు అనే భ్రమను తొల గిస్తుంది. కనుక మనం ఆత్మకు బదులు జగత్తును చూడడానికి కారణం అవిద్య. ఈ అవిద్య మన మనస్సును ఆవరించి, దానిలో వాంఛలు, భావనలు, ఆలోచనలు అనే అలలను జనింపజేస్తుంది. అవిద్యను జయించగానే అంతా ప్రశాంతం, అదృశ్యం అయిన ఈశ్వరతత్వంగా గోచరిస్తుంది. అప్పుడు మనస్సు ప్రాపంచిక విషయాల పట్ల మామూలు ప్రతిక్రియను చూపదు, జగత్తు నామరూపాల వైవిధ్యమనే మిథ్య అని గుర్తించడానికి మనస్సును జయించవలసి ఉంది. ఆ స్థితిలో ఇంద్రియాలు తమ పనులు చేస్తూ ఉంటాయి. కాని వాటికి అనుగుణంగా మనస్సులో అస్థిరత కలుగదు. జ్ఞాని కళ్లు ఒక స్త్రీని చూస్తాయి..అయితే మానసిక వికారం పొందకుండా చూస్తాయి. అతని దృష్టిలో స్త్రీ ఈశ్వరుని సృష్టి. ఈ సృష్టి మాయ ద్వారా జరుగుతుంది. దీనిని వివర్తమని అంటారు. మామూలు వ్యక్తుల వలె అతడు 'భార్య', 'కూతురు' అనే భావనలను ఆ స్త్రీపైన ఆవరింప జేయడు. కనుక అతనికి బంధనం ఉండదు.

**– జటావల్లభుల పురుషోత్తం,10.5.65 జాగృతి**

ఆధ్యాత్మికం

మన రుషులు

## జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం



అగస్త్యుడు తీవ్ర నిష్ఠతో తపస్సు చేస్తూ సర్వప్రాణ కోటిని దయార్ద్ర హృదయంతో చూసేవాడు. ఆయన తపోదీక్ష మహామహులను ఎందరినో అబ్బుర పరచేది. అలా చాలా కాలం బ్రహ్మచర్యం పాటిం చాడు. ఒకనాడు అడవిలో సంచరిస్తున్న ఆయనకు చెట్ల కొమ్మలకు తలకిందులుగా వేలాడుతున్న పిత్రు పితామహులు కనిపించి, 'యోగ్యురాలిని వివాహ మాడి పుత్ర సంతానం పొందాలి. లేకపోతే మాకు ఉత్తమలోకాలు దక్కవు' అని చెప్పడంతో తగు కన్య కోసం అన్వేషిస్తూ , తన వరప్రసాదంగా జన్మించిన విదర్భ రాజకుమారి లోపాముద్ర తనకు అన్ని విధాలాతగినదని భావించాడు. మహారాజును అడిగాడు. అంతఃపురంలో వైభవంగా బతుకున్న తన కూతురు నారచీరలు ధరించి, కందమూలాలు తింటూ వన కుటీరంలో జీవించగలదా?అని ఆయన సందేహం. లోపాముద్ర మునితో వివాహానికి అంగీక రించింది. ఆ దంపతులు గంగానదీ తీరంలోని కుటీ రానికి చేరుకున్నారు. అగస్త్యుడు తన రుషిధర్మాన్ని నిర్వర్తిస్తూనే ఉన్నాడు. ఒకనాడు, లోపాముద్ర రుతు స్నానం చేసి, సర్వాంగశోభతో ఆశ్రమంలో సంచ రిస్తుండగా, ముని మనసు చలించింది. 'ఆశ్రమధర్మం ప్రకారం, దర్భశయ్యలపై జీవితం గడుపుతున్న మనకు, సంసార సుఖం కావాలంటే, అందుకు తగిన భోగభాగ్యాలు అవసరం' అని భార్య సూచించింది.'మీ వంటి మహాతపస్వికి వాటిని సమకూర్చడం అంత కష్టమేమి కాదు' అనీ పలికింది. ఆలోచించిన ముని, కేవలం సాంసారిక సుఖం కోసం తపశ్శక్తిని వృథా చేయడం ఇష్టంలేక ఇద్దరు ముగ్గురు మహా రాజులను వారి వద్ద మిగుల ధనాన్ని అర్థించాడు. తమ ఆదాయ వ్యయాలు సమంగా ఉన్నాయని వారి నుంచి బదులు

# పాంచరాత్ర సిద్ధాంతం వైష్ణవానికి మూలకందం

44




విష్ణువు సర్వవ్యాపిగా వేదపురాణాదులు పేర్కొంటున్నాయి. భగవంతుని నారాధించు మతము భాగవత మతం. మహాభారతంలో భాగవత మతం అభివర్ణితం. వైష్ణవం భాగవత మతంనుంచి వచ్చినది. ఇందులో విష్ణువును భగవంతుడుగా చెప్పారు. పాంచరాత్ర సిద్ధాంతాలు వైష్ణవమునకు మూలకందము. ఇవి అతి ప్రాచీనములు. వీటి సారాంశం రుగ్వేదంలోని పురుషసూక్తంలో కనిపిస్తుంది. అలాగే, శతపథ బ్రాహ్మణం కూడా పరమ పురుషుడగు నారాయణుడు సర్వోత్తముడని చెప్పింది. మహాభారత శాంతి పర్వంలో ఈ మత ప్రసంగం ఉంది. పాంచరాత్ర ఆగమంలో జయాఖ్య, విష్ణు, సాత్వత, ఆహిర్బుధ్న్య సంహితలు ముఖ్యమైనవి. కూర్మాది కొన్ని పురాణాలలో, సూత వశిష్ట సంహితలు మున్నగు గ్రంథాలు పాంచరాత్రములు అవైదికములని, పాపిష్టములని పేర్కొన్నాయి. కాని శ్రీమద్భాగవతం, మహాభారతం, విష్ణుపురాణం వాటిని ప్రశంసించాయి. విష్ణు, మరీచి, వ్యాస పరాశర, కాశ్యప స్మృతులు పాంచరాత్రమును కొనియాడాయి. వైష్ణవులకు పాంచరాత్రం వేదమంతటి ప్రామాణికము. సాంఖ్య యోగ కృతాంతముతో పాటు పాంచరాత్రం కూడా వేదానికి  సహకారి అని వ్యాసుడు చెప్పినట్లుగా వేదాంత దేశికులు ప్రమాణము నుదాహృతము చేసినారు.

ఇదం మహోప విషదం
చతుర్వేద సమన్వితమ్
సాంఖ్యయోగ కృతాంతేన
పంచరాత్రాను శబ్దితమ్ (వేశ్వర మీమాంస)

పాంచరాత్రం వేదానికి మూలమని, వేదం పాంచరాత్రమునకు మూలమని వ్యాసులు చెప్పినట్లు వేదాంత దేశికులు ప్రమాణము లిచ్చారు. 'మహతో వేద వృక్షస్య మూల భూతో మహానయమ్" అని, "శృతిమూల మిదం తంత్రం ప్రమాణం కల్ప సూత్రవత్'...విపులమైన వేద సాహిత్యంను అధ్యయనం చేయలేని భక్తుల కోసం పాంచరాత్రంలో వేదసారాన్ని సంక్షిప్తంగా ఇమిడ్చారని యామునా చార్యుల అభిప్రాయం.

ఏది ఎలా ఉన్నా, విశిష్టాద్వైతం అతి ప్రాచీన వేదాంత సాంప్రదాయం. బ్రహ్మసూత్రంలో పేర్కొన్న ఆశ్మరథ్యులు విశిష్టాద్వైతి 5వ శతాబ్దంలో బ్రహ్మసూత్రం భాష్యం రాసిన శ్రీకంఠులు విశిష్టాద్వైతి. ఆయన పరతత్వాన్ని శివుడన్నాడు. అయితేనేం? 8,10 శతాబ్దాల నడుమ ఉండిన భాస్కరాచార్యుల భేదాభేదవాదం విశిష్టాద్వైతానికే దారితీస్తుంది. సాధారణశకం916లో జనించిన యామునాచార్యులు తన అకుంఠిత ప్రతిభతో విశిష్టాద్వైత మునకు నూతన లోకమును అగ్రహించారు. 1017 సంవత్సరంలో అవతరించిన రామానుజులు విశిష్టా ద్వైత ప్రవంతిని పలువంకల వరదలుగా పారునట్లు చేశారు.

కాని యామున రామానుజులు బోధించినది కొత్త సిద్ధాంతం కాదు. వారికి శిక్ష గురుపరంపర నుంచే లబ్ధం. సుప్రాచీనకాలము నుంచి దక్షిణ భారతంలో హరిభక్తి ప్రచారం ఉంది. ఆళ్వారులు ద్వాపర కలియుగాల సంధిలో ఉన్నారని శ్రీ వైష్ణవుల విశ్వాసం. ద్వాపరాంతంలో పోంఇహే, పూదత్త, పే అను ఆచార్యత్రయం ఉంది. సోం ఇహే కాంచీ పురవాసి. ఈయన ప్రతిమ ఒకటి కాంచీనగర దేవాలయ సరోవరంలో ఉన్నది. పూదత్తుల జన్మం మల్లాపురి (తిరువన్నామలై)లో సంభవించెను. పే జన్మస్థలం మైలాపూరు. సదా విష్ణు ప్రేమోన్మత్తుడుగా ఉండడం వల్ల ఆయనను "పే" లేక ఉన్మత్తుడని పిలిచేవారు. సాధారణ శకం పూర్వం 4202లో "తిరుమిడిశి', 3102లో శఠారి జన్మించారు. శఠారి (శఠకోపుడు) పాండ్య దేశంలోని కురుకాపురిలో పుట్టారు. ఆయన శిష్యుడు మధురిపువు. ఈయన చక్కని కవిత్వము చెబుతూ 'మధురకవి' అనే బిరుదును పొందారు. ముకుందమాలను రాసిన మహాభక్తుడు కులశేఖరులు సాధారణ శకం పూర్వం 3102లో తిరుమంజిక్కోలము (చోళ పట్టణం)లో జన్మించారు. పెరియాళ్వారు 3058లో ఉద్భవించారు. ఆయన పుత్రికయే శ్రీ అండాళ్. ఈమె సాధారణ శకం పూర్వం 3005 నాటిది. ఈమె మహా మధురభాషిణి కావడం వల్ల 'గోదా'అని వ్యవహారంలోకి వచ్చింది. ఆమె తమిళంలో 'స్తోత్రరత్నావళి' రాశారు. ఇలా ప్రాగైతిహాసిక కాలం నుంచి వైష్ణవ గురుపరంపర ఉంది. ఐతిహాసిక కాలం వరరకు ఈ పరంపర అవిచ్ఛిన్నంగా వచ్చింది. ఆళ్వారులు చెప్పింది వేద సమ్మతం.

**– కె.సచ్చిదానందమూర్తి, 10.5.65 జాగృతి**

రాగా, వారి సూచన మేరకే ఇల్వలుడు అనే దానవ రాజును ఆశ్రయించాడు. ఇల్వలవాతాపి సోదరులు అతిథులను భోజనానికి ఆహ్వానించడం, వాతాపి మేకగా మారగా, ఇల్వలుడు దానిని చంపి వండి పెట్టడం,అతిథుల భోజనమైన వెంటనే ఇల్వలుడు 'సోదరా..వాతాపి' అనగానే ఆతను పొట్ట చీల్చుకు రావడం, అటు తరువాత అన్నదమ్ములు అతిథిని భక్షించడం పరిపాటైంది. ఇది గ్రహించిన అగస్త్యుడు వడ్డించిన ఆహారాన్ని భుజించి 'జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం' అనేశాడు. ఇల్వలుడి ఎత్తు పారక పోవడంతో క్షమాపణకోరి, రాజులతో వచ్చిన అగస్త్యుడికి ధనం ఇచ్చాడు. బయలుదేరేందుకు వెను దిరిగిన మునిపై దాడికి యత్నించిన ఇల్వలుడు ముని క్రోధాగ్నికి పిడికెడు బూదిగామారాడు. ఆశ్రమానికి చేరిన అగస్త్యుడు 'అసంఖ్యాక సంతానం కావాలా? గుణ శీలుడైన కుమారుడు కావాలా?' అని  భార్యను ప్రశ్నించగా, లోపాముద్ర రెండవ అంశంవైపే మొగ్గు చూపింది. వారి సంసారయాత్ర ఫలంగా దృఢదస్యుడనే కుమారుడు జన్మించి, మహతపస్విగా వినుతి కెక్కాడు.

కాలకేయులనే దానవసోదరులు, దేవతలను, మునులను హింసిస్తూ, వారి ప్రతిదాడి నుంచి తప్పించుకునేందుకు సముద్రంమధ్యలో దాగి ఉండే వారు. వారిని అంతమొందించేందుకు, దేవతల విన్నపంమేరకు అగస్త్యుడు సముద్రజలాలను ఔపాసనపట్టగా దేవతలు ఆ రాక్షస సోదరులను సంహరించారు. సముద్రాన్ని యధాతథంగా నీటి నింపాలన్న దేవతలతో 'మింగిన జలం జీర్ణమైంది కనుక జల పునరుద్ధరణ అసాధ్యం' అని బదులిచ్చాడు. భగరథుడు స్వర్గంనుంచి దింపిన గంగతో సముద్రాన్ని నింపారు. ఇలా అగస్త్యుడి జీవితంలో అనేక అద్భుత ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి.


**– రామచంద్ర రామానుజ**

## వివేకానంద సూక్తిశతి

**Bring light to the ignorant, and more light to the Educated, for the vanities of the education of out time are tremendous.**

ఆధునికత పేర అత్యహంకారమ్ము
పెంచు విద్య వలన మంచి సున్న
వెలుగు నింపు విద్య వేగమ్ము గావలె
వినుడి స్వామి సద్వివేక వాణి!!





# 2024

**భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, వైద్యశాస్త్రం, సాహిత్యం, శాంతి, ఆర్థికశాస్త్రంలో 2024 సంవత్సరానికి కూడా నోబెల్ ఫౌండేషన్ బహుమతులను ప్రకటించింది. ఈ ఆరురంగాల్లో మానవాళికి ప్రయోజనకరమైన ఆవిష్కరణలు, నవకల్పనలు చేసిన పన్నెండు మంది ప్రముఖులు 2024 నోబెల్ బహుమతులను గెలుచుకున్నారు. వీరి ఆవిష్కరణలు ప్రోటీన్ల నిర్మాణం నుంచి, యంత్రాల అధ్యయనం, అణ్వస్త్రాలు లేని ప్రపంచంకోసం చేసిన కృషి వరకు ఉండటం విశేషం. రసాయనశాస్త్రం, భౌతికశాస్త్రం, ఆర్థికశాస్త్రాలకు సంబంధించి రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఎంపిక చేస్తుంది. ఫిజియాలజీ/మెడిసిన్‌కు నోబెల్ అసెంబ్లీ ఎట్ కరోలిన్‌కా ఇన్‌స్టిట్యూట్, సాహిత్యానికి స్వీడిష్ అకాడమీ, శాంతి బహుమతికి నార్వేజియన్ నోబెల్ కమిటీ నిపుణులను ఎంపిక చేస్తాయి.**

1895లో స్వీడిష్ ఇంజినీర్, శాస్త్రవేత్త, ఇన్వెంటర్ ఆల్‌ఫ్రెడ్ నోబెల్ ప్రవేశపెట్టిన ఈ అవార్డులకు, కృత్రిమ న్యూరల్ నెట్‌వర్క్‌ల ద్వారా యంత్రాల అధ్యయనాలకు సంబంధించి నూతన ఆవిష్కరణలు, నవకల్పనలకు గాను భౌతికశాస్త్రంలో జాన్ జె. హొప్‌ఫీల్డ్, జియోఫ్రే ఇ. హింటన్‌లను, కంప్యుటేషన్ ప్రోటీన్ డిజైన్‌కు సంబంధించి రసాయన శాస్త్రంలో డేవిడ్ బేకర్‌ను, ప్రోటీన్ నిర్మాణాన్ని అంచనా వేసినందుకు గాను డెమిస్ హస్సాబిస్ మరియు జాన్ ఎం. జంపర్‌లను, వైద్యశాస్త్రానికి సంబంధించి మైక్రో ఆర్.ఎన్.ఎ.ను, పోస్ట్-ట్రాన్‌స్క్రిప్షనల్ జన్యు నియంత్రణలో దాని పాత్రను ఆవిష్కరించినందుకు, విక్టర్ అంబ్రోస్, గ్యారీ రూవ్‌కున్‌లను, సాహిత్యంలో హాన్‌కాంగ్‌ను, అణ్వస్త్రాలులేని ప్రపంచకోసం చేసిన కృషికి గాను నిహోన్ హిడాన్‌క్యో సంస్థను, సంస్థలు ఏర్పడే పద్ధతి అభ్యు దయంలో వాటి పాత్రను అధ్యయనం చేసినందుకు ఆర్థికశాస్త్రంలో స్విరిజెస్ రిక్స్‌బ్యాంక్ బహుమతిని డరన్ అసెమొగ్లు, సిమన్ జాన్సన్, జేమ్స్ ఎ. రాబిన్సన్‌లను ఎంపిక చేశారు.

**భౌతికశాస్త్రం**

భౌతికశాస్త్ర ఉపకరణాలను ఉపయోగించి నేడు అత్యంత శక్తిమంతంగా రూపొందిన మెషిన్ లెర్నింగ్ (యంత్ర అధ్యయనం)కు అవసరమైన పద్ధతులను రూపొందించినందుకు జాన్ హొప్‌ఫీల్డ్, జియోఫ్రే ఇ. హింటన్‌లు నోబెల్ బహుమతిని గెలుచుకున్నారు. సమాచార నిల్వ, పునర్నిర్మాణం కోసం జాన్ హొప్‌ఫీల్డ్ ఒక వ్యవస్థను సృష్టించగా, డేటా (సమాచారం) లక్షణాలను స్వతంత్రంగా ఆవిష్కరించ గలిగే ఒక వ్యవస్థను జియోఫ్రే ఇ. హింటన్ నవ కల్పన చేశారు. ప్రస్తుతం విస్తృతంగా వినియోగిస్తున్న కృత్రిమ న్యూరల్ నెట్‌వర్క్‌లో ఈ డేటా అత్యంత కీలకమైంది. కృత్రిమ న్యూరల్ నెట్‌వర్క్ ద్వారా యంత్ర అధ్యయనం అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం. మెదడు నిర్మాణక్రమమే ఈ సాంకేతిక పరిజ్ఞానానికి స్ఫూర్తి. మెదడులోని న్యూరాన్ల మాదిరి గానే ఈ నెట్‌వర్క్‌లోని నోడ్స్ పనిచేస్తాయి. అనుసంధానమైన రెండు నోడ్‌ల మధ్య ఉండే విలువలను గుర్తించే విధంగా ఈ నెట్‌వర్క్‌కు తగిన శిక్షణ ఇస్తారు.

**జాన్ జె. హోప్‌ఫీల్డ్:** పరమాణుల్లోని పరిభ్రమణ లక్షణం కారణంగానే పదార్థానికి ప్రత్యేక లక్షణం ఏర్పడుతుందనే భౌతికశాస్త్ర సూత్రాన్ని జాన్ జె. హొప్‌ఫీల్డ్ ఈ ఆవిష్కరణలో ఉపయోగించు కున్నాడు. ఈ పరిభ్రమణ లక్షణమే ప్రతి పరమాణువు ఒక సూక్ష్మమైన అయస్కాంతంగా మారడానికి ప్రధాన కారణం. భౌతికశాస్త్రంలో కనిపించే ఈ పరిభ్రమణ వ్యవస్థలోని శక్తికి, ఈయన కనుగొన్న నెట్‌వర్క్ యావత్తు సమానమని వివరించారు. ఈ నెట్‌వర్క్ గుర్తించిన నోడ్‌ల మధ్య అనుసంధాన విలువలు తక్కువ శక్తితో కూడిన చిత్రాల రూపంలో నిక్షిప్తమై (సేవ్)ఉంటాయి. హోప్ ఫీల్డ్ నెట్‌వర్క్‌కు వికృత లేదా అసంపూర్ణ చిత్రాలను అందించినప్పుడు అది క్రమపద్ధతిలో నోడ్స్ ద్వారా పనిచేసి అనుసంధాన విలువలను సవరిస్తుంది. ఫలితంగా నెట్‌వర్క్ శక్తి పడిపోతుంది. ఇక్కడ నెట్‌వర్క్ తనకు అందించిన అసంపూర్ణ చిత్రాన్ని, అప్పటికే తన వద్ద నిక్షిప్తమై ఉన్న ఏ చిత్రానికి సంబంధించినదో తెలుసుకోవ డానికి దశల వారీగా పనిచేస్తుంది.

**జియోఫ్రే ఇ. హింటన్:** ఈయన రూపొందించిన నెట్‌వర్క్ బోల్జ్‌మాన్ మెషిన్ అనే కొత్త పద్ధతిని ఉపయోగిస్తుంది. అందించిన డేటాకు సంబంధించిన లక్షణాలను గుర్తించే విధానాన్ని ఈ నెట్‌వర్క్ నేర్చుకుంటుంది. ఇందుకోసం హింటన్ స్టాటిస్టికల్ ఫిజిక్స్‌కు సంబంధించిన ఉపకరణాలను ఉపయో గించాడు. పనిచేసే సమయంలో సాధారణంగా ఎదురయ్యే సమస్యలకు సంబంధించిన ఉదాహరణ లను యంత్రంలో ఫీడ్ చేస్తారు. శిక్షణ పొందిన బోల్జ్‌మాన్ మెషిన్ చిత్రాలను వర్గీకరించడం లేదా కొత్త నమూనా ఉదాహరణలను రూపొందించ గలుగుతుంది. మెషిన్ లెర్నింగ్‌లో ఇదొక విప్లవాత్మక ఆవిష్కరణ.

**రసాయనశాస్త్రం**

**డేవిడ్ బేకర్:** ప్రోటీన్లు జీవులకు ఆధారం. శరీరంలో జరిగే అన్ని రకాల రసాయనిక చర్యలను ఇవి నియంత్రిస్తాయి. ప్రోటీన్లలో 20 అమైనో ఆమ్లాలుంటాయి. వీటినే లైఫ్ బిల్డింగ్ బ్లాక్స్ అని కూడా అంటారు. 2003లో డేవిడ్ బేకర్ ఈ



జాన్ హొప్‌ఫీల్డ్, జియోఫ్రే ఇ. హింటన్



డేవిడ్ బేకర్, డెమిస్ హస్సాబిస్, జాన్ ఎం.జంపర్

# నోబెల్ పురస్కారాలు




ఆమ్లాలను ఉపయోగించి సరికొత్త ప్రొటీన్ రూపొందించారు. ఇందుకోసం కంప్యూటర్ ఆధారిత పద్ధతులనే ఉపయోగించాడు. ఈయన సాధించిన ఈ విజయం వల్ల, మరిన్ని నూతన ప్రొటీన్ల రూపకల్పనకు మార్గం ఏర్పడింది. ఈవిధంగా రూపొందించే కొత్త ప్రొటీన్లను ఔషధాలు, వ్యాక్సిన్లు, వివిధ పదార్థాలు, సెన్సార్లలో ఉపయోగించవచ్చు.

**డెమిస్ హస్సాబిస్, జాన్ ఎం. జంపర్**

ప్రొటీన్లు శరీరంలోని రసాయన చర్యలను నియంత్రిస్తాయి. ప్రొటీన్లలో వుండే 20 రకాల అమైనో ఆమ్లాలు ఒకదానితో మరొకటి తంతువుల ద్వారా అనుసంధానమై త్రిమితీయ నిర్మాణాన్ని ఏర్పరుస్తాయి. 2020లో డెమిస్ హస్సాబిస్, జాన్ జంపర్‌లు 'ఆల్ఫా ఫోల్డ్2' పేరుతో ఒక కృత్రిమ మేధ (ఎ.ఐ.) నమూనాను ప్రదర్శించారు. దీని సహాయంతో మనకు తెలిసిన అన్ని రకాల ప్రొటీన్ల నిర్మాణాన్ని వర్చువల్‌గా అంచనా వేయడానికి వీలైంది. ప్రస్తుతం ఆల్ఫా ఫోల్డ్2ను వివిధ రంగాల్లో ముఖ్యంగా ఔషధరంగం, పర్యావరణ సాంకేతిక పరిజ్ఞానంలో ఉపయోగిస్తున్నారు.

**విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రూవ్‌కున్**

మన శరీరంలోని అన్ని కణాలకు సంబంధించిన ఆదేశాల వివరాలతో మానవ జీనోమ్‌ను పోల్చవచ్చు. అయినప్పటికి వివిధ రకాల కణాలు, ప్రత్యేక లక్షణాలతో ఉంటాయి. ఇందుకు ప్రధాన కారణం జన్యు నియంత్రణ. కేవలం ఈ నియంత్రణ కారణంగా కణాలు తమకు అవసరమైన ఆదేశాలను మాత్రమే స్వీకరిస్తాయి. 1993లో విక్టర్ ఆంబ్రోస్, గ్యారి రూవ్‌కున్‌లు మైక్రో ఆర్.ఎన్.ఎ.ను కనుగొన్నారు. ఈ సరికొత్త ఆర్.ఎన్.ఎ. (రైబో న్యూక్లియక్ ఆమ్లం) కణాలు జన్యు నియంత్రణలో కీలకపాత్ర పోషిస్తాయి. ఇది జన్యు నియంత్రణకు సంబంధించిన కొత్త కోణం మాత్రమే కాదు జీవుల అభివృద్ధి, పనిచేసే విధానాన్ని తెలుసుకోవడానికి మరింతగా ఉపయోగపడుతుంది.

**నిహోన్ హిడాన్‌క్యో**

1945లో హిరోషిమా, నాగసాకి పట్టణాలపై అమెరికా రెండు అణుబాం బులు వేసింది. ఫలితంగా 1,20,000 మంది అక్కడికక్కడే మరణించగా అంతే సంఖ్యలో ప్రజలు కాలిన గాయాలు, రేడియేషన్ ప్రభావంతో మృత్యువాత పడ్డారు. అయితే ఈ బాంబు దాడులనుంచి బతికి బట్టకట్టినవారి సంఖ్య 6,50,000. వీరిని జపాన్‌లో 'హిబకుష' అని పిలుస్తారు. విచిత్రమేమంటే చాలాకాలం వరకు వీరిని ఎవ్వరూ పట్టించుకోలేదు. 1956లో జపాన్‌లోని



హిబకుష సంఘాలు, పసిఫిక్ ప్రాంతానికి చెందిన అణుపరీక్షల బాధితులు కలిసి 'ది జపాన్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఎ- అండ్ హెచ్-బాంబ్ సఫరర్స్ ఆర్గనైజేషన్స్'గా ఏర్పడ్డారు. ఈ సంఘాన్నే సంక్షిప్తంగా జపాన్ భాషలో 'నిహోన్ హిడాన్‌క్యో' అని పిలుస్తారు. ఇది క్రమంగా అతిపెద్ద సంస్థగా విస్తరించింది. జపాన్‌లో పెద్ద సంఖ్యలో ప్రతినిధులను కలిగిన సంస్థగా 'హిబకుష' రూపొందింది. నిహోన్ హిడాన్‌క్యో ప్రధానంగా రెండు లక్ష్యాల కోసం పనిచేస్తున్నది. మొదటిది జపాన్, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న హిబకుషలకు సామాజిక ఆర్థిక హక్కుల కల్పన, భవిష్యత్తులో మరెవరూ హిబకుషల మాదిరిగా అణు విపత్తులకు గురికాకుండా కృషిచేయడం. అణ్వస్త్రాల ప్రయోగం వల్ల కలిగే వినాశనకర విపత్తులు, మానవాళికి అవి కలిగించే ప్రమాదాలపై నిహోన్ హిడాన్‌క్యో వివిధ ప్రాంతాల్లో అవగాహనా తరగతులు నిర్వహించడమే కాదు, ప్రజల్లో అణ్వస్త్రాలకు వ్యతిరేకంగా చైతన్యం కలిగించేందుకు ఎంతో కృషిచేసింది. ఈ సంస్థ ప్రధాన లక్ష్యమే 'నో మోర్ హిబకుష'.

**డరన్ అసెమొగ్లు, సిమన్ జాన్సన్, జేమ్స్ ఎ. రాబిన్సన్**

వివిధ దేశాల మధ్య సంపద విషయంలో అసమానతలకు ప్రధాన కారణం, సామాజిక సంస్థల మధ్య సుస్థిరంగా కొనసాగుతున్న అంతరాలు. యూరోపి యన్ వలసవాదులు ప్రవేశపెట్టిన రాజకీయ మరియు ఆర్థిక వ్యవస్థలను డరన్ అసెమొగ్లు, సిమన్ జాన్సన్, జేమ్స్ ఎ. రాబిన్సన్‌లు బాగా అధ్యయనం చేసి, సంస్థలకు సంపదకు మధ్య ఉన్న సంబంధాన్ని స్పష్టంగా వివరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంస్థల మధ్య వ్యత్యాసం, ఈ సంస్థలు ఏవిధంగా మార్పు చెందగలవు అనే



విక్టర్ ఆంబ్రోస్, గ్యారి రూవ్‌కున్



డరన్ అసెమొగ్లు, సిమన్ జాన్సన్, జేమ్స్ ఎ. రాబిన్సన్

అంశాలను స్ప ష్టంగా వివరించడానికి సైద్ధాంతిక ఉపకరణాలను వీరు అభివృద్ధి చేశారు.

**ఇప్పటివరకు 627సార్లు...**

ఆల్‌ఫ్రెడ్ నోబెల్ సంస్మరణకు చిహ్నంగా 1901 నుంచి 2024 వరకు నోబెల్ బహుమతులు, ఆర్థికశాస్త్రంలో స్విరిజెస్ రిక్స్‌బ్యాంక్ బహుమతులను 627 సార్లు ఇవ్వగా మొత్తం 1012మంది వ్యక్తులు, సంస్థలు వీటిని అందుకున్నారు. వీరిలో కొందరికి ఒకటికంటే ఎక్కువ సార్లు నోబెల్ బహుమతులు గెలుచుకున్నారు. ఆవిధంగా చూస్తే 976 మంది వ్యక్తులు 28 సంస్థలు నోబెల్ బహుమతులు గెలుచు కున్నాయి.

**విమర్శలు**

అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతులను కేవలం రాజకీయ అజెండా ప్రకారమే ప్రకటిస్తారన్న ఆరోపణలు లేకపోలేదు. ముఖ్యంగా సాహిత్య బహుమతికి ఎంపిక చేయడంలో యూరోసెంట్రిక్ (పశ్చిమ దేశాలు మాత్రమే ప్రపంచానికి కేంద్రమన్న భావన)గా వ్యవహరిస్తారన్న అపప్రథ కూడా ఉంది. అమెరికాకు చెందిన దౌత్యవేత్త హెన్రీ కిసింజర్‌ను శాంతి బహుమతికి ఎంపిక చేయడం పెద్ద దుమారమే రేపింది. 1973 జనవరిలో ఉత్తర వియత్నాం-అమెరికాల మధ్య కాల్పుల విరమణ కోసం చర్చలు జరిపినందుకు కిసింజర్‌కు శాంతి బహుమతికి ఎంపిక చేశారు. అయితే అవార్డు ప్రకటించే సమయానికి ఇరుపక్షాల మధ్య ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో ఈ ఎంపికపై విమర్శలు వెల్లువెత్తాయి. ఫలితంగా నోబెల్ కమిటీ సభ్యులు రాజీనామా చేయాల్సివచ్చింది. 2009లో బరాక్ ఒబామాను శాంతి బహుమతికి ఎంపిక చేయడం కూడా వివాదాస్పదమైంది. 20వ శతాబ్దంలో అహింసా సిద్ధాంతానికి ప్రతీకగా నిలిచిన మహాత్మా గాంధీని శాంతి బహుమతికి ఎంపిక చేయక పోవడం విచిత్రం. ఆయన పేరు 1937, 1938, 1939, 1947ల్లో శాంతి బహుమతికి నామినేట్ అయినా కమిటీ సభ్యులు విస్మరించడం అసలు 'శాంతి బహుమతి' పేరుకే అర్థం లేకుండా చేసింది. 2009లో ఫారెన్ పాలసీ మ్యాగజైన్ నోబెల్ శాంతి బహుమతికి అన్ని విధాలా అర్హతలుండి విస్మరణకు గురైన ప్రముఖుల పేర్లను వెల్లడించింది. వీరు వరుసగా మహాత్మాగాంధీ, ఎలియనోర్ రూజ్‌వెల్ట్, వాక్లావ్ హావెల్, కెన్ సరో-వివా, సారి నుసాయ్‌బెహ్, కొరా జోన్ అక్వినో. చైనాకు చెందిన మానవహక్కుల కార్యకర్త, తత్వవేత్త లియు జియాబావోకు 2010లో నోబెల్ శాంతి బహుమతి ప్రకటించినప్పటికీ, చైనా ప్రభుత్వం ఆయన్ను జైల్లో పెట్టడంవల్ల దాన్ని స్వీకరించలేకపోయారు. కొన్ని విమర్శలు ఉండవచ్చు. అయినా నోబెల్ పురస్కారాలకు ఎంపికైనవారి ప్రతిభ అసామాన్యమైనదే. మానవాళికి ఉపయోగపడేదే.



**జమలాపురపు విఠల్‌రావు**

సీనియర్ జర్నలిస్ట్

'నీ ఇష్టం మేరకు జీవించే అవకాశమే నీకు వచ్చిందంటే, ఆ జీవితంతో నీవేం చేస్తావు?' ఈ సంవత్సరం నోబెల్ సాహిత్య పురస్కారానికి ఎంపికైన హాన్ కాంగ్ (దక్షిణ కొరియా) రాసిన నవల 'యూరోపా'లోని వాక్యమిది. ఒక తాత్త్వికత, ఒక కవితాత్మకత ఇందులో మేళవించాయనడానికి ఎలాంటి సందేహం అక్కరలేదు. వ్యక్తి స్వేచ్ఛకోసం ఒక కలం ఆర్తి ఈ వాక్యంలో ధ్వనిస్తుంది కూడా. మనిషి తన అస్తిత్వం గురించి ఇలాంటి ప్రశ్న వేసుకోవలసిన సందర్భాలు ప్రపంచ చరిత్ర ప్రతి మలుపులోనూ కనిపిస్తాయి. ఇంకా చెప్పాలంటే ఆ ప్రశ్న అవసరం మహిళాలోకానికి మరింత ఎక్కువ. మొదట గుర్తించవలసిన అంశం, నీ ఇష్టం మేరకు నీవు జీవించే అవకాశం చరిత్ర తక్కువ సందర్భాలలోనే ఇచ్చింది. నియంతృత్వాలు, మత యుద్ధాలు, ప్రపంచ యుద్ధాలు, కమ్యూనిస్టు అనుకూల, వ్యతిరేక యుద్ధాలు, మరీ ముఖ్యంగా వలస పాలనలు, సైనిక నియంతృత్వాలు అన్నీ కూడా మనిషిని మనిషిగా, ఆలోచించే జీవిగా గుర్తించడానికి నిరాకరించినవే. అందుకే ఆ ప్రశ్న వర్తమానకాలంలో గొప్ప ప్రాసంగికతను కలిగి ఉందనిపిస్తుంది. స్వీడిష్ అకాడెమి అధ్యక్షుడు ఆండర్స్ ఓల్సన్ వ్యాఖ్య ఇక్కడ గుర్తు చేసుకోవాలి. 'ఆత్మకూ శరీరానికీ మధ్య ఉండే బంధం పట్ల, మరణించినవారు ఎవరు? జీవించి ఉన్నవారు ఎవరు అన్న తాత్త్వికత మీద ఆమె (హాన్) గొప్ప స్పృహను కలిగి ఉన్నారు.' అన్నారు ఓల్సన్. హాన్ రచనలలోని మరొక ప్రత్యేకత- సాధారణంగా ఆమె ఇతివృత్తాలన్నీ స్త్రీ పాత్రలే కేంద్రబిందువులుగా ఉంటాయి. వాటి ఆవిష్కరణ మాత్రం




పురుషుల కోణం నుంచి జరుగుతూ ఉంటుంది.

రచనను నిలబెట్టేది, కాలపరీక్షకు నిలిచేటట్టు చేసేది శైలి. ఇతివృత్తం అంటే, సారం ఎంత బలంగా ఉంటుందో, దానిని ఆవిష్కరించిన తీరు, అంటే రూపం అంత పటిష్టంగాను ఉండాలి. వాటి మేలుకలయికకు హాన్ రచన వేదిక అని విమర్శకులు చెబుతారు. 'కవితాత్మక వచనశైలి'కి ఈ సంవత్సరం సాహిత్య నోబెల్ పురస్కారం దక్కడం అందుకే ఆహ్వానించదగినదిగా ఉంది. దక్షిణ కొరియా రచయిత్రి హాన్ కాంగ్ 2024 సంవత్సరానికి ఆ సమున్నత సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఆ పురస్కారం అందించే స్వీడిష్ నోబెల్ అకాడెమి ఆమె రచనా సంవిధానం గురించి పరిచయం చేస్తూ ఇచ్చిన ప్రశంస ఇదే- 'గాఢమైన కవిత్వాత్మతో, వచనం రాసే హాన్ మానవ సమాజానికి చరిత్ర పరిణామం చేసిన గాయాల లోతును అన్వేషిస్తారు. అలాగే మానవ జీవితంలోని సునిశిత కోణాన్ని ఆవిష్కరిస్తారు.' సృజనాత్మక రచనల ఆకర్షణను పెంచే వర్ణనలు కూడా హాన్ కవిత్వ స్పర్శతో చేస్తారు.

నోబెల్ పురస్కారాలు ఆరంభమై123 సంవత్సరాలయింది. ఈ కాలంలో సాహిత్య నోబెల్ పురస్కారం 117 మంది అందుకున్నారు. అందులో మహిళలు 18 మంది. వారిలో ఒకరు హాన్. ఆసియా మహిళ ఆ సాహిత్య పురస్కారం అందుకోవడం కూడా ఇదే మొదటిసారి. దక్షిణ కొరియా నుంచి ఆ పురస్కారానికి ఎంపికైన రెండో వ్యక్తి. హాన్ సియోల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ది ఆర్ట్స్ సంస్థలో సృజనాత్మక రచన గురించి బోధిస్తారు. గాజా, ఉక్రెయిన్ ఘర్షణల నేపథ్యంలో ఆమె ఎలాంటి సత్కారాలకీ అంగీకరించలేదు.

# కాల ప్రవాహంతో 'నది' మాటామంతి




ఆమె 1970లో పుట్టారు.

హాన్ సాహిత్య నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. ఆమె తండ్రి హాన్ సుంగ్ వాన్ కూడా నవలా రచయితే. అన్నయ్య హాన్ దొంగ్ రిమ్ కూడా నవలా రచయిత. తమ్ముడు హాన్ కాంగ్ ఇన్ నవలా రచయిత, వ్యంగ్య చిత్రకారుడు కూడా. 'ఇంతకాలం హాన్ కాంగ్ హాన్ సుంగ్ కుమార్తె అని చెప్పుకునేవారు. ఇప్పుడు హాన్ కాంగ్ తండ్రి హాన్ సుంగ్ అని చెప్పుకుంటార'ని తండ్రి వాన్ చమత్కరించారు. ఆమె దేశంలో హాన్ పాఠకలోకం విస్తృతమైనది. ఆ చిన్న దేశంలో ఆమె రచనలు 800,000 ప్రతులు అమ్ముడయ్యాయి. పురస్కారం ప్రకటించిన తరువాత వెంటనే ఆ సంఖ్య పది లక్షలకు చేరవచ్చునని అంచనా వేశారు. హాన్ రాసిన నవలల్లో ఆరు ఆంగ్లం లోకి వెళ్లాయి. అవి– కన్వల్‌సెన్స్, ది వెజిటేరియన్, హ్యూమన్ యాక్ట్స్, ది వైట్‌బుక్, యూరోపా, ది గ్రీక్ లెసన్స్. 'శాకాహారి' నవలకు గాను 2016లో ఆమెకు బుకర్ పురస్కారం లభించింది.

కవయిత్రిగానే హాన్ రచనా వ్యాసంగం మొదలైంది. 1995లో ఆమె కథా రచయిత్రిగా, నవలాకర్తగా ప్రయాణం ఆరంభించారు. అందుకే వచనంలోను కవితాత్మకత వెల్లివిరుస్తూ ఉంటుందని ఆమె రచనలను విమర్శకులు శ్లాఘిస్తారు. 2016లో బుకర్‌కు ఎంపిక అయినప్పటికి 'శాకాహారి' నవలను ఆమె 2007లో రాశారు. ఈ నవల ఆమె సాహిత్య జీవితాన్ని మలుపు తిప్పింది. దీనిని దేబొరా స్మిత్ ఆంగ్లంలోకి అనువదించడంతో మ్యాన్ బుకర్ బహుమానం వరించింది. యోంగ్ హే అన్న గృహిణి మౌన ఆక్రందన ఇది. అదే బహిరంగ తిరుగుబాటుగా పరిణమించింది. తను లైంగికంగా, మానసికంగా ఎదుర్కొన్న అనుభవాల తరువాత సమాజ కట్టుబాట్ల మీద తిరుగుబాటు చేస్తుందామె. చావుని కూడా పరిహాసం చేసే మనుషుల క్రూరత్వాన్ని చూసిన తరువాత తను ఒక మొక్కలాంటి ఉనికిని మాత్రమే కలిగి ఉంటే మంచిదని నమ్మే యువతి ప్రధాన పాత్రగా వచ్చిన నవల ఇది.

హాన్ సైనిక దుశ్చర్యల మీద కలం బలంతో దండెత్తారు. చరిత్ర చేసే గాయాలకు ఆమె అక్షరాలు గొంతునిస్తాయని విమర్శకుల అభిప్రాయం. అందుకు మంచి ఉదాహరణ 'హ్యూమన్ యాక్ట్స్' నవల. ప్రభుత్వ కూల్చివేతకు నిరసనగా 1980 దశకంలో దక్షిణ కొరియాలోని గ్వాంజు అనే చోట విద్యార్థులు లేవనెత్తిన తిరుగుబాటు మీద సైనిక నియంత సాగించిన దమనకాండను ఈ నవలలో చర్చించారు. గ్వాంజు పట్టణమే ఆమె స్వస్థలం. అక్కడే పెరిగారు హాన్. ఆమె తొమ్మిదో ఏట ఆ రాజకీయ పరిణామం సంభవించింది. ఆ బలవంతపు అధికార మార్పిడికి నిరసనగా మే 18, 1980న విద్యార్థులు తిరుగుబాటు చేశారు. అంతవరకు ఉన్న ప్రభుత్వాన్ని కూలదోసి మే 17న చున్ దూ హ్వాన్ అనే సైనికాధికారి అధికారం చేజిక్కించుకున్నాడు. ఫలితమే దారుణ హింసాకాండ. అదే 'హ్యూమన్ యాక్ట్స్' ఇతివృత్తం. ఆ ఘటనలను స్వయంగా వీక్షించిన తమ కుటుంబం చిరకాలం పాటు ఎందుకు బతికి ఉన్నామా? అని ప్రశ్నించుకోవలసి వచ్చిందని హాన్ ఒక ఇంటర్వ్యూలో చెప్పడం విశేషం. ఆ నెత్తుటికాండ జరగడానికి కాస్త ముందే ఆ కుటుంబం గ్వాంజును వీడి సియోల్ లోని సూయూ రి అనే చోటికి వచ్చి స్థిరపడింది.

నియంతృత్వం కింద చిరకాలం ఉండిపోయిన దక్షిణ కొరియా చరిత్రలోని మరొక నెత్తుటి ఘటనకు కూడా ఆమె అక్షరరూపం ఇచ్చారు. అలాగే స్త్రీవాదం ఆధారంగా నడిచిన పోరాటాలను తన రచనలకు ఇతివృత్తంగా స్వీకరించారు. అవన్నీ ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం ఉద్యమాలే. గ్వాంజు ఉద్యమంలో చనిపోయిన దోంగ్ హో అనే యువకుడి గాథ, అతడి తల్లి ఆక్రందన రచయిత్రిని కదిలించాయి. ఆ ఉద్యమంలో భాగస్వాములుగా ఉన్న ఒక పత్రికా సంపాదకుడు, కార్మికుడు, ఒక ఖైదీ ఎదుర్కొన్న దారుణ పరిస్థితులను తన నవలలో జోడించారు. కానీ ఈ అణచివేతలో ప్రభుత్వ తప్పిదం లేదని చెప్పే కొన్ని వాదనలు సమాజం మీదకు వచ్చాయి. కొన్ని కుట్ర సిద్ధాంతాలు బయలుదేరాయి. సంప్రదాయ వాదులు ఆ తిరుగుబాటును ఉత్తర కొరియా కుట్రగా భాష్యం చెప్పే ప్రయత్నం చేశారు. మొత్తంగా చూస్తే హ్యూమన్ యాక్ట్స్ నవల వాస్తవ పాత్రల మేళవింపే. ఇందులో మూన్ జి హక్ అనే బాలుడిని సైనిక పాలకులు కాల్చి చంపేస్తారు. ఇంతకీ అతడు ఉన్నత పాఠశాల విద్యార్థి. అది కూడా నిజ జీవితంలోని పాత్రే. ఇలాంటి సామాజిక పరిస్థితిలో కన్నబిడ్డను పోగొట్టుకున్న ఏ తల్లయినా చెప్పే మాటను రచయిత్రి అద్భుతంగా రాశారు. 'నేను చాలా సంతోషించాను. ఆ మాట వినడంతో (మూన్ జి మరణవార్త) నా గుండె ఆగిపోతుందని భావించాను' అంటుందామె. ఒక కాలపు కర్కశత్వంలో మనిషి ఎంత నిస్సహాయంగా మిగిలిపోయాడో చెప్పే వ్యాఖ్య ఇది. చిత్రంగా మరొక సైనికాధికారి కుమార్తె పార్క్ గుయెన్ హే పరిపాలనలో హాన్ రచనల మీద నిషేధం అమలైంది.

'మేం భాగస్వాములం కాదు' అన్న నవల కూడా ఇలాంటి ఇతివృత్తంతో రాసినదే. అలాగే గతం వర్తమానంతో సంభాషిస్తూనే ఉంటుందన్న చరిత్ర తత్త్వవేత్తల మాట ఎంత నిజమో తెలియచేసే ప్రయత్నం ఇందులో ఆమె చేశారని అనిపిస్తుంది. వర్తమానం మీద గతం ప్రభావం ఉంటుందని అంటారు హాన్. దక్షిణ కొరియాలోనే జిజు అనే ద్వీపంలో పౌరుల మీద సైనిక ప్రభుత్వం సాగించిన దమనకాండ ఇందులో ఇతివృత్తం. 1948 నాటి ఘటన ఇది. 1948–49 నాటి ఆ గొడవలు తన మిత్రుని కుటుంబం మీద ఎలాంటి ప్రభావం చూపాయో చెబుతారు రచయిత్రి. ఈ ఘటనలు దారుణమైనవి. తిరుగుబాటుదారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణతో జిజు ద్వీపంలోని 30,000 మందిని అమెరికా మద్దతు ఉన్న దక్షిణ కొరియా సైన్యాలు చంపేశాయి. సైనిక కర్కశత్వం మీద రాసిన హ్యూమన్ యాక్ట్స్ నవలకూ, దీనికీ సంబంధం ఉందని ఒక సందర్భంలో చెప్పారు హాన్. ఇక 'ది వైట్ బుక్' దాదాపుగా ఆత్మకథేనని ఆమె అంటారు.

హాన్ కాంగ్ అంటే అంటే హాన్ అనే నది. నదిని కాలానికి ప్రతీకగా భావిస్తారు. ప్రవాహం ఎంతో చరిత్రకు సాక్ష్యం. తన దేశ చరిత్రకు, అందులోని కర్కశత్వానికీ, కాఠిన్యానికీ, చైతన్యానికీ హాన్ సాక్షిగా నిలిచారు. ఆమె రచనలోని ప్రతి వాక్యం ఇదే చెబుతుంది.

– కల్హణ

**భారత్, చైనా మధ్య వాస్తవాధీనరేఖ (లైన్ ఆఫ్ ఆక్చువల్ కంట్రోల్) నిర్దిష్టంగా లేక ఒక బ్రహ్మ పదార్థంలా పరిణమించడంతో ఆ ప్రాంతమంతా కొన్ని దశాబ్దాలుగా అట్టుడుకుతూనే ఉంది. భారతదేశపు అనేక సరిహద్దు ప్రాంతాలు తమవేనంటూ చైనా తన హక్కులు ప్రకటించుకోవడం, ఆ ప్రాంతాల పేర్లు మార్చేయడం మనకు తెలిసిన చరిత్రే. ఈ క్రమంలో 2020లో గల్వాన్ ఘర్షణతో ఏర్పడిన ప్రతిష్ఠంభనను పరిష్కరించుకునే దిశగా సరిహద్దులలో ఉన్న ఇరు దేశాల సేనలను ఉపసంహరించుకోవాలని, ఎవరి వైపు సరిహద్దులలో వారు పహారా ఉండాలనే అంగీకారానికి రావడం ఆసియా ప్రాంతంలో ఒక గొప్ప పరిణామం. రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు వేదికగా భారత్, చైనా దేశాధినేతలు కలుసుకుని చర్చలు జరపడంతో ఇది అధికారికం అయింది. పరస్పర విరుద్ధమైన జాతీయ ప్రయోజనాలు, ఒకరంటే మరొకరికి పొసగని వైఖరి ఉన్నప్పటికీ, ఈ ప్రాంతంలోని అతిపెద్ద దేశాలు రెండూ కూడా బహుళ ధ్రువ ప్రపంచ స్థాపనకు చేతులు కలపడం ఒక శుభపరిణామం.**



# సరిహద్దులలో శాంతి కోసం

ఈ సేనల ఉపసంహరణ ఒప్పందం ఆహ్వానించదగినది. అయితే, అక్సాయ్ చిన్‌లోని కొన్ని ప్రాంతాలలో చైనా వేగంగా సేనలను మోహరించగల సామర్థ్యం కలిగి ఉన్నందున మన దళాలను మరొక చోట మోహరించే అవకాశం లేదని కొందరు విశ్లేషకుల భావన. దానినీ కాదనలేం, ఎందుకంటే, చైనా సలామీ స్లైసింగ్ ప్రక్రియలో నిష్ణాతత సాధించింది. కాగా, భారతదేశం గల్వాన్ ఘర్షణకు ముందు గల పరిస్థితికి తిరిగి వెళ్లాలంటూ మొండి పట్టు పట్టడం వల్లనే నేటి ఒప్పందం సాధ్యమైందన్నది వాస్తవం.

ఈ ఒప్పందం తూర్పు లద్దాక్‌లో దీర్ఘకాలికంగా ఉన్న ఉద్రిక్తతలను పరిష్కరించడమనేది వాస్తవాధీన రేఖ వెంట శాంతిని పునరుద్ధరించడంలో దౌత్యపరంగా జరిగిన కృషిలో ఒక మైలు రాయి. తాము రక్తం పంచుకుపుట్టిన సోదరలమని చెప్పుకునే పాకిస్తాన్‌ను విస్మరించి, చైనా మనతో స్నేహం చేసేందుకు ముందుకు రావడం పాక్‌లో కొన్ని వర్గాలకు మింగుడు పడడం లేదనే వార్తలు వినిపిస్తు న్నాయి. అయితే, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నడుమ చైనా ఆ దేశంతో తనకు గల ప్రయోజనాలను పక్కకు పెట్టి మరీ రాజీకి వచ్చింది.

భారత్, చైనాలు తమ మధ్య అభిప్రాయభేదాలను 'కొంత మేరకు తగ్గించుకొని', తూర్పు లద్దాక్‌లో కొన్ని ఘర్షణాత్మక స్థలాల్లో సేనలను ఉపసంహరించు కునేందుకు 'కొద్ది ఏకాభిప్రాయాన్ని' సాధించాయని, త్వరలోనే ఇరుపక్షాలకూ ఆమోదయోగ్యమైన తీర్మానానికి వస్తాయంటూ గత నెలలో చైనా రక్షణ మంత్రిత్వ శాఖ ఆచితూచి ప్రకటన విడుదల చేసిన తర్వాతి వారాలలో, ఇరు పక్షాల మధ్య సంబంధాలలో గణనీయమైన మార్పుకు సంబంధించిన సంకేతాలు కనిపించాయి. కాగా, ఈ నెల మొదట్లో భారత రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ కూడా సరిహద్దు ప్రతిష్ఠంభన పరిష్కారం కోసం భారత్– చైనా మధ్య చర్చల పురోగతి సానుకూలంగా కనిపిస్తోందని ప్రభుత్వం భావిస్తోందని, అయితే ఆకస్మిక పరిస్థితులకు సిద్ధంగా ఉండవలసిన అవసరం ఉందంటూ సైనిక దళాల ఉన్నతాధికారులకు తెలిపినట్టు వార్తలు వచ్చాయి. ఏమైనప్పటికీ, భారత్ అప్రమత్తంగానే అడుగులు వేస్తోందని రక్షణమంత్రి వ్యాఖ్యలు చెప్తున్నాయి.

**ఈ ఒప్పందం ఎందుకు ముఖ్యం?**

పాశ్చాత్య ప్రపంచంలో సంచలనం సృష్టించిన బ్రిక్స్ సదస్సుకు ముందు ఈ ఒప్పందం జరగడం చాలా విషయాలు చెప్పకనే చెబుతున్నాయి. 2020లో గల్వాన్ వద్ద జరిగిన హింసాత్మక ఘర్షణల అనంతరం ఇరు దేశాలూ కూడా వాస్తవాధీన రేఖ వద్ద తమ సైన్యాలను మోహరించడంతో ఉద్రిక్తత కొనసాగుతూనే ఉన్నది. సేనల ఉపసంహరణ స్తంభించింది, కానీ ఇప్పుడు ఇరు పక్షాలూ కూడా నూతన పహారా ఏర్పాట్లపై ఒక ఒప్పందానికి వచ్చారు. ఈ ఒప్పందం కింద వాస్తవాధీన రేఖ వెంట కొన్ని పహారాల పాయింట్లు భారతీయ దళాలకు అందుబాటులోకి వస్తాయి. ప్యాంగాంగ్ లేక్ ఉత్తర్ ప్రాంతం వంటి నిర్దిష్ట ఘర్షణాత్మక ప్రాంతాలలో గత సేనల ఉపసంహరణ సమయంలో బఫర్ జోన్లను చైనా దళాలు ఏర్పాటు చేసి, భారతీయ సేనలను అడ్డుకుంటున్నారు. ఇటువంటి ప్రాంతాలు కూడా భారతీయ సేనల పహారాకు అందుబాటులోకి వస్తాయని తెలుస్తోంది.

గతంలో భారత్, చైనాలు పలు ప్రాంతాలలో ప్రతిష్ఠంభనలను పరిష్కరించినప్పటికీ, ఇప్పటి వరకూ పరిష్కారం కాని ప్రాంతాలు అనేకం ఉన్నాయి. కాగా, ప్రస్తుతం ఈ అంగీకారానికి రావడానికి దౌత్యపరమైన, సైనిక సహా బహుళ మార్గాల ద్వారా చర్చలు నిర్వహించడమే కారణమని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ వెల్లడించడం, దీని ప్రాధాన్యతను చెప్పకనే చెప్తుంది. ద్వైపాక్షిక ఒప్పందాలు, ప్రోటోకాల్ అనంతరం శాంతి, స్థిరత్వాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా ఇరు దేశ ప్రతినిధులు పని చేశారు.

**భారత్‌కు దీనివల్ల లాభమేమిటి?**

పలురకాలుగా ఈ ఒప్పందం భారత్‌కు మేలు చేకూర్చనుంది. సేనల ఉప సంహరణతో భారతీయ దళాలు 2020కు ముందు నియమాలకు అనుగుణంగా తమ నిత్య పెట్రోలింగ్‌ను నిర్వహించ వచ్చు. జాతీయ అభివృద్ధి కోసం కీలకమైన సరిహద్దుల వెంట శాంతి అనే వ్యూహాత్మక లక్ష్యాన్ని ఇది పునరుద్ఘాటిస్తుంది. అమెరికా, కెనడా వంటి పాశ్చాత్య దేశాలతో సంబంధాలు సంక్లిష్టమైన తరుణంలో అంతర్జాతీయ శక్తులతో సంబంధాలు ఆశించిన విధంగా భవిష్యత్తులో లేకపోతే, గొప్ప నష్టాన్ని లేదా వైఫల్యాన్ని ఈ ఒప్పందం నివారించనుంది.

పాశ్చాత్య ప్రభావానికి దూరంగా తన దౌత్యపరమైన ప్రత్యామ్నాయాలను బహుముఖం చేసుకునేందుకు బ్రిక్స్ వేదిక భారత్‌కు ఈ అవకాశాన్ని అందించింది. చైనాతో సంబంధాలు మెరుగు పడుతున్న నేపథ్యంలో, తన దీర్ఘకాలిక ప్రయోజ నాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయాలను వెతుకుతోంది.

**చైనా ఇప్పుడు ఎందుకు అంగీకరిస్తోంది?**

వాస్తవాధీన రేఖ వద్ద గల ఉద్రిక్తతలను పరిష్కరించుకోవాలన్న భావనకు చైనా రావడానికి కారణం, తైవాన్‌పై అది పెడుతున్న దృష్టే అని



# ఒప్పందం

పలువురు విశ్లేషకులు అంటున్నారు. అటు ఉక్రెయిన్, మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతల కారణంగా అమెరికా సతమతమైపోతూ ఉన్న నేపథ్యంలో చైనా తన సైనిక దృష్టిని తైవాన్‌పై కేంద్రీకరించేందుకు ఇది తగిన సమయంగా భావిస్తోంది. భారత్–చైనా సరిహద్దుల వద్ద సేనలను ఉపసంహరించడం ద్వారా, చైనా తన తైవాన్ లక్ష్యం కోసం మరిన్ని సేనలను కేటాయించ వచ్చు. తైవాన్‌ను కలుపుకునేందుకు అవసరమైన సైనిక చర్యలను ప్రారంభించేందుకు కూడా ఆస్కారం ఉంది. అదనంగా, పాశ్చాత్య దేశాల వ్యవస్థలకు బ్రిక్స్ ప్రత్యామ్నాయమని చైనా భావించి, విలువ ఇస్తోంది. బ్రిక్స్ చట్రంలో చైనా తన వ్యూహాత్మక లక్ష్యాలను సాధించాలంటే భారత్‌తో స్థిరమైన సంబంధాలు కొనసాగించడం కీలకంగా మారింది.

**దౌత్యపరమైన సమతుల్యత**

ఆసియా ప్రాంతంలో సంక్లిష్టమైన బల/ శక్తి సమతుల్యత ఎంత ప్రధానమో ఈ ఒప్పందం పట్టి చూపుతుంది. అటు భారత్, ఇటు చైనా రెండూ కూడా బహుళ పొరల భౌగోళిక రాజకీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. అందుకే, విస్తృతమైన అంతర్జా తీయ ప్రయోజనాల కోసం తమ సరిహద్దులలో స్థిరత్వాన్ని కోరుకుంటున్నారు. పాశ్చాత్య ఆధిపత్య వేదికలకు ప్రత్యామ్నాయంగా ఉద్భవించిన బ్రిక్స్ ఈ క్రియాశీలతలో ప్రధాన పాత్రను పోషిస్తుంది. ఇరు దేశాలూ కూడా తమ మధ్య సహకారం బలంగా ఉందనే సందేశాన్ని ఈ సదస్సుకు పూర్వమే పాశ్చాత్య ప్రపంచానికి పంపారు.

**భవిష్యత్తు ఎలా ఉంటుంది?**

ఈ ఒప్పందం ప్రస్తుతానికి శాంతికి సంబంధించిన సంకేతాలను పంపినా, భవిష్యత్తు అస్థిరంగానే ఉండనుంది. తైవాన్ నుంచి దృష్టి తొలిగిపోతే, దీర్ఘకాలికంగా చైనాకు గల విస్తరణవాద లక్ష్యం తిరిగి పుట్టుకురావచ్చు. ఈ క్రమంలో భవిష్యత్తులో చొరబాట్లు, ఆక్రమణలు జరుగకుండా, భారత్ ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాల్సిందే. ప్రస్తుత సేనల ఉపసంహరణ అనేది తాత్కాలికం కావచ్చు కానీ, ఇరు దేశాలూ తమ తక్షణ ప్రాధాన్యతలపై దృష్టి పెట్టేందుకు అవకాశం లభిస్తుంది.

ఈ ప్రాంత భౌగోళిక రాజకీయ పరిస్థితులు ఎప్పుడైనా అనూహ్యంగా మారే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా, పరస్పర ప్రయోజనాల ఆధారంగా తమ పొత్తులను మార్చుకునే అవకాశం ఉంది. ప్రస్తుతానికి భారత్ –చైనాలు తమ సేనలను ఉపసంహరించుకున్నా, వారి దీర్ఘకాలిక సంబంధం అనేది రానున్న సంవత్సరాలలో ఈ ప్రయోజనాలు ఏ రకంగా అభివృద్ధి చెందుతాయనే అంశంపై ఆధారపడి ఉండనుంది.


ప్రాథమికంగా ప్రపంచం నేడు మారుతున్న వైనం ఇది. పరస్పర విరుద్ధంగా ఉన్న భారత్, చైనాలలో ఒకరు సౌదీ అరేబియా- ఇరాన్‌ల మధ్య శాంతిని నెలకొల్పేందుకు యత్నాలు చేస్తుంటే, మరొకరు రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య రాజీ కుదర్చాలని యత్నిస్తున్నారు. సరిహద్దులలో ప్రత్యక్ష, పరోక్ష యుద్ధాలను ఎదుర్కొంటున్నప్పటికీ శాంతి కోసం రెండూ యత్నించడం ఒక వైచిత్రి.


**పాశ్చాత్య దేశాల ఉలుకు?**

ఆసియా ప్రాంతంలో అగ్ని రాజుకుంటుంటేనే అగ్ర దేశాల అహం సంతృప్తి పడుతుంది. అందుకే, ప్రస్తుతం భారత్, చైనా మధ్య చోటు చేసుకుంటున్న పరిణామాలు దానికి ఇబ్బంది కలిగిస్తున్నాయి. ముఖ్యంగా, చైనాపై ఎట్లా అయినా ఉక్కుపాదం మోపాలని ఎదురు చేస్తున్న అమెరికా ఎత్తులను ఈ సమీకరణం చిత్తు చేస్తోంది. ప్రపంచ వ్యవహారాల దశ దిశను నిర్దేశించగల సామర్థ్యాన్ని లాక్కునే పరిణామం ఇది. అందుకే, అనేకమంది మేధావులు, రచయితలు భారత్, చైనాల మధ్య స్నేహం అమెరికాను సవాలు చేయడానికేనా అని, భారత్ ఇప్పుడు పాశ్చాత్య వ్యతిరేక చైనాతో పొత్తు కుదుర్చుకుంటుందంటూ తమకు నచ్చినట్టుగా వ్యాఖ్యలు చేస్తున్నారు, వ్యాసాలు రాస్తున్నారు.

గత రెండున్నర దశాబ్దాల నుంచి పెరుగుతున్న బహుముఖీయ సంబంధాలను పరిగణలోకి తీసుకున్నప్పుడు మనం వలసవాదం నుంచి బయట పడేందుకు చేస్తున్న ప్రయత్నాలు అవగతం అవుతాయి. ముఖ్యంగా కజాన్ వేదికగా, ఒకనాటి వలసదేశాలు అన్నీ అక్కడకు చేరి, తమ ప్రయోజనాలను గురించి ఆలోచించడం చూసినప్పుడు ఇది స్పష్టమవుతుంది. ఇప్పటికే, భారత్, చైనా, రష్యా వంటి దేశాలు అగ్రశక్తుల అభిప్రాయాలు లేదా ప్రతిస్పందనలతో సంబంధం లేకుండా తమ జాతీయ ప్రయోజనాలకు ఏది ముఖ్యమో, ఉత్తమమో అవే చేస్తున్నాయి. పాశ్చాత్య దేశాలతో గత రెండేళ్లకు పైగా పరోక్ష యుద్ధంలో ఉన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, తమపై విధించిన ఆర్థిక ఆంక్షలను ధిక్కరించి, భారత్, చైనాలతో సాగిస్తున్న సంబంధాలు కొనసాగిస్తూ రావడమే కాదు, ఆర్థికంగా తన దేశం మరింత పుంజుకునేందుకు బాటలు వేశారు. ఈ నేపథ్యంలో ఈ రెండు పెద్ద దేశాలూ తమ మధ్య కనీస సానుకూల వాతావరణాన్ని ఏర్పరచడం ద్వారా ఆసియా ప్రాంతంలో శాంతిని సాధించడమే కాదు, నిన్నటి వరకూ ఎడముఖం పెడముఖంగా ఉన్న శక్తులు స్నేహపూర్వకంగా ఉండడం బహుళ ధ్రువ ప్రపంచంలో అవసరమన్న సందేశాన్ని ఇచ్చారను కోవాలి.

ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఆర్థిక శక్తి చైనాకు కూడా తాము ఒక ఒప్పందానికి రాక పోతే భారతదేశం తమను వారి మార్కెట్ నుంచి క్రమంగా ఏరివేస్తుందని తెలుసు. ఇప్పటికే అనేక చైనా యాప్‌లను నిర్మొహమాటంగా భారత్ నిషేధించిన విషయం తెలిసిందే. అందుకే, పరిమిత స్థాయిలో అయినప్పటికీ భారత లక్ష్యాలు, అవసరాల విషయంలో తాము రాజీపడకపోతే, తమకే నష్టమని తెలుసు కనుకే వారు ఒక మెట్టు దిగారు. ఆ రకంగా, చైనా జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే అధ్యక్షుడు గ్జి భారత ప్రధాని మోదీతో చేతులు కలిపారు.

ప్రాథమికంగా ప్రపంచం నేడు మారుతున్న వైనం ఇది. పరస్పర విరుద్ధంగా ఉన్న భారత్, చైనాలలో ఒకరు సౌదీ అరేబియా- ఇరాన్‌ల మధ్య శాంతిని నెలకొల్పేందుకు యత్నాలు చేస్తుంటే, మరొకరు రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య రాజీ కుదర్చాలని యత్నిస్తున్నారు. సరిహద్దులలో ప్రత్యక్ష, పరోక్ష యుద్ధాలను ఎదుర్కొంటున్నప్పటికీ శాంతి కోసం రెండూ యత్నించడం ఒక వైచిత్రి. అయినా, నీతులు చెప్పడమే కాకుండా ఆచరించి చూపి, తమ నిబద్ధతను చాటుకున్నందుకు ఇరు దేశాలనూ అభినందించవలసిందే!

– నీల

ప్రత్యేక వ్యాసం

**చరిత్రకు తరగని గని తెలంగాణ. ఆదిమమానవుని అడుగుజాడల నుంచి అసఫ్ జాహీల కాలం దాకా చరిత్ర, వారసత్వాన్ని అదిమి పట్టుకొన్న ఎన్నో పురాతన స్థలాలు, కట్టడాలు, శిల్పాలు, శాసనాలు, నాణేలు, కళాఖండాలు, తెలుగువారి లక్షన్నరేళ్ల ప్రయాణానికి మైలురాళ్లుగా నేటికీ నిలిచే ఉన్నాయి. వీటిలో పురామానవ నివాసాలైన గుహలు, శిలాయుగపు చిత్రకళా స్థావరాలు, ఇనుప యుగపు సమాధులు, చారిత్రక తొలి, మధ్యయుగానంతర కట్టడాలు, అయా కాలాల సౌందర్య దృష్టికి అద్దం పట్టే అపురూప కళాఖండాలు కోకొల్లలు. ఎల్లలు దాటిన వాటి కీర్తి కిరణాలు తెలుగువారి వెలుగుల ప్రస్థానాన్ని ప్రపంచ వ్యాప్తంగా విస్తురిస్తున్నాయి.**



# 'వారసత్వ' పరిరక్ష

ఇన్ని పురాతన స్థలాలు, కట్టడాలున్నా, ప్రభుత్వ రక్షణలో ఉన్నవి కొన్నే. మరికొన్ని ప్రైవేట్ వ్యక్తుల అధీనంలో ఉండగా, ఎన్నో శిథిల కట్టడాలు రక్షణ కోసం ఎదురుచూస్తున్నాయి. తెలంగాణ వారసత్వ శాఖ అధీనంలో దాదాపు 850 వరకూ, కేంద్ర పురావస్తు శాఖలో 8 వరకూ ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 37, హైదరాబాదు జిల్లాలో 27, కరీంనగర్‌లో 42, ఖమ్మంలో 18, మహబూబ్ నగర్‌లో 57, మెదక్‌లో 30, నల్గొండలో 59, నిజామాబాద్‌లో 20, రంగారెడ్డిలో 27, వరంగల్ జిల్లాలో 50 వారసత్వ శాఖ అధీనంలో ఉన్నాయి. వీటిలో చాలా వరకు అలనాపాలనా లేక, ఆదుకొనే వారు లేక, దాతలు ముందుకు రాక కునారిల్లుతున్నాయి. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూసే బదులు స్థానికులు, కార్పొరేట్ సంస్థలు స్వచ్ఛందంగా ముందుకొచ్చినప్పుడే వారసత్వ స్థలాలు, కట్టడాలూ మనగలుగుతాయి.. భావితరాలకు స్ఫూర్తిని కలిగిస్తాయి.

అపురూప ఆలయాలు ఆదరణ లేక కునారిల్లుతున్నాయి. ఆకాశగోపురాలు నేలమట్టమవుతున్నాయి. బౌద్ధ, జైనమందిరాలు మట్టిగొట్టుకుపోతున్నాయి. తెలుగుజాతి గురుతులన్నీ చెరిగిపోతున్నాయి. పిచ్చిమొక్కలు, బండరాళ్లు, మట్టిదిబ్బలే మన వారసత్వ చిహ్నాలు కాబోతున్నాయి. కళ్లు తెరిచి కాపుగాయకుంటే, కాలం పంచిన సంపదంతా కాలం చేసేస్తుంది. గతాన్ని మర్చిపోయిన వాడికి భవిష్యత్తు ఉండదు. చరిత్రను చిన్నచూపు చూసే వాడికి వర్తమానంలో విలువ దక్కదు. మూలాలను గుర్తుపెట్టుకుని, అస్తిత్వ చిహ్నాలను నిలుపుకునే జాతి కాలగమనంలో నిలబడుతుంది. సమున్నతంగా ఎదుగుతుంది. ఇలా ఎదిగే అవకాశాన్ని చేజేతులా దూరం చేసుకుంటున్నారు తెలుగు వారు.

వారసత్వమంటే ముందు తరాలవారు అందించింది, ఇప్పటి తరం అందుకునేది, రేపటి తరం అందుకోబోయేది. ఇది కనిపించే వారసత్వం. కనిపించని వారసత్వం రెండు రకాలు. ప్రాకృతిక వనరులు, వాటి సౌందర్యం, కొండకోనలు, వాగులు వంకల నుంచి ఎడారుల వరకూ 'కనిపించే' వర్గంలోకి వస్తాయి. చారిత్రక స్థలాలు, కట్టడాలు, కళాఖండాలు కూడా ఈ కోవలోవే. ఇక కనిపించని వారసత్వమంటే పాడితేనే వినిపించే పాట, ఆడితేనే కనిపించే ఆట, ప్రదర్శిస్తేనే గానీ చూడలేని నాటకం, నృత్యం, ఇంద్రజాలం పండుగలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు లాంటివి.

యునెస్కో ప్రపంచ మానవులంతా ఒక్కటేనన్న భావనతో ప్రతి దేశం, ప్రతి ప్రాంతంలోని ఈ రెండు రకాల వారసత్వాలను పరిరక్షించుకోవడానికి 1972 నుంచి ప్రయత్నిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ సంపదలుగా గుర్తించిన వారసత్వ ప్రదేశాలను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రజలకు గుర్తుచేస్తోంది. ప్రాంతీయంగా చారిత్రక ప్రాధాన్యం స్థలాలు, కట్టడాలు, కళాఖండాలను రాష్ట్ర పురావస్తు శాఖ, జాతీయ స్థాయిలో ప్రాధాన్యతగల వాటిని కేంద్ర పురావస్తు శాఖ, అంతర్జాతీయ స్థాయి గల వాటిని యునెస్కో ఆధ్వర్యంలోని ప్రపంచ వారసత్వ కేంద్రం పరిరక్షిస్తున్నాయి. గత కాలపు వారసత్వ వైభవ, ప్రాభవాలను ముందు తరాలకు అందిస్తున్నాయి. వీటితో పాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వేతర, స్వచ్ఛంద సంస్థలు కొన్ని ప్రముఖమైన కట్టడాలను దత్తత తీసుకొని వారసత్వ పరిరక్షణలో పాలు పంచుకొంటున్నాయి.

సెప్టెంబర్ 2024 నాటికి 170 దేశాల్లో 952 సాంస్కృతిక, 281 ప్రాకృతిక, రెండూ కలిపి మొత్తం 1223 వారసత్వ స్థలాలు, కట్టడాలను యునెస్కో గుర్తించింది. మన దేశం నుంచి ఈ జాబితాలో 28 ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం నుంచి రామప్ప దేవాలయం చోటు దక్కించుకుంది. కేంద్ర పురావస్తు శాఖ దేశంలో 8600 చారిత్రక స్థలాలు కట్టడాలను రక్షిత స్థలాలు, కట్టడాలుగా ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖల అధ్వర్యంలో 135, 665 చారిత్రక స్థలాలు, కట్టడాలు ఉన్నాయి. ఇంకా హైదరాబాదు మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో దాదాపు 200 వరకూ చారిత్రక ప్రాధాన్యత గల కట్టడాలు పరిరక్షణలో ఉన్నాయి.

రాష్ట్ర పురావస్తు శాఖ పరిధిలో... శిలాయుగపు చిత్రాలున్న గుహలు, కొండ చెరియలు, కొత్త రాతియుగం, రాగి – రాతియుగం, ఇనుప యుగం, తొలి, మధ్య యుగాలకు చెందిన ఆనవాళ్లను భద్రపరచుకున్న ప్రదేశాలు ఉన్నాయి. బౌద్ధ, జైన, బ్రాహ్మణ మతపరమైన గుహలు, కట్టడాలు, కోటలు, ఇస్లామిక్ కట్టడాలు, ప్రాజెక్టులు కట్టినప్పుడు, రహదారులు నిర్మించినప్పుడు ఎన్నో చారిత్రక స్థలాలు, కట్టడాలు రూపం కోల్పోతున్నాయి, అయినా

ప్రభుత్వం అంటీ ముట్టనట్లే ఉంటోంది. పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టినప్పుడు కొన్ని సందర్భాల్లో మాత్రమే... నీటి ముంపు ప్రాంతాల్లోని కట్టడాలను ఎగువకు తరలించారు. చాలా సందర్భాల్లో అలానే వదిలేశారు. నాగార్జున సాగర్, శ్రీశైలం మొదలైన జలాశయాల్లో ముంపునకు గురైన కట్టడాలను ఎగువకు తరలించి పునర్నిర్మించారు, ఇచ్చంపల్లి, ఎల్లంపల్లి, పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లోని చారిత్రక స్థలాలు, కట్టడాలను గుర్తించారు గాని వాటి పరిరక్షణకు శ్రద్ధ చూపించిన జాడలేవు. వరంగల్ జిల్లాలో దేవాదుల ఎత్తిపోతల పథకం



# ణపై నిర్లిప్త ధోరణి

పనుల్లో భాగంగా భారీ సొరంగం తవ్వాలని గతంలో నిర్ణయించారు. దీనివల్ల ఎనిమిది వందల ఏళ్ల చరిత్ర గల రామప్ప దేవాలయం కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం తలెత్తగా ఆ ప్రయత్నం ఆగిపోయింది. ప్రజాసంఘాలు, స్థానికులు, పత్రికలు ఎలుగెత్తడంతో పాలకులు సొరంగ నిర్మాణాన్ని ఆపారు. ఇదీ వారసత్వ సంపదలకు దక్కుతున్న గౌరవం!

మరోవైపు, ఆక్రమణలు, గుప్తనిధుల కోసం తవ్వకాలు, గనుల గుత్తేదారుల స్వార్థం... ఎన్నో చారిత్రక అనవాళ్లకు చేటు చేస్తున్నాయి. హైదరాబాద్‌లోని గోల్కొండ తదితర ప్రసిద్ధ ప్రదేశాల్లో ఆక్రమణలకు కొదవే లేదు. ఉండ్రుగొండ, రాచకొండ కోటలు గుప్తనిధుల అన్వేషకుల గునపం దెబ్బలకు కూలిపోతున్నాయి. రక్షిత కట్టడాలను నాశనం చేసిన, ఆక్రమించుకున్న వారికి రెండేళ్ల కారాగార శిక్ష అని ప్రాచీన కట్టడాలు, పురావస్తు ప్రదేశాల చట్టం (కేంద్రం) స్పష్టం చేస్తోంది. రాష్ట్ర పురావస్తు చట్టం ప్రకారం... అలాంటి వారికి మూడు నెలల శిక్ష ఖాయం. ఇప్పటి వరకూ రాష్ట్రంలో చట్టం పేరు వారసత్వ తెలంగాణ అని మారిందే తప్ప ఈ చట్టాల కింద తీసుకున్న చర్యలు దాదాపు శూన్యం.


రాష్ట్ర పురావస్తు శాఖాధికారుల మాటలను పట్టించుకుంటున్న వారే లేరు. రాష్ట్రంలోని ఇతర చారిత్రక కట్టడాల రక్షణకు తగిన చర్యలు తీసుకోవడానికి సిబ్బంది కొరత, నిధుల లేమి వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు అంటున్నారు. అవి కుంటిసాకులు మాత్రమే. 12, 13 ఆర్థిక సంఘాల కింద దాదాపు రూ.140 కోట్లు వచ్చాయి. వాటిని కట్టడాల పరిరక్షణకు పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోయారు. ఉన్న స్థలాలు, కట్టడాలను ఆలనాపాలనా చూసే సత్తా లేని శాఖ, ఇటీవల మరికొన్ని కొత్త స్థలాలను, కట్టడాలను పరిరక్షించడానికి జీవోలను తెప్పించి చేతులు దులుపుకుంది.

చారిత్రక ఆనవాళ్లంటే ప్రభుత్వ యంత్రాంగాలకు ఎంత ప్రేమో చెప్పడానికి ఒక ఉదాహరణ. హైదరాబాద్‌లో ప్రసిద్ధ నవాబ్ మకర్రబ్ దేవిడీ ఉంది. ఇందులో పరిశ్రమల శాఖ కార్యాలయం నడుస్తోంది. అయితే, భవనం పాతదయిపోయిందని, పడగొట్టేయాలని ప్రభుత్వానికి లేఖ రాశారు పరిశ్రమల శాఖాధికారులు. చారిత్రక స్మృతిని మట్టిపాలు చేయడానికి ప్రయత్నించారు. అయితే చివరి నిమిషంలో పురావస్తు శాఖ జోక్యం చేసుకోవడంతో ప్రమాదం తప్పింది. రాజధాని నగరంలోనే ఉన్న కుతుబ్ షాహీ సమాధులు, హయత్బక్షీ బేగం మసీదు ప్రాంతాల్లో ఆక్రమణలు హద్దులు దాటాయి. వీటిని తొలగించాలని హైదరాబాద్ మహానగరపాలక సంస్థకు పురావస్తు శాఖ ఎన్ని లేఖలు రాసినా స్పందన లేదు. మరోవైపు.... పేరుకు ఏటా వారసత్వ దినోత్సవాన్ని (ఏప్రిల్ 18) నిర్వహిస్తున్నారు. కానీ దాని స్ఫూర్తిని మాత్రం అందిపుచ్చుకోవడం లేదు.

కొండను తొలిచి అద్భుతంగా మలచిన గాంధారి కోట, రోజుకొక గోడ చొప్పున పడిపోతున్న కాలాస్‌కోట, ఇప్పటికే కనిపించకుండా పోయిన దబీరురాలో విదేశీయుల సమాధులు, రూపు కోల్పోతున్న కనుమరుగైన హైదరాబాద్‌లోని మీరాలం చెరువు కింద ఇనుప యుగపు సమాధులు, నేడో రేపో పడిపోవటానికి సిద్ధంగా ఉన్న కరీంనగర్ జిల్లా మంథనిలోని గౌతమేశ్వర దేవాలయం, సిరిసిల్ల దగ్గరి అనంతగిరి కోట, అనవాళ్లే లేకుండా పోయిన కోటిలింగాల కోట, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని సాధారణ శకం 7-8 శతాబ్దాల నాటి ఇటుకరాతి జైన దేవాలయం... అన్నీ ప్రమాద పుటంచుల్లో ఉన్నవే, తక్షణ పరిరక్షణ చర్యలు చేపట్టపోతే విలువైన చారిత్రక సంపద చేజారిపోవడం తథ్యం.

ప్రపంచంలోని ఏ దేశంలోనైనా పురాతన వస్తువు / శాసనం బయటపడితే ఎంతో అపురూపంగా చూసుకుంటారు. దానిపై వెంటనే పరిశోధన చేసి చరిత్రను తవ్వితీస్తారు. మన దగ్గర ఆ పరిస్థితి లేదు. మెదక్ జిల్లాలోని మారేపల్లిలో కల్యాణీ చాళుక్యుల కాలం నాటిదని భావిస్తున్న శాసనమొకటి బయటపడింది. దాన్ని గుర్తించిన స్థానికులు, కలెక్టర్ ద్వారా రాష్ట్ర పురావస్తు శాఖ దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. ఆ తర్వాత ఆరేళ్లకు గానీ, దానిపై క్షేత్రస్థాయి పరిశోధన జరగలేదు.

ఇదంతా ఒక ఎత్తైతే, చారిత్రక ప్రముఖులు, రచయితలు, వాగ్గేయకారులు, సంఘసంస్కర్తల గృహాలు కూడా పరిరక్షణకు నోచుకోకపోవటం తెలుగు జాతి దురదృష్టం. తెలుగు సంస్కృతిలో భాగమైన సంగీతం, సాహిత్య రంగాలకు జీవితాలను ధారపోసిన మహనీయుల నివాసాలను రక్షిత కట్టడాలుగా ప్రకటించక పోవటమంటే వారసత్వ పరిరక్షణోద్యమానికి తూట్లు పొడవటమే. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని కంచర్ల గోపన్న (రామదాసు), 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని తెలుగువారంతా గర్వపడేలా రాసిన దాశరథి గృహాలను రక్షిత కట్టడాలుగా ప్రకటించడంలో పాలకులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ తరహా నిర్లక్ష్యమే జాతి ప్రభను మసకబారిస్తోంది. తెలుగు ప్రజలు చైతన్యవంతులై ప్రశ్నిస్తే తప్ప పరిస్థితిలో మార్పు వచ్చే సూచనలు కనపడటల్లేదు. ఇప్పటికైనా మేలుకోవాలి. పరిరక్షణకు పూనుకోవాలి.




**ఈమని శివనాగిరెడ్డి**

స్థపతి, 98485 98446

## కథ

శ్రీరామ్ బస్తీ, బంజారాహిల్స్.... హైదరాబాద్ అన్ని కాలాలలో నివాస యోగ్యానికి అనుకూలం అనేది ఎంత నిజమో, అన్ని వర్గాల వారిని అక్కున చేర్చుకునే అమ్మ గుణం కూడా ఉంది ఈ నగరానికి. ప్రస్తుతం అన్ని రాష్ట్రాల వారు కలిసి ఉన్నట్టే, అన్ని ఆర్థికవర్గాల వారు కూడా పక్క పక్కనే ఉన్నారు అనే దానికి బంజారాహిల్స్, దానికి ఆనుకుని ఉన్న శ్రీరామ్ బస్తీ నిదర్శనం. నగరంలో ఎన్ని కాలనీలు, బస్తీలు ఉన్నా, శ్రీరామ్ బస్తీలోని వారి గుర్తింపు ఒక లెవల్‌లో ఉంటుంది. ఒకరు సినిమా స్టార్ దగ్గర పనిచేసే వారు అయితే, మరొకరు పెద్ద డాక్టర్ దగ్గర పని చేసేవారు. వారి వారి యజమానులను బట్టి వీరి గుర్తింపు, గౌరవం పెరుగుతుంది. ఎప్పుడు అయినా అవసరానికి పనికి రాకపోతారా? అని బంజారాహిల్స్ పెద్దలకు కావాల్సిన డ్రైవర్ మేడ్‌లను శ్రీరామ్ బస్తీ సరఫరా చేస్తుంది.


"ఏందే మల్లవ్వ... శానా రందిగా వున్నవ్... ఏం అయ్యింది" రమ అడిగింది.

"ఇందాకనే సిగ్నేచర్ వచ్చి వెల్లిందే... దాని బిడ్డకు ఇంజనీరింగ్‌లో సీటు అచ్చిందట... పైసలు ఎట్లా అని ఏడ్చి ఏడ్చి పోయింది" మల్లవ్వ చెప్పింది.

మల్లవ్వకు అరవై పైననే ఉంటాయి. బస్తీ పెద్ద మనిషి. చిన్నప్పుడు నల్గొండ నుండి బస్తీకి వచ్చి చిన్నచిన్న పనులు చేసుకుంటూ పెరిగి, మంచితనంతో పెద్దపెద్ద సార్ల ఇళ్లలో పని చేసుకుంటూ బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో అందరికీ సుపరిచితురాలు అయ్యింది.

తనకంటూ ఎవ్వరూ లేరు.. అక్కడ ఇక్కడ

**భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీలో విశిష్ట బహుమతి పొందిన రచన**



పనిచేసి కాలనీ లాగానే శిథిలావస్థకు చేరింది. ఆసరా పథకం అచ్చినంక ఇంట్లనే ఉంటుంది. బస్తీ లోని అందరికి పని పెట్టించింది మల్లవ్వనే... బంజారాహిల్స్‌లో పని కుదరాలంటే, మల్లవ్వే గ్యారంటీ. ఎవరి ఇంటిలో వస్తువు పోయినా కాలనీలో శివమెత్తి ,సాయంత్రం వరకు ఆ వస్తువు వారి ఇంటిలో అప్పజెప్పుకుంటూ తన పెద్ద తనాన్ని నిలుపుకుంది. ఒకరు పనికి పోకుంటే, ఇంకొకరిని పంపి ఏ సార్‌కు ఇబ్బంది రానీయకుండా చూసు కుంటుంది. పనిచేసే వారి అందరికీ మల్లవ్వ ఇల్లే దనమ్మ...కింగ్ ఫిషర్ లక్ష్మి... బ్లూ లేబుల్ వసంత... మల్లవ్వ పెద్ద మనిషి అవడం వల్ల, తన వల్లే పని కుదిరినందున...ఎవ్వరూ యేమి అనుకోరు... పైగా ఇది ఒక ఆటవిడుపు లాగా...మజాక్ లాగా అయ్యింది.

అందరూ మనసు ఉన్నవాల్లే కనుక సీరియస్ తీసుకోరు. బస్తీ లోనివాళ్లు కష్టాలు అవమానాలు పడిపడి ఉన్న వాళ్లు కనుక మల్లవ్వ ఎలా పిలిచిన, ఏమీ అన్న ఏం అనుకోరు.

కాలనీలో ఎవరికి కష్టం వచ్చినా, పెద్ద సార్ల లేబుల్ కూడా నిలువదు. సీసాలు ఖాళీ అయితే.

మనిషి దగ్గర సంపద, సీసా లోపల మందు ఉన్నప్పుడే విలువ.

* * *

అందరూ ఉదయం 6 గంటలకే మల్లవ్వ ఇంటికి చేరుకున్నారు.. ఒక్క (కింగ్ ఫిషర్) లక్ష్మి తప్ప. పని మనుషులు ఏడు గంటలకల్లా పెద్ద సార్ల ఇంటికి పనికి వెళ్లాలి. అయ్యగారికి కాఫీ అమ్మ గారు ఇవ్వరు, పని మనిషే ఇస్తుంది. అమ్మగారికి తల నొప్పి వస్తే అయ్యగారు జండు బామ్ రాయడు, పని మనిషే

# ఊస్తే ఊడిపోనే

## దాసరి మోహన్

అందరికి అడ్డ. అలాగే అందరి బాధలను మల్లవ్వ దగ్గరే డిపాజిట్ చేస్తరు.

"ఎద్దుడు ఎందుకే... పేదొల్లను ఫ్రీగనే ప్రభుత్వం సదివిత్తరు గదా" అంది రమ.

"ర్యాంకు జరంత ఎక్కువ ఆచ్చిందట.. లేకుంటే నువ్వన్నట్లు ఫ్రీనే.."

"ఎంత గట్టాల్నే.."

"ఎనబై వేలంట"

"గన్ని పైసలా?"

పేదవాళ్లు పైసల దగ్గర ఆగిపోయారు ,ఇప్పటికీ.వేలు లక్షలు అనే పదం తక్కువ వాడుతారు. బహుశా ఇంకా వారికి అందలేదో.

"గందుకే దాని ఏడుపంత"

"ఇప్పుడు ఎట్లనే మల్లవ్వ'

"ఏం జెద్దామే... బస్తీల మగ పోరగండ్లు సదువు లేక తిరిగి శెడవట్టే... ఆడ పోరికి సీటు ఆస్తే పైసలు లేకపాయె" మల్లవ్వ బాధగా అంది..

ఇంతలో మనెమ్మ పక్కనుండి వెళ్తుంది...

''ఏమే ఆఫీసర్.... మందలియ్యకుండ ఉరుకుతున్నవ్ ..." మల్లవ్వ గట్టిగా అంది.

బస్తీలోని ఆడవాళ్లు.. అక్కడక్కడ ఇండ్లలో పని చేస్తుంటారు. ఎవ్వరి ఇంటిలో పనిచేసే వాళ్లకు, వారి ఇంటిలో సార్లు తాగిన ఖాళీ సీసాలు తెచ్చుకుని అమ్ముకుంటారు. అలా వారి సార్లు తాగే సీసాల (బ్రాండ్) పేరే వారి ఇంట్లో పని చేస్తున్న వాళ్లకు పెట్టింది మల్లవ్వ. ఆఫీసర్ (ఛాయిస్) మనెమ్మ...మాన్సన్ (హౌజ్) రమ... సిగ్నేచర్ నుండి కంప్లయింట్ వచ్చినా మల్లవ్వ అందరినీ పిలిచి విచారిస్తది. మల్లవ్వ పిలిచినది అంటే ఏదో విషయం ఉండే ఉంటది అని అందరూ వస్తారు.

"జర తొందర్ల ఉన్నానే మల్లవ్వ.. మా సార్లు ఊరికి పోతర్రు... అందుకే ఉరుకుతున్న... నిన్ను మందలియ్యకుంట పోతనా ఎంది" అంది (ఆఫీసర్) మనెమ్మ.

"సర్లే గాని .. పొద్దుగాల ఒకసారి వచ్చిపో... అందర్నీ పిల్చిన.. సిగ్నేచర్ కు కష్టం వచ్చింది"

"అస్తలే.. అస్త..." అనుకుంట ఆఫీసర్ మనెమ్మ వెళ్ళింది

"ఏయ్ మాన్సన్ నువ్ కూడా అందరికి చెప్పు... అసలు కింగ్ ఫిషర్ కనబడ్డదా."

" లేదు మల్లవ్వ కలిస్తే చెబుతా"

"కింగ్‌ఫిషర్ లేకుంటే పని కాదు.. జర దొరక బట్టు"

"గట్లనే " అంటూ వెళ్ళిపోయింది మనమ్మ.

బస్తీలో కింగ్ ఫిషర్ లక్ష్మి, ఆఫీసర్ మనమ్మలదే హల్ చల్.

లక్ష్మి, శ్రీనగర్ కాలనీలో పనిచేస్తుంది. అక్కడ ఎక్కువ బ్యాచిలర్స్ ఉంటారు... బీర్లు తాగుతారు. ఖాళీ బీరు సీసాకు మంచి డిమాండ్. వచ్చిన డబ్బులను ఇంటరెస్ట్‌కు ఇచ్చి బాగానే వెనుక వేసింది.

మనెమ్మ పనిచేసే ఇంటిలో ఆఫీసర్ ఛాయిస్ తాగుతారు.... విస్కీ లో చీప్ అయిన... ఖాళీ అయితే కింగ్. ఖాళీ సీసాల్లో రూపాయి కలెక్షన్ చేసేది ఆఫీసర్ ఛాయిస్ మాత్రమే.ఆఫీసర్ ఛాయిస్ ముందు బ్లూ రాస్తుంది. ఒకసారి డబ్బులు వచ్చాక దంపతుల మధ్య దూరం పెరుగుతుంది. అవసరాలు అన్నీ వేరే వారు తీరుస్తారు.

"ఏమే మాన్సన్, కింగ్ ఫిషర్‌కు చెప్పలేదా..." మల్లవ్వ గట్టిగా అంది.

"చెప్పా మల్లవ్వ" అంది మనమ్మ..

"పది దాటితే ఒక్క కారు ఉండదు.. ఒక్క సారు ఉండరు... పదండి... అందర్నీ కలవాలే... ముందు సిగ్నేచర్ వాళ్ల సార్‌తోనే మొదలు పెడదాం... రండి"

అందరూ ధనమ్మ పనిచేసే ఇంటికి పోయారు, ముందే మాట్లాడి పెట్టుకున్న ఆటోలో...

* * *

ఆటో దనమ్మ పని చేసే బంగ్లా ముందు ఆగింది. దనమ్మ పని చేసే సార్ పెద్ద బిజినెస్ మ్యాన్. ఎన్ని కంపెనీలు ఉన్నాయో వేళ్లతో లెక్క పెట్టలేం. కొత్త కంపెనీ పెట్టినప్పుడల్లా ఒక కొత్త కార్ కొనడం సార్ గొప్పగా చెప్పుకునే డబ్బు జబ్బు. సగం కారులు ఇంటిలో, సగం కంపెనీ షెడ్‌లలో ఉంటాయి..ఈ రోజు ఏ కార్ తీయాలని డ్రైవర్ అడిగితే సార్ ఆలోచించి చెప్పడం ఆ రోజు ఆ కార్‌సిగ్నేచర్‌లో వెళ్లడం సార్ స్పెషాలిటీ అని డ్రైవర్లు చెప్పుకుంటారు. అమ్మవారికి, పిల్లలకు, చిన్న దొర కు.... అర డజన్ మంది కారు డ్రైవర్లు ఉన్నారు అంటే సార్ సంపద చాలా ఉన్నట్టే కదా.

అందరూ సార్ ముందు చేతులు కట్టుకుని నిలుచుండి ఉన్నారు. మల్లవ్వ కొంత ముందుకు వచ్చి...

''నమస్కారం సార్... ధనమ్మ బిడ్డకు ఇంజనీరింగ్‌లో సీట్ అచ్చింది... పైసలు లేక ఎద్దంది... మిమ్మల్ని అడగడానికి ఎనకా ముందు అయితంది... అందుకే మేము వచ్చినం. మీరు పెద్ద మనసు చేసుకుని... సహాయం చేస్తరని" అంటూ దండం పెట్టింది మల్లవ్వ.

"చందాలేసుకోవడానికి ఇదేమన్నా వినాయక చవితి అనుకున్నారా... నాల్గు సంవత్సరాలు చందాలతోనే చదివిస్తరా.? ఏమ్ ధనమ్మా పనికి రమ్మంటే అందర్నీ ఎంట ఎసుకుని వచ్చినావు".

''అయ్యా తప్పు అయ్యింది అయ్యా... ఎమనుకోకండి సార్...జర పేదవొళ్లం కదా...మీరు ఏమైనా సహాయం చేస్తారని బస్తీల వాళ్లు అంటే వచ్చినం సార్.. మీరు కోపం చేసుకోకండి సార్.. ఏళ్తం సార్.... పదండి పదండి" అంటూ దనమ్మ అందర్నీ తోసుకుంటూ.... కళ్లను తుడుచుకుంటూ ముందుకు నడిచింది. మిగితా వారు దనమ్మ వెనకాల బయటికి వచ్చారు .

కొంచెం దూరం వచ్చాక ... "ఏమే సిగ్నేచర్ మీ సార్ గురించి బాగా చెప్పినవ్... గిప్పుడేమో గిట్ల మాట్లాడుతుండు.." అంది మల్లవ్వ

"ఏమో నా గాశారం గిట్ల ఏడ్చింది..." అంది దనమ్మ .

"ఏం కాదులే ఎంత మంది లేరు ! ఈ సారు ఒక్కడే ఉన్నడా... సహాయం జేయమంటే చందాగింద అంటాడు..." అంది మల్లవ్వ.

తరువాత రమ పనిచేసే ప్రొఫెసర్ సార్ ఇంటికీ వెళ్లారు.

రమ ఇంటి పని చేసే సార్ యూనివర్సిటీలో ప్రొఫెసర్. సార్ దగ్గర ఎప్పుడు పీహెచ్‌డీ 2 విద్యార్థులు ఉంటారు. ఇంగ్లీషులో, సార్ చాలా పుస్తకాలు రాశాడు అని చెప్పుకుంటారు.

"మ్యాన్సన్ నువ్వే అడుగు... ఇయ్యాల నా దినాం గానట్లు ఉంది..." అంది మల్లవ్వ .

మొదటిసారే తేలికగా మాట్లాడే సరికి మల్లవ్వకు జర ఇబ్బంది అయ్యింది.

''నమస్తే సార్... మా దనెమ్మ బిడ్డకు ఇంజనీరింగ్‌లో సీట్ ఆచ్చింది సార్. బాగా సదువుతది.. మంచి పిల్ల"

"అయితే నేనేం చెయ్యాలి" ప్రొఫెసర్ అన్నాడు.

"డబ్బులు కొన్ని... ఇస్తే సదివిపిచ్చుకుంటం సార్..."

''ఇంజినీరింగ్ చదువు అంటే ఏమను కుంటారు... ఇంగ్లీష్ బాగా రావాలి.. ఉద్యోగం రావాలంటే స్కిల్స్ ఉండాలి... సీట్ వస్తే అయిపోయినట్లేనా"

"మాకు తెలియదు సార్... మరి ఏమ్ జేయ్యాలి సార్" రమ అమాయకంగా భయంగా అడిగింది.

"డిగ్రీ చేయించండి... ఫీజు గొడవ ఉండదు.. స్కాలర్‌షిప్ కూడా వస్తుంది. తరువాత ఎదో చిన్న ఉద్యోగం వస్తది"

"మంచిది సార్" అంటూ అందరు కదిలారు..

"ఎందే మ్యాన్సన్ పెద్ద సార్ అన్నావు చిన్న ఉద్యోగం అని చిన్నగా చేసి మాట్లాడుతుండు... గిదెంది" మల్లవ్వ చిరాకు వేసింది..

"నమస్కారం సార్... ధనమ్మ బిడ్డకు ఇంజనీరింగ్‌లో సీట్ అచ్చింది... పైసలు లేక ఎద్దంది... మిమ్మల్ని అడగడానికి ఎనకా ముందు అయితంది... అందుకే మేము వచ్చినం. మీరు పెద్ద మనసు చేసుకుని... సహాయం చేస్తరని" అంటూ దండం పెట్టింది మల్లవ్వ.



"ఈ పెద్ద పెద్ద ఇండ్లలో ఉన్నోల్లకు చిన్న మనసులే ఉన్నట్లు ఉన్నయ్.. ఏమ్ చేస్తాం..". అంది రమ .

మల్లవ్వ కూడా బాగా ఫీల్ అయ్యింది. తనకు బంజారాహిల్స్‌లో చాలా పతార ఉంది అని అందరూ చెప్పుకుంటారు. తాను వస్తే పని ఈజీగా అయి పోతదని ఆనుకుని వచ్చింది కాని ఇక్కడ సీన్ వేరే లాగా వుంది.

"నా బిడ్డ అదృష్టం బాగా లేనట్లు వుంది.." అంటూ దనమ్మ ఏడ్చింది..

వసంత దనమ్మ దగ్గరికి వచ్చి, "మా సార్ పెద్ద క్లబ్ ప్రెసిడెంట్. సార్‌కు చాలా పతార ఉంది. ఎట్ల నన్న జేసీ పైసలు ఇస్తడు ..మా సార్ దగ్గరికి పోదాం పద "అంది.

అందరు వసంత పని చేసే సార్ బంగ్లాకి వెళ్ళారు.

సార్ నగరంలోని పెద్ద క్లబ్‌కి ప్రెసిడెంట్. ఈ క్లబ్ మెంబర్ కావాలంటే పార్లమెంటు మెంబర్‌కు కూడా అవకాశం రాదట. కొన్ని సంవత్సరాలు ఎదురు చూడాలి అని గొప్పగా చెప్పుకుంటారు.

సార్ మొబైల్‌లో మాట్లాడుతున్నాడు. ఒక కాల్ అయిపోయేసరికి ఇంకో చేతిలోని మొబైల్ రింగ్ అవుతుంది. మళ్లీ ఆ మొబైల్‌లో మాట్లాడుతున్నాడు, అటు ఇటు నడుస్తూ. ఒక్కోసారి రెండు మొబైళ్లలో అటు ఇటు మాట్లాడుతున్నాడు.

సార్ దృష్టిలో పడి మాట్లాడుదామని వసంత కూడా అటు ఇటు తిరుగుతుంది. బస్తీ వాసులు సార్ వైపు, వసంత వైపు చూసి చూసి సైగల్ చేస్తున్నారు కాని వసంతకు సార్ లైన్ దొరకడం లేదు. చివరికి సార్ మొబైల్ మాట్లాడుతూనే ఏంటి అని వసంత వైపు మొబైల్‌లో వేలు పైకి చూపాడు .

"చిన్న పని ఉంది సార్" అనుకుంటూ సార్ దగ్గరికి వెళ్లింది. మిగితా వాళ్లు అబ్బ ఇక పని అయినట్లే అనుకున్నారు.

ఇంతలోనే సార్ సడెన్‌గా లోపలికి వెళ్లాడు. మళ్లీ బయటికి వస్తాడు అని చూశారు. అరగంట గడిచింది అయినా సార్ బయటికి రాలేదు.

మల్లవ్వ వసంతను వెనక్కి రమ్మని సైగ చేసింది. వసంత ఏడుపు ముఖంతో బస్తీ వాసుల దగ్గరికి వచ్చింది.

"అర్థం అయ్యింది లేవే బ్లూలేబుల్....మీ సార్ కూడా అంతే..." అంది మల్లవ్వ విచారంగా .

పని మనుషులకు, పెద్దసార్ల ఇంళ్లలో పని చేయడానికి వెళ్లడానికి వెనకాల ఒక డోర్ ఉంటుంది. అందులోనుంచి వెళ్లి ఇంటి పనులు చేసి మళ్లీ అదే డోర్ నుండి బయటికి రావాలి. అంతేకాని తమ పని కోసం ముందు డోర్ దగ్గరికి వెళ్లకూడదు. ముందు ద్వారాలు పెద్ద పెద్ద వారికే, పేద వారికి కాదు.

'ఎప్పుడు అయినా పనికి రాక పోతారా ?' అన్నది చిన్న వాళ్ళకి పెద్ద ఆశనే సుమీ .

"ఎంతో అనుకున్న, ఎన్నిసార్లు సార్ ఇంటిలో పార్టీలు జరిగినా, విసుగు లేకుండా పని చేసిన. ఇయ్యాల సార్ కనీసం ఏం పని అని ఒక్క నిమిషం కూడానాతో మాట్లాడ లేదు." రమ ఏడ్చినంత పని చేసింది.

"నా కోసం నా బిడ్డ చదువు కోసం మీరు అంతా సార్లతోని ఇబ్బంది పడుతున్నారు.. నా బతుకు గిట్ల అయ్యింది.. బిడ్డను సదువు పిచ్చుకోలేకపోతున్న .. దాని రాతలో కూడా పని మనిషి అని రాసి పెట్టి ఉందేమో" కళ్లు తుడుచుకుంటూ అంది దనమ్మ .

"ఎద్వకే మేం లేమా.... నేను 10 వేలు ఇస్తా.. ముసల్దాన్ని ఏం జేసుకుంట... మనిషి ఎంత ఇస్తరో చెప్పండి..." అంది మల్లవ్వ ఆటో లో కూర్చుని.

"నేను ఐదు వేలు ఇస్తా" అంది వసంత.

"నేను ఐదు ఇస్తా కానీ.. అందరం కలిపినా యాభయక కూడా కావు.. ఎట్ల మల్లవ్వ." అంది ఆఫీసర్..

"అంతల్నే ఏమయ్యిందే....కింగ్ ఫిషర్ లేదా... మిగిలినవి మిత్తికి అయినా ఇయ్యక పోతద ...దనమ్మ బిడ్డను ఇంజనీరింగ్ సదివిపిద్దాం ఎట్ల అయినా... కింగ్ ఫిషర్ ఇంటికి వచ్చిందేమో సూద్దాం పదండి.."

అందరూ లక్ష్మీ ఇంటికి చేరుకున్నారు.

" లక్ష్మీ... లక్ష్మీ" అని పిలిచింది... వసంత

లక్ష్మి రాలేదు.... ఎవ్వరూ పలకలేదు...

"తప్పించుకుంటందా ఏంది...? కబురు పెట్టినా రాలేదు... ఇంటికీ వస్తె లేదు... ఏమే మాన్సన్... నేను పిల్చిన అని చెప్పినావా లేదా" మల్లవ్వ సీరియస్ అయ్యింది..

"పనికి పోవచ్చునే.. అది ఎప్పుడు ఖాళీగా ఉంటది చెప్పు..?" దనమ్మ మెల్లగా అంది...

" రేపు ఫీజు గట్టాలే గదనే... గిట్ల జేస్తే ఎట్ల... ఒక్కరి కష్టం అందరిదీ కదా...."

ఇంతలో లక్ష్మి, భర్త ఇద్దరూ టీవీఎస్ చాంప్ మీద వచ్చారు...

మల్లవ్వ మొఖం మాడ్చింది...

"నీ కోసమే సొత్తానం" అని అంది మనమ్మ.

"మల్లవ్వ ఇంటికీ పోయి అత్తానం...అక్కడ లేక పోయేసరికి ఎతుక్కుంట అత్తున్నం.." అంటూ ఒక దస్తీలో నుంచి రెండు డబ్బు కట్టలు మల్లవ్వ చేతిలో పెట్టి" లక్ష రూపాయలే మల్లవ్వ... సంవత్సరము మొత్తం అయితయి..." అంది..

"ఒక్కసారే ఎన్ని ఇస్తనవెందే... ఎక్కడివి.."

"గాజులు షేటు దగ్గర పెట్టినా... అందుకే లేట్ అయ్యింది"

"ఎంత మంచిదానివే... మిత్తి ధనమ్మను అడగకు... నేను ఇస్తా.." అంది మల్లవ్వ .

"ఒ మల్లవ్వ ఇవి మిత్తికి కావు... నేనే సదివి పిత్తాన అనుకో... గంతే..." అంది లక్ష్మి.

"నువ్వు.. నిజంగా కింగ్ వే నే....

"అది అందరి బిడ్డ.... బస్తీ బిడ్డ....అది సదువుకుంటే...బస్తీ అంతా బంగారం అయితది..." లక్ష్మి అందీ...

"సదువు పట్ల నీకు ఎంత ప్రేమ ఉందే"

"ఆడపిల్ల సదువుకుంటే సమాజం బాగు పడతది అని ఎవరో పెద్ద సార్ చెప్పలేదా" అంది లక్ష్మి.

"అవును .పెద్ద సార్లు చాలా బాగా చెప్పారు" అంది మల్లవ్వ కొంత చిరాకుగా.

"నువ్వు సల్లగా ఉండాల్నే ... దనమ్మ బిడ్డ అదృష్టం బాగుంది..." అంటూ డబ్బులు దనమ్మ చేతిలా పెట్టింది మల్లవ్వ

దనమ్మ అందరికి చేతులు జోడించింది..

"ఇగ అందరూ పనికి పొండి. నేను, దనమ్మ కాలేజ్‌కి పోయి పైసలు కట్టి అస్తం" అంది మల్లవ్వ .

అందరూ సంతోషంగా వెళ్లి పోయారు.

లక్ష్మి భర్త తో కలిసి ఇంటికి వెళ్లింది. తన బిడ్డను బాగా చదివించుదామని కలలు కంది లక్ష్మి. బిడ్డలు కాకపోతే హాస్పిటల్ చుట్టూ తిరుగుతుంది. కానీ పిల్లలు కావటం లేదు. ఇప్పుడు దనమ్మ బిడ్డ సంగతి తెలిసే సరికి... ఇక నేను హాస్పిటల్ చుట్టూ తిరుగనని ఆ పైసలతో దనమ్మ బిడ్డ ను చదివిపిస్తానని .. భర్తను ఒప్పించి డబ్బులు ఇచ్చింది లక్ష్మి.

పేద వాళ్ల సహాయం చేయడంలో పెద్ద వాళ్ళు... ఇది బస్తీ బడాపన్. శ్రీ రామ్ బస్తీ మనసుల కోవెల.

వచ్చేవారం కథ..

**రహస్య ప్రపంచాలు**

**- రామా చంద్రమౌళి**



# కలవరపెట్టిన బాంబు బెదిరింపు కాల్స్

**హం**తకుడి చేతిలో కత్తి మాదిరిగానే తయారయింది సామాజిక మాధ్యమాల తీరు. తుంటరుల చేతిలో పడిన ఆ మాధ్యమం ఇప్పుడు అంతర్జాతీయ సమస్యగా కూడా పరిణమించింది. వ్యక్తుల శీలహననం, నకిలీ సమాచారం, అశ్లీల విడియోలు అన్నీ కలసి తీవ్రమైన కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. అక్టోబర్ మధ్య నుంచి రెండు వారాల పాటు పది పన్నెండు కాదు, దాదాపు 400 భారతీయ విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అవన్నీ నకిలీవే. ఇవన్నీ సామాజిక మాధ్యమాలు, ఈమెయిల్స్ ద్వారా వచ్చినవే. దీనితో ఎయిర్ లైన్స్ ఎన్నో విమానాలను దారి మళ్లించింది. సమయ పాలన చేయలేకపోవడం వల్ల కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. విదేశాలు భారత్‌కు నడిపే కొన్ని విమానాలకు కూడా ఈ నకిలీ బాంబు బెదిరింపు కాల్స్ వెళ్లాయి. దీనితో నకిలీ కాల్స్ మీద ప్రత్యేక దృష్టి పెట్టవలసిందని 'ఎక్స్'కు, మెటా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

విమానాలకే కాకుండా కోల్‌కతా, రాజ్‌కోట (గుజరాత్), తిరుపతి పట్టణాలలోని 23 హొటళ్లకు కూడా నకిలీ బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. హిందువుల ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతిలోని మూడు హోటళ్లకు అక్టోబర్ 27న నకిలీ బాంబు కాల్స్ వెళ్లాయి. ఆ రోజు శనివారం కావడం విశేషం. ఈ సమాచారం పంపుతున్న వారిగా మూడు పేర్లు కుట్రదారులు పెడుతున్నారు. అందులో ఒకటి జాఫర్ సాదిక్. ఇతడు మత్తుమందుల కేసులో మొన్న జూలైలో అరెస్టయ్యాడు. మరొక పేరు తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ భార్య కృత్తికది. అలాగే తమిళనాడు పోలీస్ డైరెక్టర్ జనరల్ పేరును కూడా ఈ సమాచారం పంపుతున్నవారు ఉపయోగించుకున్నారు.

ఏ పేరుతో ఈ సందేశాలు పంపినా, వీటిని పంపిన వారు ఎవరో అర్థం చేసుకోవడం పెద్ద కష్టం కాదు. సందేశంలో 'అఫ్జల్ గురు (పార్లమెంటుపై దాడి కేసులో ఉరి శిక్ష పడినవాడు) మళ్లీ పుట్టాడు. అల్ బద్ర్' అని పేర్కొన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కోల్‌కతా పర్యటన నేపథ్యంలో అక్కడి హోటళ్లకు ఈ సందేశాలు వెళ్లాయి. ★



కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో వ్యవహారశైలి కారణంగా మన దేశంతో దౌత్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వచ్చే ఏడాది కెనడాలో ఎన్నికలు జరుగనున్న తరుణంలో సిక్కుల మద్దతు కోసం ప్రధాని ట్రూడో చేస్తున్న ఓటుబ్యాంకు రాజకీయం, ఆమెరికా సహా ప్రపంచంలోని ఏ దేశం కూడా స్నేహం వదులుకోవడానికి సాహసించని భారత్‌తో జగడానికి దారి తీసింది. ఖలిస్తాన్ పేరు అడ్డం పెట్టుకొని డ్రగ్ మాఫియాను నడుపుతున్న కొందరి చేతుల్లో జస్టిన్ ట్రూడో కీలుబొమ్మ కావడమే ప్రస్తుత దుస్థితికి ప్రధాన కారణం.

# గ్యాంగ్‌స్టర్‌ల స్వర్గధామం కెనడా

అతి స్వల్ప సంఖ్యలో ఉన్న ఈ డ్రగ్ మాఫియా, అధికార లిబరల్ పార్టీకి నిధులు సమకూర్చే స్థాయికి చేరుకోవడంతో ట్రూడో వారిని కాదనలేని పరిస్థితి. ప్రస్తుతం అధికార పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గ్రాఫ్ పడిపోతున్న నేపథ్యంలో అధికారంలోకి వచ్చే ఆశలు అడుగంటుతుండటంతో సిక్కుల మద్దతు కోసం ట్రూడో ఏకంగా దిగ్గజ దేశం భారత్‌తోనే గొడవ పెట్టుకున్నాడు. విపక్షాలు, సొంత పార్టీ నాయకులు ఈ ధోరణి తగదని హితవు చెబుతున్నా మారని ట్రూడో వైఖరి ప్రస్తుతం పార్టీకే ఆత్మహత్యా సదృశంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల జరిగిన లిబరల్ పార్టీ అంతర్గత సమావేశంలో దాదాపు 20 నుంచి 24 మంది ఎంపీలు ట్రూడోను అక్టోబర్ 28లోగా రాజీనామా చేయాలని అల్టిమేటం జారీచేయడమే కాదు, ఒకవేళ అట్లా చేయకపోతే తిరుగుబాటు తప్పదని కూడా హెచ్చరించడం తాజా పరిణామం. ట్రూడో వ్యవహారశైలి వల్ల రాబోయే ఎన్నికల్లో తమకు పరాజయం తప్పదన్న భయం చాలామంది ఎంపీల్లో వ్యక్తమవుతోంది.

మారుతున్న పరిణామాల నేపథ్యంలో, ట్రూడో ఎంతోకాలం లిబరల్ పార్టీ నాయకుడిగా కొనసాగే పరిస్థితి కనిపించడంలేదు. పార్టీ ఎంపీల్లో చాలామంది ట్రూడో నాయకత్వం విషయంలో రహస్య ఓటింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.

**కెనడా తెంపరితనం**

ఉదారవాదం, వాక్‌స్వాతంత్ర్యం ముసుగులో ‘తెలివిగా హెచ్చరికలు’ జారీచేయడం కెనడాకే చెల్లిందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ చేసిన విమర్శ నూటికి నూరుపాళ్లు నిజం. మన దౌత్యవేత్తలు, రాజకీయ నాయకులు కెనడా భూభాగంపై ఖలిస్తానీ ఉగ్రవాదుల విషయంలో చేస్తున్న హెచ్చరికలను బేఖాతరు చేయడమే కాకుండా, ‘వాక్‌స్వాతంత్ర్యం’ పేరుతో వారిని సమర్థించడం ట్రూడో ప్రభుత్వ తెంపరితనానికి నిదర్శనం. ప్రస్తుతం ఖలిస్తానీ ఉగ్రవాదుల పట్ల కెనడా అనుసరిస్తున్న ‘ఉదార’ వైఖరివల్ల మన దౌత్యవేత్తలకు అక్కడ భద్రత లేకుండా పోయింది. ఖలిస్తాన్ వేర్పాటువాది హర్‌దీప్‌సింగ్ నిజ్జర్ హత్య కేసుకు సంబంధించి కెనడా మన దేశానికి ఎటువంటి ఆధారాలు సమర్పించలేదు. అతడి హత్యలో భారత్ ఏజెంట్ల ప్రమేయం ఉన్నదంటూ అక్కడి ప్రభుత్వం చేస్తున్నవి ఆరోపణలు మాత్రమే! ఇవికూడా రాజకీయ ప్రేరేపితమైనవి! ఓటు బ్యాంకు రాజకీయం కోసం దేశ విశాల హితాన్నే పణంగా పెట్టిన ఘనతను ట్రూడో మూటకట్టుకున్నాడు.

**ముఠాలకు స్వర్గధామం**

భారత్‌లో గ్యాంగ్‌వార్‌లకు పాల్పడుతూ, అరెస్ట్‌ను తప్పించుకోవడానికి పారిపోయినవారికి కెనడా ఇప్పుడు స్వర్గధామంగా మారింది. భారత్ ఉగ్రవాదులుగా పేర్కొంటున్నవారిని, తమదేశ పౌరులుగా, దేశభక్తులుగా కీర్తించడం ఒక ప్రజాస్వామ్య దేశానికి ఎంతమాత్రం తగనిపని. ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య విషయంలో కెనడా ప్రభుత్వ వైఖరి కారణంగా మన దేశంతో దౌత్యసంబంధాలు ప్రతిష్టంభనకు గురైన సంగతి తెలిసిందే. కెనడాలోని సిక్కులు రవాణారంగంలో బాగా స్థిరపడటంతో ధనవంతులుగా మారారు. వీరిలో ఖలిస్తాన్ వాదులుగా చెప్పుకుంటున్న కొందరు ఈ ముసుగులో తమ అక్రమవ్యాపారాల దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అంతేకాదు భారత్ నుంచి వచ్చిన విద్యార్థులను కూడా ప్రలోభాలతో దేశ వ్యతిరేక కార్యకలాపాలకు ప్రోత్సహిస్తున్నారంటూ కెనడా నుంచి మనదేశం వెనక్కు పిలిచిన దౌత్యవేత్త సంజయ్ వర్మ ఎన్.డి.టి.వి.కి ఇచ్చిన ఇంటర్వ్యూ లో వివరించిన వైనం, విద్యార్థుల తల్లిదండ్రులు

పునరాలోచించుకోవాల్సిన సత్యాన్ని వెల్లడిస్తోంది. ముఖ్యంగా కెనడాలో ఉద్యోగావకాశాలు తక్కువ కావడంతో, భారతీయ విద్యార్థులకు డబ్బు, ఆహారం అందిస్తూ మనదేశ వ్యతిరేక కార్యకలాపాలకు ప్రోత్సహిస్తూ చివరకు వారు స్వదేశానికి వస్తే అరెస్టయ్యే పరిస్థితులు కల్పిస్తారని, తద్వారా అక్కడే శరణార్థులుగా దరఖాస్తులు చేయించి తమ చట్రంలో బిగించి, ఎటూ పోలేని స్థితిని కల్పించి వారికి ఇక భవిష్యత్తే లేకుండా చేస్తున్నారని ఆయన విద్యార్థుల తల్లిదండ్రులను హెచ్చరించారు. కెనడా వెళ్లి చదువుకోవాలని అత్యుత్సాహాన్ని ప్రదర్శించేవారు దీన్ని గుర్తించాలి.

**ట్రూడో ప్రభుత్వం హైజాక్**

కెనడా, అమెరికా, యు.కె.లో ఖలిస్తాన్‌వాదులు ఎందుకు కనిపిస్తున్నారనేది ప్రధాన ప్రశ్న. జస్టిన్ ట్రూడో లిబర్ పార్టీ, సిక్కుల పార్టీ న్యూడెమొక్రటిక్ పార్టీలను ఖాలిస్తాన్ పోరాటదారులు ఒకరకంగా హైజాక్ చేశారనే చెప్పాలి. కెనడాలో ట్రక్కింగ్ ఇండస్ట్రీలో లక్షన్నరమంది సిక్కులే వుంటారు. వీరికి అమెరికా, కెనడా హైవేలపై పూర్తి నియంత్రణ ఉంది. డ్రగ్ మాఫియాను తమ అధీనంలో ఉంచుకున్న వీరు ఖలిస్తాన్ ముసుగులో నేరాలకు పాల్పడుతున్నారు. ఇటువంటి నకిలీ ఖలిస్తాన్‌వాదులపై మనదేశం పూర్తి స్థాయిలో నిఘా ఉంచి, తెరవెనుక వీరు చేస్తున్న అక్రమ దందాలను ఎప్పటికప్పుడు ప్రపంచం ముందుంచుతూ వచ్చింది. ఇదీ వారి ఆగ్రహానికి ప్రధాన కారణం.

2005-21 మధ్యకాలంలో కెనడాలో జరిగిన గ్యాంగ్‌వార్‌లలో పాల్గొన్న వారిలో 30 శాతం సిక్కులే. సిక్కు యువకులకు ఆయుధాలిచ్చి శిక్షణ ఇవ్వడంతో ఈ కొట్లాటల్లో పాల్గొనేవారు. అదేమంటే భారత్‌కు వ్యతిరేకంగా ఖలిస్తాన్ ఉద్యమం నడుపుతున్నామని చెప్పేవారు. కెనడా పోలీసులు చూసీ చూడనట్టు పోయారు. నిజానికి కెనడాలో జరుగుతున్న గ్యాంగ్‌వార్‌ల విషయాన్ని ఎప్పటినుంచో భారత్ ఆదేశ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ వస్తోంది. వీరు చేస్తున్న డ్రగ్ వ్యాపారాలు, అక్రమ వసూళ్లు, హత్యలు కెనడాలోని భారతీయ సమాజానికి మాత్రమే కాదు, పంజాబ్‌లో కూడా సమస్యలు సృష్టిస్తున్నాయి.

**గ్యాంగ్‌వార్ హత్యలు**

సెప్టెంబర్ 21న సుఖ్‌ధూల్ సింగ్ అలియాస్ సుఖాదునెకె అనే పేరుమోసిన పంజాబ్ గ్యాంగ్‌స్టర్ కెనడాలోని విన్నిపెగ్‌లో జరిగిన గ్యాంగ్‌వార్‌లో హతమయ్యాడు. ఇతను ఖలిస్తాన్ సానుభూతిపరుడిగా చెప్పుకున్నప్పటికీ, బలవంతపు వసూళ్లు, సుపారీ హత్యలు ఇతని ప్రధాన వృత్తి. పంజాబ్‌లోని మోగా ప్రాంతానికి చెందిన ఇతను 2017లో నకిలీ పాస్‌పోర్ట్‌తో కెనడా వెళ్లినట్టు సమాచారం. గత ఏడాది మార్చిలో సందీప్ సింగ్ నంగల్ అనే కబడ్డీ ఆటగాడి హత్యలో ఇతని పాత్ర ఉన్నదన్న అభియోగాలున్నాయి. దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలపై నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) వాంటెడ్ జాబితాలో ఉన్నాడు.

గత జులైలో కెనడాలోని కోకిట్లామ్ పట్టణంలో రెండు గ్యాంగ్‌ల మధ్య జరిగిన కాల్పుల్లో పంజాబ్‌కు చెందిన కరన్‌వీర్ సింగ్ గచ్చా అనే గ్యాంగ్‌స్టర్ మరణించాడు. అంతకుముందు మే నెలలో వాంకోవర్ నగరంలో జరిగిన కాల్పుల్లో అమర్‌ప్రీత్ సమ్రా అనే మరో గ్యాంగ్‌స్టర్ హత్యకు గురయ్యాడు. వాంకోవర్ పోలీసు శాఖ విడుదల చేసిన ప్రముఖ గ్యాంగ్‌స్టర్‌ల జాబితాలో ఇతడి పేరుంది. బ్రదర్స్ కీపర్స్ గ్యాంగ్ ఈ హత్యకు కారణమని వార్తలు వచ్చాయి. ఇంకా సతీందర్‌జిత్ సింగ్ బ్రార్ అలియాస్ గోల్డీ బ్రార్, అర్షదీప్ దాలా, లఖ్బీర్‌సింగ్ లండా వంటి ప్రమాదకరమైన గాంగ్‌స్టర్లకు కెనడా ఇప్పుడు స్వర్గధామం. వీరిలో లఖ్బీర్ సింగ్ లండా ఖలిస్తాన్, బబ్బర్‌ఖల్సా ఇంటర్నేషనల్‌తో సంబంధాలున్నాయని చెబుతారు. ఇటువంటి వారిపట్ల ఉదార వైఖరి ప్రదర్శిస్తూ, వారిని కీర్తిస్తూ ప్రజాస్వామ్య దేశమైన కెనడా ప్రస్తుతం మనకు మరో పాకిస్తాన్ మాదిరిగా తయారైంది.

- విఠల్



# ఎవరి పేరు పెట్టాలి?

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా చరిత్ర పుటలలో నిలిచిన 1857 నాటి సిపాయీ కలహం సంఘటన ఉత్తేజకరమైనది. అది జరిగి రెండు వందల ఏళ్లు గడిచాయి. దేశంలో చాలాచోట్ల సంగ్రామం జరిగిన ప్రదేశాలు ఉన్నాయి. విప్లవకారులు దాడులు చేసిన ఈస్టిండియా కంపెనీ భవనాలు ఉన్నాయి. అలాంటి వాటిలో ఒకటి మధ్యప్రదేశ్‌లోని ఇందోర్‌లో కూడా ఉంది. ఇందోర్ కోఠి రెసిడెన్సీ అని దీనికి పేరు. ఈస్టిండియా కంపెనీ పరిపాలనా వ్యవహారాలన్నీ ఈ భవనం నుంచే జరిగేవి. 1820లో ఈ భవనం నిర్మించారు. ఈ చారిత్రక స్థలానికి శివాజీ కోఠి అని పేరు పెట్టాలని ఇందోర్ కౌన్సిల్ అక్టోబర్ 18న నిర్ణయించింది. అయితే సాదత్ ఖాన్ కోఠి అని పేరు పెట్టాలని ఒక డిమాండ్ వచ్చింది. సాదత్ ఖాన్ వారసులు ఈ డిమాండ్‌తో ముందుకు వచ్చారు. సాదత్ ఖాన్ 1857లో ఇందోర్‌లో ఈస్టిండియా కంపెనీకి వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీశాడు. కోఠి రెసిడెన్సీలోనే అతడిని తరువాత ఉరి తీశారు. కాబట్టి సాదత్ పేరు పెట్టాలని ఆయన వారసులు కోరుతున్నారు. అయితే, శివాజీ పేరు పెట్టాలని మునిసిపల్ కౌన్సిల్ మేయర్ పుష్యమిత్ర భార్గవ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయించిన తరువాత ఇలాంటి డిమాండ్‌తో ముందుకు రావడం అనుమానాలు రేకెత్తిస్తుంది. నిజానికి ఈ రెసిడెన్సీకి దేవీ అహల్యాబాయి పేరు పెట్టాలని పుణ్యశ్లోక్ అనే సంస్థ కోరుతున్నది. ఆమె ఇందోర్ రాణి అన్న సంగతి తెలిసినదే. హోల్కార్ వంశీకురాలు. ఆ వంశానికి చరిత్రలో ఎంతో పేరు ఉంది. అహల్య పేరు పెట్టాలన్న డిమాండ్‌తో పుణ్యశ్లోక్ సంస్థ ఒక బ్యానర్‌ను కూడా భవనం ఎదుట తగిలించింది. సాదత్ ఖాన్ పేరు పెట్టాలని తాము చిరకాలంగా కోరుతున్నామని ఆయన వారసులలో ఒకడు రిజ్వాన్ ఖాన్ చెబుతున్నాడు.

జూలై 1,1857న సాదత్‌ఖాన్ మరికొందరు సాయుధులతో కలసి కోఠి మీద దాడి చేశాడు. ప్రవేశద్వారం కూలగొట్టి లోనికి ప్రవేశించి, కార్యాలయాన్ని తన అదుపులోనికి తీసుకున్నాడు. ఇంకా, సాయుధ విప్లవకారులు కోఠి కార్యాలయం మీద ఉన్న ఈస్టిండియా కంపెనీ జెండాను తొలగించి, నాటి హోల్కార్ సంస్థానం పతాకాన్ని ఆవిష్కరించారు.

అయితే సాదత్‌ఖాన్ పేరుతో ఇప్పటికే ఒక స్మారక చిహ్నం ఉందని మేయర్ భార్గవ గుర్తు చేస్తున్నారు. అయినా ఇంకొక స్మారక చిహ్నం కావాలని కోరితే అది కూడా పరిశీలిస్తామని మేయర్ చెప్పారు.



# విజయవాడలో హైందవ

## గుడుల రక్షణలో ప్రభుత్వ స్పందన కోరుతూ జనవరి

**హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి ఉండాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) దేశవ్యాప్త ఉద్యమాన్ని ప్రారంభించిందని జాతీయ సంయుక్త కార్యదర్శి డా. సురేంద్ర జైన్ విజయవాడలో తెలియచేశారు. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 30వ తేదీన అన్ని రాష్ట్రాల గవర్నర్లకు 'హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి ఇస్తూ చట్ట సవరణ చేయాలని' కోరుతూ సంస్థ ప్రతినిధులు వినతిపత్రాలు సమర్పించారు. వీటితో పాటు హిందువుల మనోభావాలను, సమస్యలను అర్థం చేసుకుని ఆ మేరకు ప్రభుత్వాలు స్పందించాలన్న తమ ఆకాంక్షలను వ్యక్త పరిచేందుకు విజయవాడలో జనవరి 5, 2025న 'హైందవ శంఖారావం' పేరుతో భారీ బహిరంగ సభను వీహెచ్‌పీ నిర్వహించబోతున్నది. ఈ విషయాన్ని డా. సురేంద్ర జైన్ ఇటీవల విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.**



వీహెచ్‌పీ స్థాపించి ఆరవై ఏళ్లు పూర్తయిన సంగతి తెలిసినదే. హిందూధర్మం మీద ఒక పథకం ప్రకారం దాడులు పెంచుతున్న వారు ఇటీవలి కాలంలో ఎక్కువగా కనిపిస్తున్నారు. ఫలితంగానే హిందువుల ఐక్యత గురించి ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు, వీహెచ్‌పీ నాయకులు, ఇతర హిందూ సంఘాల నాయకులు మరింత దృష్టిని పెట్టవలసిన ఆవశ్యకత కనిపించింది. హిందూ దేవాలయాల ఆస్తులు కూడా మరింతగా అన్యాక్రాంతమవుతున్నాయి. వక్ఫ్ చట్టం పేరుతో పురాతన హిందూ దేవాలయాల ఆస్తుల మీద విధర్మీయులు కన్ను వేశారు. ఇప్పుడు ఆలయాల పరిరక్షణ కోసం హిందువులు అత్యవసరంగా న్యాయబద్ధంగా ఉద్యమించవలసిన అవసరం కూడా పెరిగింది. దీనికి ప్రభుత్వాల సాయం కూడా కావాలి. ఈ అంశాలనే డా. జైన్ వివరించారు.

హిందూ దేవాలయాలలో జరిపే పూజాదికాలు, ఆచారాల నిర్వహణలో దేవాలయ అధికారులు జోక్యం చేసుకోరాదంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాన్ని విశ్వహిందూపరిషత్ (వీహెచ్‌పీ) స్వాగతిస్తున్నదని డా. జైన్ అన్నారు. ఇదే విధంగా హిందూ దేవాలయాలు మరింత పవిత్రతతో, శ్రద్ధతో నిర్వహించే విధంగా చూసుకోవడానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టాలని వీహెచ్‌పీ జాతీయ సంయుక్తకార్యదర్శి సూచించారు. ఇటీవల హిందూ సమాజాన్ని బాగా కదిలించిన అంశాలను కూడా ఆయన వివరించారు.

హిందువుల అతి పెద్ద తీర్థస్థలం తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరుని ప్రసాదంలో పశువుల కొవ్వు పదార్థాల కలిశాయన్న సమాచారం ప్రపంచ వ్యాప్తంగా హిందువులను దిగ్భ్రాంతికీ, ఆందోళనకీ, ఆక్రోశానికీ గురిచేసింది. భక్తుల విశ్వాసాలు, మనోభావాలే కాకుండా మొత్తం హిందూ దేవాలయ వ్యవస్థ నేడు పెను ప్రమాదంలో పడింది. హిందువుల విశ్వాసాలతో ఆటలాడుకునే ధోరణి అనేక దేవాలయాల నిర్వహణలో కనపడుతోంది. ఆ ధోరణి ప్రబలిన అనేక ప్రముఖ దేవాలయాలు ప్రభుత్వాధీనంలో ఉన్నవేనన్న విషయం విస్మరించలేనిది. హిందూ సమాజమే స్వతంత్రంగా ఆలయాలు నిర్వహించుకున్న నాడు హిందువుల ధార్మిక విశ్వాసాలకు గౌరవ మర్యాదలు దక్కుతాయన్న నిజం ఈ పరిణామాల ద్వారా రుజువైంది.

తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయమే కాకుండ అనేక మందిరాలలో హిందువులు భక్తి ప్రపత్తులతో సమర్పించిన ముడుపులు దేవాలయ అధికారులు, పాలక మండళ్ల ద్వారా దుర్వినియోగమవుతున్నాయన్న వార్తలు కూడా తక్కువేమీ కాదు. టీటీడీ సహా దేవాదాయ ధర్మాదాయ శాఖ నియంత్రణలోని దేవాలయాల సిబ్బందిలో హైందవేతరులను నియమించి హిందూ విశ్వాసాలతో ఆటలాడుకుంటున్న వైనం సుస్పష్టం కూడా.

ప్రభుత్వాల ద్వారా హిందూదేవాలయాల నిర్వహణ రాజ్యాంగ విరుద్ధమే కాకుండా హిందూ విశ్వాసాలపై తీవ్రమైన దాడిగా కూడా చెప్పవచ్చు. గౌరవ న్యాయస్థానాలు అనేకసార్లు దేవాలయ నిర్వహణలోను, దేవాలయ ఆస్తుల విషయంలోనూ ప్రభుత్వాలు దూరంగా ఉండాలని స్పష్టంగా ఆదేశాలు ఇచ్చాయి. ప్రభుత్వాల ద్వారా హిందూ దేవాలయాలపై నియంత్రణ రాజ్యాంగంలోని 12, 25, 26 ఆర్టికల్‌ల ఉల్లంఘన అవుతుంది. విదేశీ దురాక్రమణదారులు దేవాలయాలను దోపిడీ చేశారు. ఆంగ్లేయులు తమ కబ్జాలో పెట్టుకుని నిరంతరం లూటీ చేశారు. సెక్యులర్ ముసుగులో హిందూ సంప్రదాయాలను నాశనం చేయాలనే సంకల్పం చేసుకున్న కొన్ని రాజకీయ పార్టీలు దేవాలయాలను దోచుకోవడమేకాక హిందూ ఆలయ వ్యవస్థను నాశనం చేసే తమ ఎజెండాను పూర్తి చేసుకునే ప్రయత్నాలు ముమ్మరంగ చేస్తున్నాయి. చాలా ఆలయాలకు విశేషమైన ఆదాయం ఉంది. ఆస్తులు ఉన్నాయి. నాడు గాని నేడు గాని వాటిని ఇచ్చిన వారి ఉద్దేశం ఒక్కటే. హిందూ ఆలయ సంపదలను హిందూ శ్రేయస్సు కోసం మాత్రమే ఉపయోగించాలి. హిందూ ధర్మ ప్రచారం కోసమే వినియోగించాలి.

# శంఖారావం'

## 5న వీహెచ్‌పీ భారీ సభ

కానీ ఆ దృష్టి కొరవడింది.

హిందూ ధర్మ ఉద్ధరణ, శ్రేయస్సు కోరే అనేక మంచి పనులు కూడా ఉన్నాయి. వాటిని ఈ దేవాలయాల ఆదాయంతో నిర్వహించాలి. కానీ, అలాంటి మంచి పనులు, అందుకు సంబంధించిన ఆలోచన ఇవాళ నిర్లక్ష్యానికి గురి అవుతున్నాయి.

ఇప్పుడు హిందువులంతా తప్పక వేసుకోవలసిన ప్రశ్న కూడా ఒకటి ఉన్నది. దేశం స్వాతంత్ర్యం పొంది 77 సంవత్సరాలు గడిచిపోయినా తమ దేవాలయాలు నిర్వహించుకునే స్వతంత్ర అధికారం హిందువులకు ఎందుకు లేదు? ఎందుకు ఇవ్వడం లేదు? మైనారిటీలు తమ ప్రార్థనా స్థలాల నిర్వహణ తామే చూసుకుంటున్నారు. కానీ, హిందూ సమాజానికి రాజ్యాంగబద్ధమైన ఈ హక్కు నేటికీ ప్రాప్తించలేదు.

నేడు హిందువులే నిర్వహించుకుంటున్న అనేక దేవాలయాలు చక్కని పరిపాలనతో జాతీయ విపత్తుల సమయంలో చాలా యోగ్యవంతమైన భూమిక నిర్వహించిన ఉదంతాలు కనపడుతున్నాయి. ఎన్ని విజ్ఞప్తులు చేసినా, ఉద్యమాలు చేసినా ప్రభుత్వాలు హిందూ దేవాలయాలను తమ పిడికలి నుంచి విడిచిపెట్టడం లేదు, 'దేవాలయాలను ప్రభుత్వపరం చేయడం కాదు, హిందూ సమాజపరం చేయడం నేటి అవసరం' అని వీహెచ్‌పీ భావిస్తున్నదని డాక్టర్ జైన్ వివరించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజల ఇప్పుడు తమ ఆకాంక్షలు నెరవేరాలని కోరుతున్నారు. హిందూ సమాజం అవసరాలు, కోరికలు ఇవి:

టీటీడీ సహా అన్ని హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుండి విముక్తం చేసి హిందూ సమాజానికి ఒక ఉత్తమ నూతన వ్యవస్థకు లోబడి అప్పచెప్పాలి. ఈ నూతన వ్యవస్థ నమూనాను హిందూ ధర్మాచార్యులు అనేక దశాబ్దాలుగా చర్చించి ఒక రూపాన్ని కూడా నిర్ధారించి పెట్టారు.

ఆ శుభ పరిణామం చోటు చేసుకునే వరకు దేవాలయాలన్నింటిలోను పూజా ప్రసాదాది సేవలన్నీ అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించేలా చూడాలి. ఈ ఆచారాలను, సంప్రదాయాలను ఉల్లంఘించిన వారిని ఉల్లంఘనకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలి.

హైందవేతరులెవరికీ దేవాలయ పాలనలో చోటు ఇవ్వరాదు. ఉద్యోగులుగా ఏ దశలోను స్థానం ఇవ్వరాదు. ఇప్పటికీ ఉన్న వారిని వెంటనే తొలగించి వేయాలి.

దేవాలయ ట్రస్టు బోర్డులలో హైందవేతరులను, రాజకీయ పక్షాలకు చెందిన వారిని నియమించరాదు. దేవాలయ సమీపంలో హైందవేతరులకు దుకాణాలు, వ్యాపారాల నిర్వహణకు అవకాశం ఇవ్వరాదు.

దేవాలయ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం రక్షణ కల్పించాలి. దేవాలయ ఆదాయాన్ని, స్థిరాస్తులను ప్రభుత్వాలు హిందూధార్మికేతర ప్రజా పాలనా కార్యాలకు వినియోగించరాదు.

హిందూ సమాజంపై, హిందూ ఆలయాలపై ఉన్మాదంతో కుట్రపూరితంగా దాడులు చేస్తున్న విధర్మీయులు, విద్రోహులను ప్రభుత్వాలు గుర్తించి అత్యంత కఠినంగా శిక్షించాలి. ★

# మొగలుల కట్టడాలు కూలుతున్నాయి

ఆగ్రా అంటే తాజ్‌మహల్ గుర్తుకు వస్తుంది. కానీ మొగల్ వంశ స్థాపకుడు బాబర్ కుమార్తె జుహారా మహల్ కట్టించినట్టు చెప్పే మూడు అంతస్తుల కట్టడం కూడా అక్కడ ఉంది. కానీ ప్రతీది తాజ్‌మహల్ అంత ప్రసిద్ధి లోకి రాలేదు.

ఇంతకీ ఈ మూడు అంతస్తులలో రెండు అక్టోబర్ 27వ తేదీన హఠాత్తుగా కూలిపోయాయి. ఈ కట్టడాన్ని అక్కడ జోరా బాగ్ అని పిలుస్తారు. ఇది ఒక పార్కు వంటి విహార కేంద్రం.

కేంద్ర పురావస్తు పరిశోధక శాఖ రక్షణలో ఉన్న కట్టడాలలో ఒకటి. నిజానికి దీనికి మరమ్మతులు చేయాలని పురావస్తు శాఖ ప్రణాళికలు తయారు చేసిన తరుణంలో కూలిపోయింది. పురావస్తు శాఖ ఉన్నతాధికారి రాజ్‌కుమార్ పటేల్ శిథిలాలను పరిశీలించి వచ్చారు. మొదట జోరా బాగ్‌కు దారి ఏర్పరచాలని అనుకున్నారు. అక్కడికి చేరాలంటే చిని కా రౌజా అనే ప్రాంతం చుట్టూ తిరిగి వెళ్లాలి. మొదట బాగ్‌కు నేరుగా దారి ఏర్పరిచే పనులు ప్రారంభించారు. కానీ ఇంతలోనే ఆ కట్టడం కాస్తా కూలింది. వర్షం నీరు కారణంగా ఈ కట్టడం కూలి ఉంటుందని భావిస్తున్నట్టు పటేల్ తెలియచేశారు. అయినా ఇప్పుడు మళ్లీ పాత నమూనాలోనే ఆ కట్టడాన్ని పునరుద్ధరించే పనిలో పురావస్తు శాఖ ఉన్నది.

1526 ప్రాంతంలో కట్టిన జోరా బాగ్ యమునా తీరంలో చిని కారౌజ్ అనే ప్రాంతానికి, జవహర్ బ్రిడ్జ్‌కి నడుమ ఉంది. దీనిని మినీ కాబూల్ అని పిలుస్తారు. నిజానికి ఆగ్రాలోని అనేక మొగలుల కాలం నాటి కట్టడాలు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. చరిత్రాత్మక ఎత్మద్ ఉద్ దౌలా, రాంభాగ్ అనే కట్టడాలు కూడా వర్షాల కారణంగా ఒరిగి పోయాయి.

ఆఖరికి తాజ్‌మహల్ చుట్టూ ఉండే గోడలు కూడా కొన్ని కూలాయి. సికింద్రా అనే ప్రాంతంలో ఉన్న 500 సంవత్సరాల నాటి ఒక మసీదు కూడా కూలిపోయింది.








# అమ్మవారి నిమజ్జన ఊరేగింపుపై దాడి, హత్య

ముస్లిం మతోన్మాదులలో మధ్య యుగాల నాటి ఆధిపత్య ధోరణి తగ్గదు. మేధావులు, ఉదారవాదులు దీని గురించి మాట్లాడరు. అందుకే మధ్య యుగాలలో లేదా మొగలుల పాలనా కాలంలో చెల్లుబాటైన జులుంనే ప్రదర్శిస్తున్నారు. ఇందుకు తాజా ఉదాహరణ ఉత్తరప్రదేశ్‌లోని బహరైచ్ ఉదంతం. ఆ పేరుతో పిలుస్తున్న ఈ హింసాకాండ నిజానికి మహరాజ్‌గంజ్ అనే గ్రామంలో జరిగింది. అది బహరైచ్ జిల్లాలో ఉంది. దేవీ పూజలు ముగిసిన తరువాత డీజే పెట్టుకుని అమ్మవారి విగ్రహం నిమజ్జనం కోసం ఊరేగింపుగా వెళుతున్న హిందువుల మీద ముస్లిం మతోన్మాదులు దాడికి దిగారు. గోపాల్ మిశ్రా అనే యువకుడిని (22) కాల్చి చంపారు. ఆ సాయుధుడుఎంత మతోన్మాదో అనిపిస్తుంది. దాదాపు 20 చోట్ల కాల్చాడు. అంటే జల్లెడలా చేసేశాడు. అక్టోబర్ 13న సాయంత్రం ఆ చిన్న పట్టణంలో ఈ దుర్ఘటన జరిగింది. తరువాత చినికి చినికి గాలివాన అయింది. వారం పాటు ఉద్రిక్తతలు సడలలేదు. ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతం గుండా ఈ ఊరేగింపు వెళుతున్నప్పుడు రెచ్చగొట్టే విధంగా పాటలు పెట్టారనీ, దీనితో అక్కడి ఇళ్ల నుంచి రాళ్ల వర్షం కురిసిందని, ఒక యువకుడు పచ్చజెండాను తీసేసి కాషాయ పతాకం పెట్టినందుకు అతడిని కాల్చివేశారని ప్రాథమిక సమాచారం అందింది.

దీనితో ఆగ్రహించిన ప్రజలు గోపాల్ మిశ్రాకు న్యాయం చేయాలని కోరుతూ ఆందోళనకు దిగారు. నిజానికి వారు తీవ్ర ఆగ్రహమే ప్రదర్శించారు. వాహనాలకు, దుకాణాలకు నిప్పు పెట్టారు. తరువాత ఈ పరిణామాలు ప్రభుత్వ వైఫల్యమని, అల్లర్లు బీజేపీ కార్యకర్తల నిర్వాకమని సమాజ్‌వాది పార్టీ నాయకులు పేలడంతో గొడవ మరింత ముదిరింది. జెండా మార్చేశాడని చెప్పడం ఇవన్నీ జనం నమ్మడం లేదు. ఒకవేళ అదే పని చేస్తే కాలుస్తారా? అన్నది ప్రశ్న. ఇంకొక ప్రశ్న ఆ తుపాకీ ఎక్కడ నుంచి వచ్చింది? అన్ని రాళ్లు ఇళ్లల్లో ఎందుకు ఉంచుకున్నారు? అందుకే ఇదంతా ముందస్తు ప్రణాళిక మేరకు జరిగిన దాడిగానే హిందువులు అనుమానిస్తున్నారు. ఈ గొడవలకి ముందున్నాడన్న ఆరోపణలు ఉన్న సల్మాన్‌ను, మరో 80 మందిని(అక్టోబర్ 23 వరకు) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 10 మంది మీద కేసులు నమోదైనాయి. కాగా గోపాల్ మిశ్రా (కాల్పులలో చనిపోయిన యువకుడు) కుటుంబాన్ని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పరామర్శించారు. ★



# జకీర్ నాయక్ మీద పాక్ క్రైస్తవుల ఫిర్యాదు

ఇస్లాం ఆధారంగా పరమత ద్వేషం రగిలిస్తూ, యువతను రెచ్చగొడుతున్న వివాదాస్పద మత ప్రబోధకుడు జకీర్ నాయక్ మీద భారతదేశంలో ఎన్నో కేసులు ఉన్నాయి. అతడు ఇతర దేశాలకి పారిపోయిన సంగతి తెలిసిందే. ఇటీవలనే పాకిస్తాన్ ప్రభుత్వం ఆహ్వానం మేరకు అక్కడికి వెళ్లి బోధనలు వినిపించాడు. ఇప్పుడు పాకిస్తాన్ క్రైస్తవులు అతడి మీద ఆ దేశ అధ్యక్షుడికి, ప్రధానికి ఫిర్యాదు చేశారు. దేశ పర్యటనలో ఉండగా క్రైస్తవుల మనోభావాలను గాయపరిచే విధంగా జకీర్ మాట్లాడాడు కాబట్టి చర్య తీసుకోవలసిందని అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారి, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లకు క్రైస్తవులు ఫిర్యాదు చేశారు. పాకిస్తాన్ ప్రభుత్వం ఆహ్వానం మేరకే అతడు ఆ దేశం వెళ్లాడు. దాదాపు నెల రోజులు ఉన్నాడు. కరాచీ, ఇస్లామాబాద్, లాహోర్‌లలో అతడి ఉపన్యాసాలు ఏర్పాటయ్యాయి. ఆ సమావేశాలలోనే అతడు వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. అందులో పెద్ద వింతేమీ లేదు. క్రైస్తవానికి వ్యతిరేకంగా జకీర్ అంత తీవ్ర వ్యాఖ్యలు చేసినప్పటికి పాకిస్తాన్ ప్రభుత్వం ఎలాంటి వివరణ ఇవ్వకపోవడం దారుణమని సైనాడ్ బిషప్ అధ్యక్షుడు, పాకిస్తాన్ చర్చి అధ్యక్షుడు రెవరెండ్ అజాద్ మార్షల్లా అధ్యక్షుడికి, ప్రధానికి చేసిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ప్రభుత్వ అతిథిగా వచ్చిన వ్యక్తి మరొక మతం మీద చేసిన వ్యాఖ్యలను ఖండించకపోవడం దారుణమని ఆయన ఆరోపించారు. క్రైస్తవుల విశ్వాసాలను జకీర్ బాహాటంగా సవాలు చేస్తూ విమర్శలకు దిగాడని బిషప్ పేర్కొన్నారు. ★



పిలుపునకు తాను కట్టుబడి ఉన్నానని క్షమాపణ చెప్పే ప్రసక్తి లేదని మొండితనం ప్రదర్శించాడు. ఎందుకంటే నేను కరుణానిధి మనుమడిని కాబట్టి అని చెబుతున్నాడు. తమ జీవితమంతా బడుగు బలహీనవర్గాల కోసమే అంటారు. మాటలే అవి అంతరంగం అంతా పెత్తందారి పోకడే. ఈ వివాదం మీద చాలా కోర్టులలో నా మీద కేసులు ఉన్నాయి. కోర్టులు నన్ను క్షమాపణలు చెప్పమంటున్నాయి. నేనెందుకు చెబుతాను. నాన్నా కరుణానిధి మనుమడా అంటున్నాడు ఉదయ.

# స్టాలిన్ అన్నది తమిళ పేరు కాదు కదా!

గంపెడేసి పిల్లల్ని కనండి అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ మధ్య ఒక పెళ్లిళ్ల కార్యక్రమంలో జంటలకి పిలుపునిచ్చారు. ప్రతి జంట కనీసం 16 మందికి తక్కువ కాకుండా పిల్లలకి జన్మనివ్వవలసిందిగా సూచించారు. ఆయన కొడుకు, సనాతన ధర్మ విరోధి ఉదయనిధి స్టాలిన్ ఇంకో సలహా జోడించాడు. పిల్లల్ని కనండి, వాళ్లకి తమిళ పేర్లే పెట్టండి. అప్పుడు మనపై హిందీని రుద్దకుండా ఉంటారు అన్నాడాయన. అతని కంటె ఘనుడు ఆచంట మల్లన్న అంటే ఇదే. అయితే పెద్ద స్టాలిన్ చాలా ఆలస్యంగా మేలుకొన్నాడని అనుకోవాలి. 2026లో జరిగే లోక్‌సభ నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణలో తమిళనాడుకు స్థానాలు తగ్గుతాయన్న ఒక అంచనా ఉంది. కానీ ఇప్పుడు పుట్టిన వాళ్లకు రెండేళ్లకో, రెండున్నరేళ్లకో ఎంకే స్టాలిన్ ఓటు హక్కు కల్పిస్తే ఆయన కోరుకున్నట్టు నియోజకవర్గాల సంఖ్య తగ్గదు.

దిండిగల్‌లో జరిగిన ఒక వివాహ కార్యక్రమంలో ఉదయనిధి తమిళనాడు మీద హిందీని రుద్దాలని ఉత్తరాది పార్టీలు ఎంత ప్రయత్నం చేసినా సాగలేదని డంబాలు పలికాడు.

వచ్చిన ఏ అవకాశాన్ని వదులుకోం అన్నట్టు ఈ పెళ్లి దగ్గరే ఉదయనిధి ఇంకో విషయం కూడా చెప్పాడు. గడచిన సెప్టెంబర్‌లో సనాతన ధర్మం నిర్మూలించాలంటూ ఇచ్చిన

మీరంతా తమిళపేర్లు పెట్టుకోమని కొత్త జంటలకి పిలుపు ఇస్తున్నారు సరే. ఇంతకీ మీరు తగిలించుకున్న స్టాలిన్ అన్న పేరు తమిళ నేల మీద పుట్టినదేనా? అని అడిగారు కేంద్రమంత్రి ఎల్. మురుగన్. స్టాలిన్ రష్యాపదం. ఉదయ సంస్కృత పదం. ముందు మీ ఇంటి నుంచి తమిళపేర్లు పెట్టుకొనే పని మొదలు పెట్టండి అని మురుగన్ చీవాట్లు పెట్టారు. ప్రతిదానికి తమిళనాడు మీద హిందీ రుద్దుతున్నారంటూ నోరెట్టుకు పడుతున్నారు. అక్కడ ఎవరూ హిందీ రుద్ద లేదు. నేర్చుకుంటామన్నవాళ్లని ఆపలేదు అని వివరణ ఇచ్చారు. సామాజిక న్యాయం గురించి ఇంత పెద్ద నోరు పెట్టుకునే మీరు పదవులన్నీ మీ ఇంట్లోనే ఎందుకు బంధించేసుకున్నారు అని కూడా మురుగన్ నిలదీశారు. నిజమే మరి! పదం చివర్న నకారపు పొల్లు ఉన్న ప్రతీది తమిళ పదం కాదు. మురుగన్ తమిళపేరు. స్టాలిన్ రష్యన్ నుంచి దిగుమతి చేసుకున్నది. ★

# క్రైస్తవ సంస్థలను క్రమబద్ధీకరించండి: మద్రాస్ హైకోర్టు



క్రైస్తవ సంస్థలను క్రమబద్ధం చేయడానికి ఒక వ్యవస్థ అవసరమేనని మద్రాస్ హైకోర్టు (మధురై బెంచ్) అభిప్రాయపడింది. అంతేకాదు, వివిధ క్రైస్తవ సంస్థలలో ఆస్తుల, నిధుల దుర్వినియోగానికి సంబంధించి కొన్ని విషయాలు ఇప్పటికే కోర్టు దృష్టికి వచ్చాయని కోర్టు తీవ్రంగానే వ్యాఖ్యానించింది. క్రమబద్ధీకరణకు వ్యవస్థల ఏర్పాటుకు సంబంధించి మీ మీ వైఖరులతో నివేదికలను సమర్పించ వలసిందిగా కేంద్ర హోంశాఖకు, తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అక్టోబర్ 23న ఇచ్చిన ఆదేశాలలో హైకోర్టు సూచించింది. హిందువులకీ, ముస్లింలకీ ఇలాంటి ధర్మాదాయ వ్యవస్థలకు సంబంధించి క్రమబద్ధీకరణకు సంస్థలు ఉన్నప్పటికీ క్రైస్తవులకు లేవని కోర్టు తెలియచేసింది. కన్యాకుమారిలోని స్కాట్ క్రిస్టియన్ కళాశాల కరస్పాండెంట్ నియామకానికి నెల నెలా జీతాల చెల్లింపు గురించి కోర్టులో దాఖలైన వ్యాజ్యంపై విచారణ జరిపి మద్రాస్ హైకోర్టు బెంచ్ ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. జస్టిస్ ఎన్ సతీశ్‌కుమార్ ఈ ఆదేశాలు ఇచ్చారు.

చర్చి ఆస్తులు, నిధులు దుర్వినియోగం కావడమే కాకుండా, వివిధ సందర్భాలలో నిర్వాహకులు తమ తమ పదవులను రక్షించుకునేందుకు కోర్టులకు ఎక్కుతూ చర్చి ధనం వినియోగిస్తున్నారని కూడా జస్టిస్ సతీశ్‌కుమార్ వ్యాఖ్యానించారు. అక్కడి పాలన వ్యవహారాల పరిశీలనకు కోర్టులు పరిపాలకులను అప్పుడప్పుడు నియమిస్తున్నప్పటికీ అదంతా తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనని, కాబట్టి శాశ్వత మైన, చట్టబద్ధమైన వ్యవస్థలు అవసరమని కోర్టు అభిప్రాయపడింది. క్రైస్తవ సంస్థలు జవాబు దారీతనంతో ఉండేలా చూడవలసి ఉంటుందని కూడా తేల్చి చెప్పింది. ★



# కళల మణి

రేకందార్. తెలుగువారిలో ఒక ఇంటి పేరు.

ప్రత్యేకించి, 'సురభి' ఉమ్మడి నట కుటుంబంలో కీలక పాత్రధారులు. సురభి అంటేనే – అందచందాలు, సద్గుణ సంపదలు, గుబాళింపులు.

ఆ పేరు వినగానే నాటక సమాజం గుర్తుకొస్తుంది.

సారస్వత సంస్థాగత మాధుర్యం మన మదిని తాకుతుంది.

పెద్ద బాలశిక్ష సైతం మనందరి ఎదురుగా కనిపిస్తుంది.

అభిమతాల్ని నెరవేర్చే వరప్రసాదినిగా ప్రత్యక్షమవుతుంది.

ఆధ్యాత్మికత నిండి ఉన్న 'సురభి'లోని సభ్యుల్లో కొందరు రేకందార్ వారు.


సుభద్రమ్మ, గుణవతి, ఉత్తరమ్మ, అనసూయాదేవి. ఇంకా మరెందరో కళారంగ మహిళా మణిదీపికలు.

విఖ్యాత ప్రదర్శక సంస్థగా పేరొందిన సురభిది దరిదాపు ఒకటిన్నర శతాబ్దాకాల ఘనచరిత. మొదట 'శారదా వినోదిని.'రంగస్థలాన స్త్రీ పాత్రలకు సమధిక ప్రాధాన్యత కలిగించిన ప్రధానబృందం, కుటుంబమే బృందం. వేదికే వారందరి కళాప్రదర్శక క్షేత్రం,కాలక్రమంలో పలు బృందాలు రూపొందాయి... విస్తరించాయి. తదుపరి పరిణామాలకూ నిదర్శనమయ్యాయి. నాటక కళాసంఘం. అందులో బృందాల వారీ అభినయ కౌశలం.

నాట్యమండలిలో బృందస్థాపక బాధ్యురాలు సుభద్రమ్మ. ప్రదర్శనలతోపాటు రంగస్థల అలంకరణ, దర్శకత్వం, ఇతర బాధ్యతల్లోనూ ఆరితేరిన కుటుంబ సభ్యులు అనేకులు.

సంస్థ సప్తతి ఉత్సవ వేళ, 1960  నవంబరు తొలిపక్షంలో ప్రత్యేక సంచిక ఆవిష్కరణ.   భారత ఉపరాష్ట్రపతి హోదాలో సర్వేపల్లి రాధాకృష్ణన్ అక్షరాశీస్సులు  అందించారు.  నాట్య నాటక ప్రయోగం ఓ యోగం, యాగం అని అభివర్ణించారు భాషావేత్త జమ్ములమడక మాధవరాయశర్మ. సురభి సుస్థిరంగా భాసించాలన్నది నాటి ఆకాశవాణి నుంచి స్థానం నరసింహారావు ఆత్మీయ కామన.

స్త్రీలె స్త్రీ పాత్రములను ధరించిరేని
కళకు మెరుగను రంగ సంస్కరణమునకు
తొలి పునాదిని మునుపు వేయగలిగిరనెడి
అలఘుతర కీర్తి సురభివారలదె కాదె.... అనీ ప్రముఖుల ప్రశంస.



'సురభి'లో విశిష్ట పరిగణన ఉన్న అనసూయాదేవి పుట్టింది నవంబరు 9న. అది 1936వ సంవత్సరం. స్వస్థలం ఏలూరు ప్రాంతం. తండ్రి ఉత్తమరావు, తల్లి సావిత్రి.

బాల్యంలోనే రంగప్రవేశం చేసిన అనసూయ. మహర్షి భార్య అనసూయగా పాత్రలో జీవించారు.ద్రౌపది, రాధ, రుక్మిణి, సత్యభామ, యశోద, సుభద్ర పాత్రలను ధరించి మెప్పించారు. నటవైవిధ్యం అడుగడుగునా కనబరిచారు. తాను ఏ పాత్ర ధరించినా, మూల స్వభావం తెలుసుకుని మరీ కర్తవ్య నిర్వహణ చేశారు.

అర్జునుని భార్య చిత్రాంగదగా నటనలో రాణించారామె. పలు రసాలనీ పండించారు. వాచికం, ఆంగికం, అభినయంలో సాటిలేరనిపించుకున్నారు.ఎంత ఉత్తమ నటనం అంటే, 'కళాదీపిక'గా బిరుదు పొందేంత!

గుణవతిది విశాఖ పరిసర ప్రాంతం. ఆ ఊరిపేరు నర్సింగరావుపల్లి, బాలనటిగా రంగస్థల ప్రవేశం. ఒకే నాటకంలో మూడు పాత్రలు వేసిన దక్షురాలు. సతీఅనసూయ, బాలనాగమ్మ, లవకుశ చూస్తే ఆమె నటవైదుష్యం ప్రస్ఫుటమ వుతుంది. మరింత విలక్షణం ఏమిటంటే – విశ్వనాథ విజయంలో ఆమెది శ్రీకృష్ణదేవరాయలు పాత్ర.

మరికొన్ని నాటకాలను నాట్యమండలి ఫ్రాన్స్‌లో ప్రదర్శించింది. అక్కడి అంతర్జాతీయ మహోత్సవాలకు దాదాపు యాభైమందితో కూడిన సురభి నటీనట బృందం వెళ్లి వచ్చింది.

ఉత్తరమ్మది విజయవాడ పరిసర ప్రాంతాల్లోని వలపర్ల గ్రామం.అనేక సంవత్సరాలుగా ప్రదర్శనలిచ్చిన నటీమణి తాను. సావిత్రి, కాంతామతి, గంగావతరణం, బాలనాగమ్మలలో తనదే ప్రధానపాత్ర. దశావతారాలులో అయితే రెండు విభిన్న పాత్రలు. సీతగా, మోహినిగా కూడా! 'లవకుశ'లో కుశుడు, రామాంజనేయ యుద్ధంలో నారదుడు తానే.

రంగస్థలం మీదనే కాదు, హరికథా వేదికపైనా నిష్ణాతురాలు. 'మాయా బజారు'లో శశిరేఖ గుర్తుందా? ఆ రేఖ ఈ ఉత్తరే! శశిరేఖ పరిణయం ఒక పద్య కావ్యం. వావిళ్లవారు ఆనాడు ప్రచురించారు. అక్షరాల్లో, నటనలోనూ జనాదరణ పొందింది ఈ పాత్ర పరిపోషణం. ఇందులో ఉత్తరమ్మది ధాటి



# దీపికలు

నటన.

నాటకరంగ స్మృతులు అనేకానేకం. అనుభవాలను కలబోసి, అజరామర పాత్రలను సృష్టించినవారున్నారు. నాట్యం/ నటన ఎప్పుడు పుట్టిందో కానీ; ఆదిదేవుని ఢమరక నాదంతో అమ్మవారి చరణ మంజీరనాదానికి శ్రుతి కలిపిందన్నది 'ధారా' వారి ప్రశంస.

'నా పాత్రలను నేను ఓపినంత వరకు ప్రత్యక్షం చేసుకుని ఆరాధిస్తాను' అని పలికిన వారున్నారు. ఫలితం ప్రేక్షకలోకానిదే అని వారి నిశ్చిత అభిప్రాయం. అంటే – పొగడ్తలకు పొంగని, విమర్శలకు కుంగని తత్వం. ఇదే కదా క్రియాశీలత!

యాగపుత్రిక ద్రౌపది. సదా ఆత్మ పరిశీలకురాలు, ప్రకృతి తత్వప్రతీక రాధాదేవి. అవతార రూపధారిణి, సంప్రదాయ స్వరూపిణి రుక్మిణి. నిబద్ధతకు ఉదాహరణ ఆత్మవిశ్వాసి సత్యభామ. విశేషపాత్ర. ఆమె భావనల సున్నిత, తీవ్రతలను ప్రతిఫలింపచేసిన రంగస్థల నటీమణులు వీరంతా. భావాలను తేటతెల్లం చేయగలిగిన విదుషీమణులు. అందుకే సురభి సంస్థకు ఇంతటి ప్రాధాన్యరీతి.

**కల్యాణ లావణ్య కమనీయకాంతులు**
**చిమ్మె విశ్వము మా శిల్పలక్ష్మి**
**కళకళలాడి కొండలకులం గుల్కెను**
**సౌభాగ్యరేఖ మా జయపతాక**
**ఖండఖండాల ప్రఖ్యాతినార్జించె వి**
**నిర్మలంబైన మా ధర్మదీక్ష**
**సస్య సంపదలతో సౌందర్యమలరించి**
**సంతోష మొసగె మా సౌఖ్యసీమ**
**తెలుగు వెలుగులు దశదిశల్ తేజరిల్లె!..**
**అనేలా నటప్రతిభను వెలయించారు**
**ఈ రంగస్థల నటవనితలంతా!**
**నటన అనేది నిమగ్నపద్ధతి**
**కళారూపానికి ప్రత్యక్ష వేదిక.**

ఇందులో నైపుణ్యం ఒక్కటే సరిపోదు. భావోద్విగ్నత వెల్లివిరియాలి. ముఖ కవళికలు తేటతెల్లం కావాలి. నట ప్రతిభ, ప్రభ జతకూడితేనే ప్రేక్షక శ్రోతులకు స్పందన. అందుకే సురభి సమాజం సహజత్వానికే ప్రాధాన్యమిస్తూ వచ్చింది, వస్తోంది.

**పతికి హితవు నేర్పి బవరమ్మునకు పంపు**
**మాంచాల మగువలోని కృతనిశ్చయం**
**కరవాలమూని సంగరరంగమున కేగు**
**నాగమ్మలోని ఆంధ్రనారీ తత్వం**
**ఆత్మగౌరవ పరిరక్షణకు ప్రాణమర్పించిన**
**మల్లమ్మ ధీశక్తి, యుక్తి సమ్మిశ్రితం**

ఇటువంటివాటినీ రంగస్థల వేదిక మీద ప్రతిష్ఠించిన ఘనత నటీమణులకు పుష్కలంగా ఉంది. వీరందరికీ నాటక ప్రదర్శనే జీవిత సర్వస్వం. 1900 ప్రాంతంలోనే సురభి నాటక ప్రదర్శనలనేకం తెలుగువారిని అలరించాయి. ప్రత్యేక రంగస్థల వేదికలు ఏర్పాటయ్యాయి. నగరాలు ప్రదర్శన క్షేత్రాలుగా మారి, రసహృదయుల అభిమాన ఆదరణలను సొంతం చేసుకున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, దేశంలోని ఇంకా అనేక ప్రాంతాలకు సురభి ప్రదర్శనలు విస్తరించాయి.

దేశ విదేశాల్లో ప్రదర్శనలయ్యాయి. తొలినుంచి ఇప్పటి వరకు కొనసాగిన నట జీవనయానంలో మహిళలది విశిష్ట విశేష పాత్ర. పౌరాణిక, జానపద, సాంఘిక పాత్రధారణలో తమదైన ప్రత్యేకతను ఎవరికివారు కనబరుస్తూ వచ్చారు. నటకళను జీవిత సర్వస్వంగా, సమస్తంగా మలుచుకున్నారు.

భారతీయ కళావేదికపైన స్త్రీలు రికార్డులు సృష్టించారు. సృజనతో ఖండాంతర ఖ్యాతిని సముపార్జించుకున్నారు. ఎన్ని భావవైరుధ్యాలను పలికించారో ఊహకైనా అందదు ఇప్పటి వారికి!

ఉదాహరణకు : మగువ మాంచాల.

**భర్త బాలచంద్రునికి కదనకర్తవ్య హితబోధ చేస్తోంది ఆమె.**
**'ఎందరు రాజులీ ధరణినేలి తరించిరి–సౌఖ్య సంపదల్**
**పొందిరి మూటగట్టుకుని పోయిరెవారు ప్రతిష్ఠ ఒక్కటే**
**చెందును శూరమూర్తుల ప్రసిద్ధులనెందు యశస్సుకై రణ**

మ్మందున ముందుకేగి జయ హారతులందుదు రాజశేఖరా!

ఇందులో... వీర, త్యాగ, భక్తి చింతనలన్నీ నిబిడీకృతం. దీన్ని ప్రతిఫలింప చేయడంలో మహిళా నటుల కృషి అనన్య సామాన్యం.

నటరంగానికి ఎనలేని కీర్తి తెచ్చిన సుభద్రమ్మ, ఉత్తరమ్మ ఆయా పాత్రల పరిపోషణంతో చిరయశస్సులయ్యారు.

గుణపతి, అనసూయాదేవి సాత్విక పాత్రధారణంతో అసమాన ప్రఖ్యాతిని సంపదగా అందుకొన్నారు. వీరందరిదీ ఒకే ఇంటిపేరు. రేకందార్‌గా ప్రశస్తి వహించిన కళాకారిణులు. సురభికి మరెంతో వన్నెతెచ్చినవారు.

వీరిని తలచుకోవడం, నటరీతిని తలవులోనికి తెచ్చుకోవడం, చేసిన సేవను స్మరించి గౌరవించుకోవడం నటకళామతల్లిని అర్చించుకోవడమే.

**ఆనాటి ఆ కళాపాండితి, నటప్రశస్తి**
**ఈనాటికీ స్మరణీయం, అభినందనీయం.**
**ఎన్నెన్నో ప్రతికూలతలను అధిగమించి,**
**కళాసేవే పరమార్థంగా భావించి,**
**వీరంతా సాగించింది కలార్చన.**
**అందుకే వందనాలందించాలి అందరూ!**

సంగీత, సాహిత్య శిల్ప, చిత్రలేఖనాది కళారూపాల సమాహారమే నాటక రంగం. ఇందులో అతివలు నిర్వర్తించిన పాత్ర అన్నివిధాలా స్ఫూర్తిమంతం! ★



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

కథ

# ఓ అమ్మాయి

అమ్మా,

ఆశ్చర్యంగా ఉంది కదూ! ఇదేమిటీ, ఫోన్ చేయకుండా, పాతకాలంలోలా ఈ ఉత్తరం రాయటం అని. ఏం చేయాలి, నీతో చాలా చెప్పాలని ఉంది. ఫోన్ చేస్తే గంటపైనే పడుతుంది. ఈ గంటలో నా పనులు ఎన్నో ఆగిపోతాయి. అందుకే వీలైనప్పుడు వీలైనట్లు, నాలుగు లైన్లు రాస్తూ, నెల రోజులు కష్టపడి ఈ ఉత్తరం పూర్తి చేసి నీకు పోస్ట్ చేస్తున్నాను.

మాట్లాడిన మాటలు మరుక్షణమే మర్చిపోవచ్చు కానీ అక్షర రూపంలో ఉండే నా మనసులోని ఈ మాటలు శాశ్వతంగా ఉండిపోతాయి కదా! విసుగు చెందకుండా చివరి వరకు చదువు.

సరే, ఇక అసలు విషయానికి వస్తాను. అమ్మా! కిందటి నెలలో నేను నీ దగ్గరికి వచ్చినప్పుడు, అదే సమయంలో మామయ్య కూడా మన ఇంటికి వచ్చాడు. అప్పుడు మీ ఇద్దరూ కలిసి, మీ బాల్యం గురించి ఎంతోసేపు మాట్లాడుకున్నారు. మీరు చేసిన చిలిపి పనులు, మీరు ఆడుకున్న ఆటలు, మీరు చెప్పుకున్న కథలు, కబుర్లు, ఇద్దరు కలిసి ఒకే కంచంలో భోజనం చేయడం, ఎక్కడికి వెళ్లినా ఇద్దరు కలిసి వెళ్లడం, ఇలా ఎన్నో కబుర్లు చెప్పుకుంటూ ఆ మధురస్మృతులు నెమరు వేసుకుంటూ, ఎంత ఉత్సాహంగా ఆ రోజు గడిపారు.

ఆనాటి మీ కబుర్లు ఒక ఎనర్జీ బూస్ట్‌లాగా నీకు వారం రోజులు పని చేసింది. రెండు రోజులు మాతో కూడా ఆనందంగా, ఉత్సాహంగా ఆ కబుర్లు చెపుతూనే ఉన్నావు. అది చూస్తే నా మనసు ఏదోలా అయిపోయింది. అక్కడి నుంచి మా ఇంటికి వచ్చాను. ఎందుకో ఆఫీసుకు కూడా వెళ్లాలి అనిపించక, ఆ రోజుకి వర్క్ ఫ్రం హోం పర్మిషన్ తీసుకుని ఇంట్లోనే ఉన్నాను.

మా అత్తగారు తన ఫ్రెండ్స్‌ని ఇంటికి ఆహ్వానించారు. వాళ్లు అంతా సామాజిక సేవా రంగంలో ఉన్నవాళ్లు అని నీకు తెలుసు కదా! వాళ్లందరూ ఆ మర్నాడు జరగబోయే ఒక కార్యక్రమంలో ప్రసంగించడానికి కావలసిన మ్యాటర్‌ని డిస్కస్ చేసుకుంటున్నారు. నేను నా రూములో నుంచి వాళ్ల మాటలు వింటున్నాను.

నేటి యువత ఎంత బాధ్యతారాహిత్యంగా ఉంటున్నారు, పెద్దల పట్ల అవిధేయత కలిగి ఉండటం, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు ఎలా సన్నగిల్లుతూన్నాయి, భావాలలో గానీ, ఆర్థిక విషయాల్లో గానీ ఏమాత్రం షేరింగ్ లేకపోవటం,విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టటం, పెళ్లయిన ఆడపిల్లలు కనీసం వంట కూడా చేసుకోలేకపోవడం, కొత్తగా పెళ్లయిన జంటలు ఏడాది లోపల విడిపోవడం...ఇలా నేటి యువతరం గురించి మాట్లాడుకుని, వీటిని ఎలా పోగొట్టాలి, దానికి వాళ్ళకి కౌన్సెలింగ్ ఇప్పించటం ఇలా చాలా సేపు చర్చించుకున్నారు.

అసలే మీ అన్నాచెల్లెళ్ల మాటలతో మూడ్ ఆఫ్ అయి ఉన్న నా మనసు, వాళ్ల మాటలతో మరింత కలత చెందింది .

అమ్మా!, అసలు మా యువత ఇలా తయారు కావడానికి కారణం ఎవరు? మా చిన్నప్పటి నుంచి మమ్మల్ని చదువులు తప్ప రెండో ప్రపంచం లేకుండా పెంచారు మీరు. అది మా మీద ప్రేమ, అభిమానంతో పాటు, వేరే వాళ్లతో పోటీ కోసం, అందరిలోనూ మీరు గొప్పగా ఉండాలి, మీ పిల్లల్ని బాగా చదివించారు అని అందరూ మిమ్మల్ని గొప్పగా చెప్పుకోవటానికేగా?

అమ్మా! నీకు కోపం రావచ్చు, 'మేము మీ మీద ప్రేమతో మీ కోసం మా జీవితాలని త్యాగం చేస్తే నువ్వేంటి ఇలా మా గొప్పల కోసం



# అంతరంగం

పి.వి.ఎస్ కృష్ణకుమారి



మిమ్మల్ని కష్ట పెట్టాము అని మాట్లాడుతున్నావు' అనుకోవచ్చు.

కానీ నేను చెప్పేది జాగ్రత్తగా వినమ్మా. నాకు మూడో సంవత్సరం రాగానే స్కూల్లో వేశారు. దానికి కారణం ఇంట్లో ఉంటే నేను అల్లరిచేస్తున్నాను, తమ్ముడుతో అస్తమానం గొడవ పడుతున్నాను అని. అమ్మా, ఇప్పుడు మీరే, పిల్లలు ఎంత బాగా అల్లరి చేస్తే అంత గొప్ప, అంత ఆరోగ్యం అని అంటున్నారు. మీరు మీ చిన్నప్పుడు ఇంతకంటే ఎక్కువ అల్లరి చేసే వాళ్లని మీరు చెప్పుకోవటం లేదా! చెట్లు కొమ్మలు ఎక్కటం, మట్టిలో ఆడటం ఇవన్నీ మీరు ఇప్పుడు చాలా తీపి జ్ఞాపకాలుగా చెప్పుకుంటున్నారు.

కానీ, మాకు అలాంటి తీపి గురుతులు ఏమున్నాయమ్మా? మా బాల్యంలో మీరేం చేశారు? నాలుగు గోడల మధ్య, ఫ్యాన్ల కింద ఇంకా కాస్త ముందుకు వెళితే, ఏసీ రూముల్లోనూ పడేసి అదే మా ప్రపంచం అన్నట్లు చెప్పారు.

ఇంట్లో మాట వినడం లేదు అని చెప్పి, స్కూల్ నుంచి రాగానే మళ్లీ ట్యూషన్. మేము సిక్త్ క్లాస్ కొచ్చినప్పటి నుంచి, దగ్గర బంధువుల ఇళ్లకు కూడా మమ్మల్ని తీసికెళ్లటం మానేసారు. పోనీ వేసవి సెలవుల్లో ఎక్కడికయినా వెళ్దాం అనుకుంటే, సమ్మర్ క్యాంపు అంటూ సంగీతం, డాన్స్, కరాటే ఇలా ఏవేవో మాకు అంటగట్టారు. అమ్మా, ఒక్క నెల రోజుల్లో ఇవి మాకు వస్తాయా? ఇంట్లో అల్లరి చేస్తామని మమ్మల్ని వాటిలో పడేసేవాళ్లు. ఇలాంటి పరిస్థితులు మేము మాకు ఉన్న ఒక్క తోబుట్టువుతో ఆడుకునే అవకాశం ఎక్కడుండేది? మా మధ్య ప్రేమానురాగాలు ఇనుమడించడానికి అవకాశాలు ఎంతో తక్కువ ఉండేవి కదా!

ఇక మేము టెన్త్ క్లాస్‌కి వస్తున్నాము అంటే మేము పాఠశాల ఖైదీల కింద లెక్క. తొమ్మిదవ తరగతి పరీక్షలు రాయగానే మొదలయ్యేవి మా బాధలు. రెమిడీయల్ క్లాసెస్, ఆ టెస్టులు, ఈ టెస్టులు అంటూ పొద్దున పూట ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది దాకా రోజంతా స్కూల్లోనే. మళ్లీ నాలుగు గంటలకు సరిపడా హోంవర్క్ తో, ఇంటికి వచ్చి బ్రహ్మరాత లాగా రాస్తూనే ఉండేవాళ్లం.

మార్కులు తగ్గితే అది మీకు అవమానం. పక్క పిల్లలతో పోటీ. ఇంట్లో తోబుట్టువులతో పోటీ.

"చూడు మీ అక్కకి నీకంటే ఎక్కువ మార్కులు వచ్చినయి. నీకు ఎందుకు ఇంత తక్కువ వచ్చాయి?"

"మన పక్కింటి అమ్మాయికి టెన్త్‌లో ఎంత మంచి మార్కులు వచ్చాయో! నీవు కూడా అలాగే తెచ్చుకోవాలి"

"మా కొలీగ్ వాళ్ల అబ్బాయికి అయితే అన్ని సబ్జెక్టులలో నూటికి నూరు మార్కులు. స్టేట్ ర్యాంక్ తెచ్చుకున్నాడు. నీవు ఉన్నావు దేనికి? వెనకబడి తరుముతుంటే నిక్కీ, నీలిగి, తొంభై శాతం మార్కులు తెచ్చుకున్నావ్"

ఇలాంటి పరిస్థితుల్లో మాకు తెలియకుండానే మాలో స్నేహితులు, తోబుట్టువుల మధ్య ప్రేమానురాగాల కంటే ఒక అనవసరమైన పోటీ తత్వాన్ని మీరే పెంచారు.

ఎదుగుతున్న కొద్దీ ఈ పోటీ పెరిగిపోయి, ఈర్ష్యగా మారి, తోబుట్టువుల మధ్య ఒక పెద్ద అగాధాన్ని సృష్టించిన విషయం మీరు ఎందుకు అర్థం చేసుకోలేకపోయారు?

ఏదైనా ఒక విషయంలో ఓటమి ఎదురైతే, అది అవమానంగా భావించి, ఆత్మహత్యకు పాల్పడుతున్నారు కదా!

ఈలోపల మేము ఫరదర్ ఏం చదవాలో కూడా మీరే నిర్ణయిస్తారు. కామన్ కోర్స్ ఇంజనీరింగ్. అలా ఒక మరమనుషుల్లాగా మేము చదువులు పూర్తి చేస్తున్నాము.

అప్పటికి మా మనసులు, రెండో ధ్యాస లేకుండా చదువు, విదేశీవిద్య, మంచి జీతం, 'బంగారు భవిష్యత్తు ..వీటి మీద స్థిరంగా నిలిచి పోయింది.

కొంతమందికి ఇంజనీరింగ్ పూర్తి కాగానే క్యాంపస్ సెలక్షన్‌లో మంచి ఉద్యోగం వస్తే, మరికొందరు ఉన్నత విద్య కోసం విదేశాలకు పరుగెడుతున్నారు. దాంతో తల్లిదండ్రుల కలలు పూర్తి అవుతాయి.

"మా అమ్మాయికి క్యాంపస్‌లో మంచి ప్యాకేజీతో పెద్ద ఎమ్. ఎన్. సీ.లో జాబ్ వచ్చింది" అని ఒకరి గొప్పలు.

"అవునా, మా అబ్బాయికి వచ్చింది కానీ, పై చదువుల కోసం అమెరికా వెళుతున్నాడు. అందుకే ఆ ఉద్యోగం వదులు కున్నాడు" అని మరొకరి అతిశయపు మాటలు.

అమ్మా, పిల్లల అభివృద్ధి చూసి తల్లిదండ్రులు గర్వపడటం సహజం కానీ, ఆ అభివృద్ధి గురించి అందరిలో విపరీతమైన గొప్పలు చెప్పుకోవటం, ఏ కారణం చేతనైనా ఈ రెండూ రానివారిని ఎందుకూ పనికిరాని వారిగా మాట్లాడటం సర్వసాధారణం అయిపోయింది.

ఇక మా సంగతి కొస్తే, అదిగో, సరిగ్గా అప్పుడే మాకు అందరికీ ఒక్కసారిగా ఒక పెద్ద జైలు నుంచి విడుదల అయిన అనుభూతి కలుగుతుంది. రెక్కలు వచ్చిన విహంగాల వలె మనసు గాలిలో తేలిపోతూ ఉంటుంది.

చేతినిండా డబ్బు, తల్లితండ్రుల ఆంక్షలు ఉండవు. చుట్టూ స్నేహితులు. వాళ్లు కూడా 'మా పిల్లలు పెద్దవాళ్లు అయ్యారు, వాళ్లకు అన్నీ తెలుసు' అనే భ్రమలోకి వెళ్లి నిశ్చింతగా ఉంటారు.

బాల్యంలో మేము పోగొట్టుకున్న ఆనందాలు ఇప్పుడు అనుభవించాలి అనుకుంటాము. కానీ ఆడుతూ పాడుతూ తిరిగే వయసు కాదుకదా! ఏదో విధంగా జీవితాన్ని ఎంజాయ్ చేయాలి. అదే మా ధ్యాస అంతా.

మా కోరికలకి తగ్గట్టుగానే రకరకాల మాల్స్, షాపింగులు కళ్ల ముందు కనపడుతూ ఉంటాయి. చుట్టూ స్నేహితులు. వాళ్లతో ఎంజాయ్‌మెంట్స్.

మమ్మల్ని ఇంత ప్రయోజకుల్ని చేసిన తల్లిదండ్రులని రకరకాల బహుమతులతో ఆనందపరుస్తుంటాము. రెస్టారెంట్లు, సినిమాలు, విహార యాత్రలు . ఈ లోపు ఎవరైనా సత్తెకాలపు వాళ్లు...

"మీ అమ్మాయికి పెళ్లి చేయరా" అని అడిగితే, "ఉద్యోగంలో చేరి రెండేళ్లే కదండీ. ఇంకా చిన్న పిల్లే. కాస్త జీవితాన్ని ఎంజాయ్ చేయనివ్వండి. ఇప్పుడే ఈ సంసార జంఝాటం ఎందుకూ'' అంటారు.

అబ్బాయిలు అయితే "మా వాడు ఇంకా సెటిల్ అవలేదండీ. మంచి ప్యాకేజీ వచ్చాక చేస్తాం. ఈ కాలం పిల్లలు దేనికీ ఎడ్జస్ట్ కాలేరు. కారు, ఇల్లు, ఫర్నిచర్, వీకెండ్స్ ప్రోగ్రామ్స్ అన్నీ కావాలి" అంటూ, మాకు లేని భావాలు మీరే ఊహించుకుని ఒక స్టేట్మెంట్ ఇస్తారు.

నలుగురు పెద్దవాళ్లు కలిస్తే తమ పిల్లల గొప్పల గురించి మాట్లాడుకుంటారు. అలా మమ్మల్ని పొగడ్తలతో ముంచెత్తి, ఇక మాకే అన్నీ తెలుసు అనే భ్రమలోకి మమ్మల్ని మీరే నెట్టేస్తారు.

ఇప్పుడే పెళ్లి చేసుకుంటే జీవితాన్ని ఎంజాయ్ చేయలేము అనే భ్రమలో మమ్మల్ని ఉంచి, ముప్ఫై సంవత్సరాలకి దగ్గర పడుతుండగా పెళ్లి గురించి ఆలోచన చేస్తారు. అప్పటికి నిజంగానే మా మైండ్ సెట్ మీరు ట్యూన్ చేసిన విధంగానే తయారయి ఉంటుంది.

బాల్యంలో మేము పోగొట్టుకున్న ఆనందాలు ఇప్పుడు అనుభవించాలి అనుకుంటాము. కానీ ఆడుతూ పాడుతూ తిరిగే వయసు కాదుకదా! ఏదో విధంగా జీవితాన్ని ఎంజాయ్ చేయాలి. అదే మా ధ్యాస అంతా. మా కోరికలకి తగ్గట్టుగానే రకరకాల మాల్స్, షాపింగులు కళ్ల ముందు కనపడుతూ ఉంటాయి. చుట్టూ స్నేహితులు. వాళ్లతో ఎంజాయ్‌మెంట్స్.



ఏ సంబంధం నచ్చదు. నాగరికత ముసుగులో కొంత ముందుకి వెళ్లిన వాళ్లు, పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడిన వాళ్లు సహజీవనం చేసి ఒకరినొకరు అర్థం చేసుకుని అప్పుడు పెళ్లి గురించి ఆలోచిస్తున్నారు.

అప్పుడు కళ్లు తెరుస్తున్నారు మీరు. తప్పు అని చెప్పబోతారు. కానీ 'అన్నీ తెలిసిన మేము' మీ మాట వినం.

ముప్పై సంవత్సరాలు దగ్గర పడుతుండగా లేదా దాటాక పెళ్లిళ్లు అవుతాయి. ఇక అదొక ప్రహసనం. అతి గారాబంతో చదువు కోవటం తప్పితే మరొక పని తెలియని, ఒకే వాతావరణంలో, స్పూన్ ఫీడింగ్‌కి అలవాటు పడి పెరిగిన ఇద్దరు పెళ్లి పేరుతో ఒకటవుతాము. పని రాదు, వంట అసలే రాదు. ఉదయమే నిద్ర లేవటం అనే కాన్సెప్టే ఉండదు. 'ఇద్దరం సమానమే 'అనే 'సమానత్వంపు' గొడవలు మొదలవుతాయి.

అప్పుడు ఎంట్రీ ఇస్తారు మళ్లీ తల్లిదండ్రులు. కొంతమంది సర్దిచెప్పాలి అని ప్రయత్నిస్తారు. మరికొందరు ఇంకా వాస్తవం లోకి రారు.

"మా వాడు మగాడు. వాడు వంట చేయటం ఏమిటీ" అని ఒకరు.

"మా అమ్మాయిని గారాబంగా పెంచాము. అది కూడా తక్కువేం సంపాదించటం లేదు'' అని ఇంకొకరు.

ఈ క్రమంలో మీ భార్యాభర్తల మధ్య గొడవలు మొదలవుతాయి. నీవల్లే వాళ్లు పాడైపోయారు అని మీలో మీరు కొట్లాటలు. మమ్మల్ని సరిదిద్దాల్సిన మీరే గొడవలు పడుతుంటారు.

ఎలాగో కాంప్రమైజ్ అయ్యి నిజమైన జీవితం మొదలు పెట్టేసరికి నడి వయసుకు దగ్గర పడుతున్నాము.

అమ్మా, నిజమైన భయం అప్పుడు మొదలవుతుంది. మాకు పిల్లలు పుడతారు. వాళ్ల భవిష్యత్తు కోసం ఇద్దరం ఉద్యోగం చేయాలి. మా ఉద్యోగాలు తుమ్మితే ఊడే ముక్కులాంటివి. ఉద్యోగ భద్రత ఉండదు. టెన్షన్‌తో కూడిన మా ఉద్యోగాలు, మీద పడుతున్న వయసు, చిన్నతనంలోనే ఆరోగ్య సమస్యలు వీటి మధ్య మా బతుకులు సాగుతున్నాయి.

అప్పటికి మీరు పెద్దవాళ్లు అయిపోతారు. "చేయవలసినదంతా చేసాం ఇక మాకు ఓపిక లేదు" అంటారు. ఈ మానసిక సమస్యలు తోబుట్టువులతో చెప్పాలంటే సిగ్గు. ఎగతాళి చేస్తారేమో అని భయం. అందుకే ఒకరి పరిస్థితి మరొకరికి చెప్పుకోము.

ఒకవేళ ఎవరైనా మంచి సలహా ఇచ్చినా పాజిటివ్‌గా స్వీకరించే స్థాయి దాటిపోయాము.

ఇంత జరిగాక ఇప్పుడు మీరు కళ్లు తెరుస్తున్నారు. మీలో అంతర్మథనం మొదలవుతున్నది. తల్లిదండ్రులు పిల్లల్ని స్నేహితుల్లా చూడాలి అని మీరు ఇచ్చిన స్వేచ్ఛని వాళ్లు దుర్వినియోగం చేస్తూ, గౌరవం లేకుండా మాట్లాడుతుంటే ఎవరికీ చెప్పుకోలేక మీలో మీరే కుమిలిపోయే దుస్థితికి వచ్చారు కదమ్మా మీ వయసు వాళ్లందరూ. మీ తప్పులు కప్పి పుచ్చుకోవడానికి సభలు, సమావేశాలు నిర్వహించి మమ్మల్ని 'బాగుచేయాలి' అనుకోవటం ఎంత హాస్యాస్పదం!

స్కూల్ ఫస్ట్ రావాలి అని చెప్పినట్లే, పెళ్లయ్యాక నీ కుటుంబంలో బెస్ట్ అనిపించుకోవాలి అని ఆనాడు మాకు చెప్పలేదు. పోటీ కాదు ప్రేమతత్వం అలవరచుకో అని ఎందుకు చెప్పలేదు. కాలేజీ కొచ్చాక కొంతమంది స్టూడెంట్స్ టీజ్ చేస్తున్నారు అని చెపితే సర్దుకుపోమ్మా అనేదానివి. అలాంటి సర్దుబాటు అత్తగారింట్లో చేసుకోమని చెప్పేవాళ్లు లేరు. ఇంగ్లీష్ మీడియంలో చదివిన మాకు ఐకమత్యమే బలం, పెద్దల్ని గౌరవించు లాంటి సూక్తులకి అర్థం తెలియకుండా పోయింది.

నేను ఏదైతే కోరుకుంటున్నానో ఆ వాతావరణం నా పిల్లలకి ఇవ్వాలని కలలు కంటున్నాను. నన్ను ఆశీర్వదించు.

అమ్మా, చివరిగా ఒక మాట. మీకు మా మీద ప్రేమ లేదు అని అనను. మీరందరూ పిల్లల్ని ఎంతో ప్రేమించారు. వాళ్లకు సాటి మరెవరూ ఉండకూడదు అనేటంత గొప్పగా ప్రేమించారు. ఆ అతి ధోరణే ఈనాటి ఈ పరిస్థితి.

మరొక చిన్న కానుక నీకు ఇస్తూ, ఈ ఉత్తరం ముగిస్తున్నాను. చిన్న గొడవతో, అహంకారానికి పోయి గత కొంత కాలంగా ఎడమొహం పెడమొహంగా ఉన్న నేను, అక్కయ్యతో ఈ రోజే ఫోన్ చేసి మాట్లాడాను. మీ అన్నాచెల్లెల్ల అనుబంధం చూశాక, "తగ్గిన వాళ్లు ఎప్పుడూ తక్కువ కాదు" అని నీవు నిరంతరం చెప్పే మాట గుర్తు పెట్టుకుని అక్కకి ఫోన్ చేసాను. ఇప్పుడు నా మనసు ప్రశాంతంగా, ఆనందంగా ఉంది. నీకు కూడా ఆనందమే కదా!

ఇక ఉంటాను.

నీ ప్రియమైన కూతురు,

స్వప్నప్రియ.

★

తెలుగు రాష్ట్రాల యువగ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరగేసి అరుదైన ఘనత సాధించాడు. 2800 పాయింట్ల ఎలో రేటింగ్ సాధించిన భారత రెండవ, ప్రపంచ 16వ గ్రాండ్ మాస్టర్‌గా చరిత్ర సృష్టించాడు.



# నాడు ఆనంద్...నేడు అర్జున్ !

భారత చదరంగ చరిత్రలో ఐదుసార్లు విశ్వవిజేత విశ్వనాథన్ ఆనంద్ శకం ముగియటంతోనే పలువురు యువగ్రాండ్ మాస్టర్ల శకానికి తెరలేచింది. ఆనంద్‌కు తామే తగిన వారసులమంటూ తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన నలుగురు కుర్రగ్రాండ్ మాస్టర్లు (అర్జున్ ఇరగేసి, గుకేశ్, ప్రజ్ఞానంద్, విదిత్ గుజరాతీ) తెరమీదకు వచ్చారు. 21-23 సంవత్సరాల మధ్య వయసు కలిగిన ఈ ఆటగాళ్లు ఒకరిని మించి ఒకరు అన్నట్లుగా ఆడుతూ భారత చదరంగాన్ని మాత్రమే కాదు...విశ్వ చదరంగాన్ని సైతం కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. ఇటీవలే ముగిసిన 45వ చదరంగ ఒలింపియాడ్‌లో భారత్‌కు తొలిసారిగా బంగారు పతకం అందించగలిగారు.

### రజతం నుంచి స్వర్ణానికి....

ప్రపంచ టీమ్ విజేతను నిర్ణయించడానికి జరిగే చదరంగ ఒలింపియాడ్‌లో భారత్ తొలిసారిగా పురుషుల, మహిళల విభాగాలలో స్వర్ణపతకాలు సాధించడం ద్వారా అమెరికా, చైనా, రష్యా, ఉక్రెయిన్, అజర్ బైజాన్ లాంటి మేటి జట్ల ఆధిపత్యానికి చెక్ చెప్పింది.

చెన్నై వేదికగా ముగిసిన 44వ చదరంగ ఒలింపియాడ్‌లో రజత పతకం సాధించిన భారత్.. 2024 చదరంగ ఒలింపియాడ్‌లో ఏకంగా బంగారు పతకాన్నే కైవసం చేసుకోగలిగింది.

భారత్ ఈ అరుదైన, అపురూపమైన విజయం సాధించడంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 21 సంవత్సరాల అర్జున్ ఇరగేసి కీలకపాత్ర పోషించాడు. టీమ్ విభాగంలో మాత్రమే కాదు..వ్యక్తిగత విభాగంలో సైతం స్వర్ణ పతకం అందుకోవడం ద్వారా తనకు తానే సాటిగా నిలిచాడు.



కృష్ణారావు చొప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

### జాతీయస్థాయి నుంచి ప్రపంచ స్థాయికి.....

వరంగల్ నగరం నుంచి భారత చదరంగంలోకి దూసుకొచ్చిన అర్జున్ 19వ సంవత్సరాల వయసులోనే జాతీయ సీనియర్ టైటిల్ సాధించాడు. బ్లిట్జ్ విభాగంలో సూపర్ గ్రాండ్ మాస్టర్ ఆనంద్‌ను అధిగమించి నంబర్ వన్ ర్యాంకులో నిలవడం ద్వారా సత్తా చాటుకొన్నాడు. అతనికి చిన్ననాటి నుంచే చదరంగ క్రీడ అంటే మక్కువ. కుటుంబసభ్యుల ప్రోత్సాహం, నిరంతర సాధనతో అసాధారణ నైపుణ్యాన్ని సాధించగలిగాడు. జాతీయ జూనియర్, సీనియర్ స్థాయి పోటీలలో నిలకడగా రాణిస్తూ గ్రాండ్ మాస్టర్ రూపుదిద్దుకోగలిగాడు.

దక్షిణ కొరియా వేదికగా 2015లో జరిగిన ఆసియా యువజన చెస్ టోర్నీలో రజత పతకం సాధించాడు. ఆ తర్వాత కేవలం మూడేళ్ల వ్యవధిలోనే గ్రాండ్ మాస్టర్ హోదా సంపాదించాడు. బల్గేరియా వేదికగా ముగిసిన 2021 ప్రపంచ జూనియర్ చెస్ సమరం తొమ్మిదిరౌండ్లలో 7 పాయింట్లు సాధించడం ద్వారా రన్నరప్‌గా నిలిచాడు.

14 సంవత్సరాల 11 మాసాల, 13 రోజుల చిన్నవయసుకే గ్రాండ్ మాస్టర్ హోదా సాధించగలిగాడు. తెలంగాణ తొలి, భారత 54వ గ్రాండ్ మాస్టర్ గా రికార్డుల్లో చేరాడు. చిన్నవయసులోనే గ్రాండ్ మాస్టర్ హోదా పొందిన భారత చదరంగ క్రీడాకారులలో 32వ వాడిగా అర్జున్ నిలిచాడు.

### ఆనంద్ సరసన అర్జున్....

ప్రపంచ చదరంగంలో 2800 పాయింట్ల ఎలో రేటింగ్ సాధించడం గ్రాండ్ మాస్టర్ల కలగా ఉంటుంది. అయితే..అర్జున్ ఇరగేసి మాత్రం 21 సంవత్సరాలకే 2800 పాయింట్ల లక్ష్యాన్ని చేరడం ద్వారా భారత చదరంగానికే గర్వకారణంగా నిలిచాడు. సహఆటగాళ్లు గుకేశ్, ప్రజ్ఞానంద్, విదిత్ గుజరాతీ సాధించలేని ఘనతను అర్జున్ సొంతం చేసుకోగలిగాడు.

ప్రపంచ చదరంగ చరిత్రలో 2800 పాయింట్ల ఎలో రేటింగ్ సాధించిన ఆటగాళ్లు కేవలం 16 మంది మాత్రమే ఉంటే..అందులో ఇద్దరు మాత్రమే భారత గ్రాండ్ మాస్టర్లు ఉన్నారు. భారత్ తరపున విశ్వనాథన్ ఆనంద్ 2800 ఎలో రేటింగ్ సాధించిన తొలి సూపర్ గ్రాండ్ మాస్టర్ కాగా...అర్జున్ రెండో గ్రాండ్ మాస్టర్ గా రికార్డుల్లో చేరాడు. అత్యంత పిన్నవయసులో ఆ రేటింగ్ సాధించిన మూడో క్రీడాకారుడిగా నిలిచాడు.

2001లో ఫ్రెంచ్ గ్రాండ్ మాస్టర్ అలీరెజా ఫిరోజా 18 సంవత్సరాల వయసుకే 2800 ఎలో రేటింగ్ సాధించడం ద్వారా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ప్రస్తుత ప్రపంచ నంబర్ వన్ ర్యాంకర్ మాగ్నస్ కార్ల్ సన్ సైతం 18 సంవత్సరాల వయసుకే 2800 పాయింట్ల రేటింగ్ అందుకోగా..అర్జున్ ఇరగేసి 21 సంవత్సరాల వయసులో అరుదైన ఈ ఘనత సాధించిన మొనగాడిగా నిలిచాడు.

### 78వ ర్యాంక్ నుంచి 3వ ర్యాంక్‌కు....

రెండేళ్ల క్రితం వరకూ ప్రపంచ స్థాయిలో 78వ ర్యాంక్‌లో నిలిచిన అర్జున్ అత్యంత నిలకడగా రాణిస్తూ అనూహ్యంగా 3వ ర్యాంక్‌కు చేరుకోగలిగాడు. 2024 యూరోపియన్ చెస్ కప్ టోర్నీ 5వ రౌండ్ పోరులో రష్యన్ గ్రాండ్ మాస్టర్ దిమిత్రీ యాండ్రికిన్ పై విజయం సాధించడం ద్వారా 2800 ఎలో రేటింగ్ ను అందుకోగలిగాడు. అంతర్జాతీయ చదరంగ సమాఖ్య ప్రకటించిన తాజా రేటింగ్స్ ప్రకారం అర్జున్ 2802.1 పాయింట్లతో ప్రపంచ మూడో ర్యాంకర్ గా కొనసాగుతున్నాడు.

చదరంగ ఒలింపియాడ్ టీమ్, వ్యక్తిగత విభాగాలలో బంగారు పతకాలు సాధించిన భారత తొలి గ్రాండ్ మాస్టర్‌గా నిలిచిన అర్జున్ కేవలం 21 సంవత్సరాల వయసుకే ప్రపంచ 3వ ర్యాంక్ సాధించడం తెలంగాణ రాష్ట్రానికే కాదు... భారత్‌కే గర్వకారణం.

చదరంగం నేపథ్యం, అత్యాధునిక శిక్షణ సదుపాయాలు, ఆర్థిక ఆలంబన ఏ మాత్రం లేని వాతావరణం నుంచి వచ్చి...తెలంగాణా రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచిన తొలి గ్రాండ్ మాస్టర్, తొలి జాతీయ చాంపియన్ అర్జున్‌కు అండగా నిలవాల్సిన బాధ్యత తెలంగాణా ప్రభుత్వంపై ఉంది. ★



సత్యసాయి జిల్లా ధర్మవరంలో స్వయంసేవకుల పథసంచలన్

## థింక్ భారత్ ఆధ్వర్యంలో లోకమంథన్




**గుంటూరు**: 2024 నవంబర్ 20 నుండి భాగ్యనగర్‌లో జరుగనున్న లోకమంథన్ కార్యక్రమ తయారీలో భాగంగా ప్రీ లోకమంథన్‌ను అక్టోబర్ 19న గుంటూరులో నిర్వహించారు. ఇందులో గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠత్రిపాఠి, హైకోర్టు విశ్రాంత జడ్జి శివశంకర రావు, సాహితీవేత్త భాస్కర్‌యోగి, ఆంధ్రప్రదేశ్ సమాలోచన సంయోజకులు గిరిధర్, జాతీయ మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ విజయభారతి ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



## ఏజెన్సీలో సేవాభారతి ఆత్మీయ సమ్మేళనం

**రాజమండ్రి** : సేవాభారతి ఆత్మీయ సమ్మేళనం అక్టోబర్ 25న చింతూరు ఏజెన్సీలో జరిగింది. ఈ ప్రాంతంలో సేవాభారతి ద్వారా హాస్పిటల్, విద్యార్థి వికాస్ యోజన వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గత 20సంవత్సరాలలో అనేకమంది గిరిజన విద్యార్థులకు చదువు, వృత్తిపరమైన అనేక విషయాల్లో ప్రోత్సాహం లభించింది. ఆ విధంగా సేవాభారతి వేలాది కుటుంబాలకు బాసటగా నిలిచింది. ఈ సమ్మేళనంలో వి.భాగయ్య, ఆదిత్య, డాక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

## పుస్తకావిష్కరణ



**విజయవాడ:** రాణి అహల్యాబాయి త్రిశతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ రచయిత బొమ్మరాజు సారంగపాణి రచించిన **'తరతరాలకు స్ఫూర్తి రాణి అహల్యా బాయి'** పుస్తకావిష్కరణ అక్టోబరు 20న విజయవాడ తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగింది. అహల్యాబాయి జీవిత చరిత్రను మహిళా సమన్వయం–ఆంధ్రప్రదేశ్ సంస్థ పుస్తక రూపంలో తీసుకొచ్చింది. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జాతీయ మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ విజయభారతి, ఎన్టీఆర్ జిల్లా పూర్వపు కలెక్టర్ జి.సృజన పాల్గొన్నారు.

# అనంతపురంలో స్వయంసేవకుల పథసంచలన్

**ఆర్ఎస్ఎస్ 100వ సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా అనంతపురం విభాగ్‌కు సంబంధించిన మూడు జిల్లాలలోని అన్ని ఖండలు, నగరాలలో ఒకే రోజు అక్టోబర్ 27 తేదీన పథసంచలన్ (రూట్‌మార్చ్), సార్వజనికోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా అనంతపురంలో క్షేత్ర సేవాప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్, రాయదుర్గంలో క్షేత్ర బౌద్ధిక్ ప్రముఖ్ శ్రీధర స్వామి, పామిడిలో క్షేత్ర ధర్మజాగరణ ప్రముఖ్ అమరలింగన్న, మిగతా స్థలాలలో ప్రాంత, విభాగ్, జిల్లా స్థాయి కార్యకర్తలు పాల్గొని ప్రసంగించారు.**


పామిడి





రాయదుర్గం


అనంతపురం


కడప




**భౌగోళిక వివరాలు**
**(సత్యసాయి, అనంతపురం, కడప, జిల్లాలు)**

| | | |
|---|---|---|
| మొత్తం ఖండలు | : | 30 |
| మొత్తం నగరాలు | : | 5 |
| మొత్తం సంఘ మండలాల సంఖ్య | : | 308 |
| పాల్గొన్న సంఘ మండలాల సంఖ్య | : | 207 |
| మొత్తం గ్రామాల సంఖ్య | : | 1584 |
| పాల్గొన్న గ్రామాల సంఖ్య | : | 498 |
| మొత్తం బస్తీలు | : | 141 |
| పాల్గొన్న బస్తీలు | : | 119 |

**కార్యక్రమంలో పాల్గొన్న గణవేషధారి స్వయంసేవకుల సంఖ్య వివరాలు**

| | | |
|---|---|---|
| తరుణ / ప్రౌఢ | : | 3945 |
| కళాశాల విద్యార్థులు | : | 681 |
| బాల స్వయంసేవకులు | : | 413 |
| ఘోష్ వాదకులు | : | 136 |
| మొత్తం | : | 5195 |
| ఇతరులు | : | 1525 |
| మహిళలు | : | 429 |
| మొత్తం సంఖ్య | : | 7149 |

# బాల జాగృతి

## తెలుసుకుందాం

## నవబ్రహ్మ ఆలయాలు - ఆలంపూర్



జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్‌లో కృష్ణా-తుంగభద్ర నదులు కలిసే చోటుకు సమీపంలో కొలువుదీరిన ఆలయాల సమూహమిది. 8 శతాబ్దంలో బాదామీ చాళుక్యులు నిర్మించిన ఈ ఆలయాన్ని శివునికి అంకితమిచ్చారు. 14వ శతాబ్దంలో ఇస్లామిక్ రాజులు దండయాత్ర చేయగా ఈ నవబ్రహ్మ ఆలయాలు కొంతమేర దెబ్బతిన్నాయి. ఈ ఆలయం హైదరాబాద్ నుంచి 215 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. చుట్టూ పచ్చని ప్రకృతితో ఈ ప్రదేశం పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటుంది.

## కథ

## నీరు చెప్పిన నీతి!



రాతిపురం అనే ప్రాంతంలో కొండపై రెండు ఊళ్లు ఉన్నాయి.

వారు నీటి కోసం నిత్యం ఎన్నో కష్టాలు పడేవారు.

పక్క కొండపై ఉన్న ఊట నుంచి నీటిని తెచ్చుకోవడానికి తీవ్రంగా శ్రమించేవారు.

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఒక రోజు రెండు ఊళ్లవారు సమావేశం పెట్టుకున్నారు.

పక్క కొండ నుంచి పైపు ఏర్పాటు చేసుకుంటే ఈ సమస్య పరిష్కారం అవుతుందని ఒక ఊరు వారు చెప్పగా.. రెండో ఊరి వాళ్లు దానిని వ్యతిరేకించారు.

పైపు వేయడం చాలా కష్టమైన పని.. పైగా చాలా సమయం, డబ్బు, శ్రమ వృథా అవుతాయని వారు అంగీకరించలేదు. అందుకు తాము సహాయం చేయమని రెండో ఊరి వాళ్లు చెప్పారు.

## పద్యము

ప్రేమను గూర్చి యల్పునకుఁబెద్దతనంబును దొడ్డవానికిం
దామతి తుచ్ఛపుంబని నెదం బరికింపక యీయరాదుగా
వామకరంబుతోడ గుడువం గుడిచేత నపాన మార్గముం
దోమగవచ్చునే మిగులఁదోఁచని చేతులుగాక భాస్కరా!

**భావం :** భాస్కరా! లోకంలో నీచునకు గొప్ప పదవిని, గొప్పవానికి చిన్న పదవినిచ్చి పనులు చేయించుచో ఆ పాలనమంతయు ఆలోచన లేక ఎడమ చేతితో భుజించుటయును, కుడి చేతితో మల మూత్రములు శుభ్రపరచుటయును యగును.

## శ్లోకము

మాతృవత్ పరదారేషు పరద్రవ్యాణి లోష్ఠవత్
ఆత్మవత్ సర్వభూతాని ఏషధర్మః సనాతనః

**భావం :** పరస్త్రీలను తల్లులుగాను, ఇతరుల సొత్తును మట్టిగాను, సర్వ ప్రాణులను తనతో సమానంగా చూడడమే సనాతన ధర్మం.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఆదరువు | గొడ్డలి |
| ఓగిరము | ఆహారం |
| కుఠారము | దరి |
| చాగము | ఆధారం |
| తీరము | త్యాగం |

జవాబులు : ఆదరువు-ఆధారం, ఓగిరము-ఆహారం, కుఠారము-గొడ్డలి, చాగము-త్యాగం, తీరము-దరి.

నిర్వహణ : నయనశ్రీ

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### రాచాబత్తుని సూర్యనారాయణ



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. 1903లో ఏపీలోని తెనాలిలో జన్మించారు. తాను స్వయంగా ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా యువతను ఈ పోరాటంలో పాల్గొనేందుకు స్ఫూర్తిని కలిగించే వారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పిలుపు మేరకు 1941లో భట్టిప్రోలులో వేలాది మందితో సత్యాగ్రహం నిర్వహించారు. అక్కడి నుంచి కృష్ణానదిని దాటి దివి తాలూకాలోకి ప్రవేశించారు. ప్రజలను సమీకరిస్తూ, సత్యాగ్రహ ప్రచారం చేస్తూ అప్పటి జిల్లా కేంద్రమైన మచిలీపట్నం చేరుకోగానే బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసింది. ఆరు వారాల కఠిన కారాగార శిక్ష అనుభవించారు. 1961, ఏప్రిల్ 15న మరణించారు.



కానీ మొదటి ఊరివాళ్లు పైపు వేయడం మొదలు పెట్టారు.

మొదట్లో ఎన్నో ఇబ్బందులు పడ్డారు. కొందరు తీవ్రంగా గాయపడ్డారు. పైపులు విరిగిపోయి తీవ్రంగా నష్టపోయారు.

వాళ్ల కష్టాలను చూసి రెండో ఊరువాళ్లు నవ్వుకునేవారు.

కొన్ని సంవత్సరాలకు ఎలాగోలా పైపు నిర్మాణం పూర్తయింది. మొదటి ఊళ్లోకి నీళ్లు వచ్చాయి.

రెండో ఊరువాళ్లు కష్టపడుతూనే నీళ్లు తెచ్చుకునేవారు. తాత్కాలిక కష్టానికి భయపడితే ఫలితం పొందలేమని వాళ్లు గ్రహించారు. ★

## జనరల్ నాలెడ్జ్

1. ప్రపంచ బాలల హక్కుల దినోత్సవాన్ని ఎప్పుడు జరుపుకుంటారు?
2. భారతదేశ మొదటి ఉపరాష్ట్రపతి ఎవరు?
3. వియన్నా అనేది ఏ దేశానికి రాజధాని?

సమాధానాలు : 1. నవంబరు 20; 2. సర్వేపల్లి రాధాకృష్ణన్; 3. ఆస్ట్రియా

## మెదడుకు మేత

ఒకటే తొట్టి, రెండు పిల్లలు.. ఏమిటది?

జవాబు : జ. వేరుశనగ

## మంచిమాట

ఆత్మబలం లోపించిన వ్యక్తిలో శ్రద్ధ స్థిరపడదు!




# వారఫలాలు

**04 -10 నవంబర్, 2024**




సింహంభట్ల సుబ్బారావు

6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

అనుకున్న కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. ఆదాయం సమృద్ధిగా ఉంటుంది. సేవా కార్యక్రమా లలో పాల్గొంటారు. వ్యాపారులకు లాభాలు అందుతాయి. ఉద్యోగులకు కొత్త పోస్టులు దక్కే అవకాశం. రాజకీయవేత్తలు, కళాకారులకు శుభవార్తలు అందుతాయి. రచయితలకు కొన్ని పురస్కారాలు అందవచ్చు. 4,5 తేదీల్లో దుబారా ఖర్చులు. మానసిక అశాంతి. దూరప్రయాణాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

అనుకున్నది సాధించాలన్న తపనతో ముందుకు సాగుతారు. ఊహించని విజయాలు సాధిస్తారు. విద్యార్థులకు ఫలితాలు ఊరటనిస్తాయి. వ్యాపా రస్తులకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు హోదాలు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు నూతనోత్సాహం. పరిశోధకులు,రచయితల యత్నాలు సఫలం. 7,8 తేదీల్లో ఆకస్మిక ప్రయా ణాలు. బంధువులతో తగాదాలు. ఒప్పందాలలో ఆటంకాలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

చిత్రవిచిత్ర సంఘటనలు ఎదురవుతాయి. ఆర్థిక పరిస్థితి గతంకంటే మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులతో మరింత సఖ్యత నెలకొంటుంది. ఆలో చనలు స్థిరంగాఉండవు. అనుకున్న కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. ఒక ఆహ్వానం సంతోషం కలి గిస్తుంది. పారిశ్రామిక వేత్తలు, కళాకారులకు కీలక సమాచారం. రచయితలకు అనూహ్యమైన కీర్తి ప్రతిష్ఠలు దక్కుతాయి. 9.10 తేదీల్లో ఖర్చులు. ఆరోగ్య సమస్యలు. గణేశాష్టకం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

మీ అంచనాలు, ఊహలు నిజం కాగలవు. ముఖ్యమైన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. బంధువులతో ముఖ్య విషయాలు చర్చిస్తారు. చిన్ననాటి స్నేహితులతో ఉత్తరప్రత్యుత్త రాలు సాగి స్తారు. వ్యాపారులు క్రమేపీ లాభాలు ఆర్జిస్తారు. ఉద్యో గులకు పోస్టులు పెరుగుతాయి. కళా కారులకు ఊహించని అవకాశాలు. పరిశోధకులు, రచయిత లకు నూతనోత్సాహం. 4,5తేదీల్లో ఆకస్మిక ప్రయా ణాలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతంగా సాగిపోతుంది. రాబడి మరింత పెరుగుతుంది. సన్నిహితుల సాయం అందుతుంది. శుభకార్యాలు నిర్వహిస్తారు. వ్యాపారులకు తగినంత లాభాలు. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులకు కొత్త అవకాశాలు దగ్గరకు వస్తాయి. క్రీడాకారుల ప్రయత్నాలు ఫలిస్తాయి. 5,6 తేదీల్లో దూర ప్రయాణాలు. కాలభైరవాష్టకం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. సమాజంలో ప్రత్యేక ఆదరణ లభిస్తుంది. భూములు, ఆభరణాలు కొంటారు. ఆదాయానికి ఇబ్బంది లేకుండా గడిచిపోతుంది. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు విధుల్లో ప్రతిబంధకాలు అధిగమిస్తారు. పారిశ్రామికవేత్తలకు విదేశీ పర్యటనలు. రచయితలు, పరిశోధకులకు ఆశాజనకం. 7,8 తేదీల్లో ప్రయాణా లలో మార్పులు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ఆదాయం ఆశించినంతగా సమకూరి అవసరాలు తీరతాయి. ఆప్తుల సలహాలు, సూచనలు పాటిస్తారు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులు లాభపడతారు. ఉద్యోగస్తులకు హోదాలు పెరుగు తాయి. పారిశ్రామికవేత్తల అంచనాలు నిజమవు తాయి. క్రీడాకారులు, పరిశోధకులకు అనుకూలం 6,7 తేదీల్లో ఖర్చులు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

మొదట్లో కొన్ని ఇబ్బందులు నెలకొన్నా క్రమేపీ సర్దుబాటు చేసుకుంటారు. ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురవుతాయి. వ్యాపారస్తులకు లాభాలు తథ్యం. ఉద్యోగులు విధుల్లో సమస్యలు తీరి ఊరట చెందుతారు. రాజకీయవేత్తల యత్నాలు సఫలం. పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు విదేశీ పర్యటనలు చేస్తారు. 9,10 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. ఆదిత్యహృదయం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కొత్త కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. నిరు ద్యోగులకు ఉద్యోగలాభం కలుగుతుంది. బంధువుల నుంచి ఆసక్తికర సమాచారం అందుతుంది. ఉద్యోగులకు మార్పులు ఉత్సాహాన్నిస్తాయి. రచయితలు, కళాకారులకు ఆహ్వానాలు అందు తాయి. 7,8 తేదీల్లో బంధువులతో తగాదాలు. మానసిక అశాంతి. అదనపు ఖర్చులు. శివపంచాక్షరి పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు. సమాజంలో గౌరవమర్యాదలు పొందుతారు. ఆదాయం ఆశాజనకంగా ఉంటుంది. భూములు, వాహనాలు సమకూర్చుకుంటారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు రావచ్చు. కళాకారులకు అవకాశాలు. క్రీడాకారులు, పారిశ్రామికవేత్తల కలలు ఫలిస్తాయి. 9,10 తేదీల్లో దూరప్రయాణాలు. కుటుంబంలో సమస్యలు. స్వల్ప అనారోగ్యం. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఉద్యోగయత్నాలు సానుకూలం. కొత్త విషయాలు తెలుస్తాయి. ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగులకు విధుల్లో అనుకూల మార్పులు రావచ్చు. రాజకీయవేత్తలు, కళాకారులకు ఊహించని అవకాశాలు. రచయితలు, పరిశోధకులకు నూతన నోత్సాహం. 7,8 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. ధనవ్యయం. శ్రీకృష్ణాష్టకం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

బంధువులు, స్నేహితులతో అకారణంగా తగాదాలు ఏర్పడతాయి. స్థిరాస్తి వివాదాలు నెలకొని సహనాన్ని పరీక్షిస్తాయి. దూరపు బంధువులను కలుసుకుంటారు. వ్యాపారులు స్వల్ప లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగులకు మార్పులు సంభవం. రాజకీయవేత్తలు, కళాకారులకు అంచనాలలో పొరపాట్లు. రచయితల ఆశలు అంతగా ఫలించవు. 4,5 తేదీల్లో శుభవార్తలు, వాహనయోగం. వివాదాల పరిష్కారం. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

# పదరసం-486

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | | 4 | 5 | |
| | | 6 | | | | 7 | | | |
| 8 | | | | | | 9 | | | |
| | | | 10 | | | | | 11 | 12 |
| | 13 | | | | 14 | | 15 | | |
| | | | 16 | | | | 17 | | |
| 18 | | | | | | | | | |
| | | | | 19 | | 20 | | 21 | |
| 22 | | | 23 | | | | | | |
| | | | 24 | | | | | 25 | |

## ఆధారాలు

**అడ్డం**

1) జాడ (3)
4) ఇది వేయడమంటే మోసం చేయడం (3)
6) సమాజంలో మార్పులు తీసుకొచ్చినవాడే తిరగబడ్డాడు (5)
8) కదలిక (3)
9) బుజ్జాయి (3)
10) విగ్రహం (2)
11) మొదటి పరుషం రెండుసార్లు (2)
13) రూపాయిలో నాలుగోవంతు (3)
14) వడపప్పు (ప్రసాదం) తోటిది (3)
16) వాతము, శబ్దములోనగునది, నాడి (3)
17) పొక్కు (3)
18) వెక్కిరింత (4)
19) ఇవి లేవంటే అడ్డం 8 లేనట్లు (6)
22) ఈ హాస్యరచయిత బాపు ప్రాణస్నేహితుడు (4)
24) అటూఇటూ మారడం (4)
25) ఆకాశం (2)

**నిలువు**

1) తలపు (4)
2) నవవిధ భక్తి మార్గాలలో ఒకటి (3)
3) పూర్తిగా లేదు (4)
5) సంగమం (4)
7) ఆదాయం (4)
10) ముఖ్యమైనది, షట్చక్రాలలో ఒకటి (4)
12) వార్త (3)
13) తలమీది నుంచి నుదిటిమీదకి ధరించే ఆభరణం (5)
14) కాకులు తగ్గి ఈ పక్షులు ఎక్కువై పోతున్నాయి (4)
15) పెళ్ళి అప్పగింతలలో వధువు నడుముకు కట్టే శాకం (4)
20) మహా ధనవంతునికి అంతే లేదు (3)
21) పై కొచ్చిన లాభం (3)
22) డబ్బు మూట (2)
23) తలక్రిందులైన తాళవృక్షం (2)

## పదరసం - 485 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ని[1] | క్క | చ్చి[2] | | | ప[3] | ల్ల | ద[4] | నం | |
| రీ | | ప్ప | | చె[5] | ర | | య | | ది[6] |
| క్ష[7] | ణం | అ | ను[8] | | ము[9] | లి | నీ | | మ్మి |
| ణ | | | నం | | ప | | యం[10] | ము[11] | స |
| | ప[12] | ర | మా | నం | ద | య్య | | ధు | |
| అ[13] | వ్వ | | అ | | సో | | మ[14] | మే | కం |
| మ | | పా[15] | | సి[16] | పా | యి | | హం | |
| రా[17] | లు | గా | యి[18] | | న | | మ[19] | | మ[20] |
| వ | | | త్తా | | ప[21] | రా | న్న | టు | క్కు |
| తి | | ఉ[22] | బ | లా | టం | | న | | వ |

సి ని మా



ఐదేళ్ల క్రితం 'రాజావారు రాణిగారు' సినిమాతో హీరోగా పరిచయం అయ్యాడు కిరణ్ అబ్బవరం. అప్పటి నుండి ఇప్పటి వరకూ ఎనిమిది చిత్రాలలో నటించాడు. అందులో 'ఎస్.ఆర్. కళ్యాణ్ మండపం', 'వినరో భాగ్యము విష్ణు కథ' చిత్రాలు విజయాన్ని సాధించాయి. నటుడిగా కిరణ్‌కు పేరు తెచ్చిపెట్టాయి. వైవిధ్యమైన కథాంశాలను ఎంపిక చేసుకుని సినిమాలు చేస్తున్నా, అవి ఆశించిన స్థాయిలో విజయం సాధించడం లేదు. ఇప్పుడు అతని తొమ్మిదవ చిత్రం 'క' దీపావళి కానుకగా విడుదలైంది. చింతా గోపాలకృష్ణరెడ్డి నిర్మించిన ఈ సినిమాతో సుజీత్, సందీప్ దర్శకులుగా పరిచయం అయ్యారు.

# కంచికి చేరిన 'క'థ!

'క' మూవీ ప్రమోషన్స్‌లో ఇలాంటి చిత్రం గతంలో రాలేదని, ఒకవేళ వచ్చిందని నిరూపిస్తే తాను సినిమాలు చేయడమే మానేస్తానని హీరో కిరణ్ అబ్బవరం ప్రకటించాడు. అతని మాటల్లో వాస్తవం ఉంది. ఇలాంటి కథతో ఇంతకు ముందే ఏ సినిమా రాలేదు. దర్శకులకు వచ్చిన ఆలోచన నిజంగా చాలా కొత్తగా ఉంది. అయితే ఈ సరికొత్త పాయింట్‌ను ప్రేక్షకులకు ఏ మేరకు ఆసక్తికరంగా, అర్థమయ్యేలా అందించారన్నదే ఇక్కడ ప్రధానం. దాని మీదే సినిమా జయాపజయాలు ఆధారపడి ఉంటాయి.

సినిమా కథ విషయానికి వస్తే... ఇది 1970 ప్రాంతంలో జరిగిన కథ. అనాథ అయిన అభినయ వాసుదేవ్ (కిరణ్ అబ్బవరం) కృష్ణగిరి అనే ఓ చిన్న గ్రామానికి పోస్ట్‌మ్యాన్‌గా వస్తాడు. చుట్టూ ఉన్న ఎత్తైన కొండల కారణంగా మధ్యాహ్నం మూడు గంటలకే ఈ గ్రామాన్ని చీకటి అలుముకుంటుంది. అమ్మవారి అంశతో ఏర్పడిన ఆ గ్రామంలో ప్రతి గడపకు ఓ ఆడపిల్ల ఉంటుంది. వాళ్లు అదృష్టజాతకులు అని జనాలు నమ్ముతారు. వాసుదేవ్‌కు చిన్నప్పటి నుండి ఇతరుల ఉత్తరాలు చదివే వింత అలవాటు ఉంటుంది. దాంతో పోస్ట్ మ్యాన్ అయ్యాక ఊరిలోని వారికి వచ్చిన ఉత్తరాలను వారికి తెలియకుండా చదివేస్తుంటాడు. అదే సమయంలో అతను ఎవరైనా ఏదైనా ఇబ్బందుల్లో ఉన్నారని ఆ ఉత్తరాల ద్వారా తెలిస్తే తనవంతు సాయం చేస్తుంటాడు. వాసుదేవ్ ఆ ఊరిలోకి అడుగుపెట్టిన కొద్ది రోజులకే అక్కడి అమ్మాయిలు కనిపించకుండా పోతుంటారు. దానికి ఊరి చివర ఉండే అబిద్ షేక్ కారణమేమోనని అతనికి అనుమానం కలుగుతుంది. ఊరిలో పెద్దమనిషిగా చెలామణి అయ్యే అబిద్ షేక్‌ను ఇంటరాగేట్ చేయడానికి పోలీసులు సైతం వెనుకాడుతూ ఉంటారు. కొందరు వ్యక్తులు తాను ప్రేమించిన పోస్ట్ మాస్టర్ కూతురు సత్యభామ (నయన్ సారిక)ను కిడ్నాప్ చేస్తుంటే వాసుదేవ్ రక్షిస్తాడు. కిడ్నాపర్లు ఎవరో కనుక్కుని, అమ్మాయిలను ఎందుకు కిడ్నాప్ చేస్తున్నారో తెలుసుకోవాలని కంకణం కట్టుకుంటాడు. మరి అతని ప్రయత్నం నెరవేరిందా? ఊరిలో అమ్మాయిల కిడ్నాప్‌కి అబిద్ షేక్‌కు నిజంగానే సంబంధం ఉందా? ఈ ఉమెన్ ట్రాఫికింగ్ వెనుక ఎవరి హస్తం ఉంది? దీనిని తెలుసుకునే క్రమంలో వాసుదేవ్ జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? అనేదే 'క' కథ.


ఆ మధ్య దర్శకుడు ప్రశాంత్ వర్మ 'అ!' అనే సినిమాను తెరకెక్కించాడు. ఇప్పుడు సుజీత్, సందీప్ 'క' పేరుతో మూవీ చేశారు. తన చిత్రాలకు భిన్నమైన పేర్లు పెట్టడంలో కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర ముందుంటారు. అయితే 'క' అంటే అంతరాత్మ అని మేకర్స్ చెబుతున్నారు. ఓ వ్యక్తి అంతరాత్మకు సంబంధించిన కథ కాబట్టి ఆ పేరు పెట్టారని అనుకోవడం సబబే! అయితే ఎంచుకున్న కథలో కొత్తదనం ఉన్నా... దానిని తెర మీద ప్రెజెంట్ చేసిన విధానంలో నూతన దర్శకులు తడబడ్డారు. సినిమా మొదటి అరగంట అత్యంత ఆసక్తికరంగా ఉంది. ఓ సరికొత్త చిత్రాన్ని చూస్తున్నామనే భావన ప్రేక్షకులకు కలుగుతుంది. కానీ ఆ తర్వాత గ్రాఫ్ నిదానంగా పడిపోయింది. కొత్త పాత్రలు రావడం, వారి నేపథ్యాన్ని విడతల వారీగా తెలియచెప్పడం, పతాక సన్నివేశాలో ఉమెన్ ట్రాఫికింగ్ తో దీనిని ముడి పెట్టడం... వారితో హీరో చేసే పోరాటం... దాని పర్యవసానం... ఇవన్నీ ప్రేక్షకుల సహనాన్ని పరీక్షించేలా మారిపోయాయి. హీరోని కిడ్నాప్ చేసిన వ్యక్తి ఎవరో తెలియచేస్తూ, ఇంటర్వెల్‌లో ఆడియెన్స్‌కు ఊహించని షాక్ ఇస్తారు దర్శకులు. అయితే... ఆ తర్వాత దానికి జెస్టిఫై చేసే క్రమంలో ఎక్కువ తడబడ్డారు. దాంతో ఏదో చెప్పాలనుకుని ఏదో చెప్పారనే భావన ప్రేక్షకులకు కలుగుతుంది.

కిరణ్ అబ్బవరం తన పాత్రకు చక్కటి న్యాయం చేకూర్చాడు. అన్ని విధాలుగా తన గత చిత్రాల కంటే దీనిని మెరుగైన స్థానంలో నిలబెట్టడం కోసం కృషి చేశాడు. అలానే 'ఆయ్, గం గం గణేశ' చిత్రాలలో నటించిన నయన్ సారిక... సత్యభామగా మెప్పించింది. ఆ మధ్య వచ్చిన నాని 'అంటే సుందరానికి...' మూవీలో నటించిన తన్వీ రామ్ ఇందులో కీలకమైన రాధ పాత్రను చేసింది. ఇతర పాత్రలను అచ్యుత్ కుమార్, రెడిన్ కింగ్ స్లే, జయరాం, అజయ్, శరణ్య ప్రదీప్, అన్నపూర్ణ, బిందు చంద్రమౌళి తదితరులు పోషించారు. సామ్ సి.ఎస్. నేపథ్య సంగీతం బాగుంది. పాటలు ఫర్వాలేదని పిస్తాయి. విశ్వాస్ డేనియల్, సతీశ్ రెడ్డి సినిమా టోగ్రఫీ చక్కగా ఉంది. నటీనటులు, సాంకేతిక నిపుణుల నుండి చక్కని ప్రతిభను రాబట్టుకున్నా... ఓవర్ ఆల్‌గా మూవీని జనం కనెక్ట్ అయ్యేలా తీయడంలో దర్శకులు ఫెయిల్ అయ్యారు.


'క' చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయాలని మేకర్స్ తొలుత భావించారు. ఆ తర్వాత హిందీలో వద్దనుకున్నారు. ఈ సినిమా మలయాళ వర్షన్ హక్కుల్ని దుల్కర్ సల్మాన్‌కు చెందిన ప్రొడక్షన్ హౌస్ వేఫరర్ ఫిలింస్ సొంతం చేసుకుంది. దీపావళికే దుల్కర్ సల్మాన్ మూవీ 'లక్కీ భాస్కర్' విడుదల కావడంతో దీని విడుదల కేరళలో జరగలేదు. తమిళంలోనూ తగిన థియేటర్లు దొరకని కారణంగా రిలీజ్ చేయలేదు. ఆ రకంగా 'క' సినిమా ఇప్పుడు కేవలం తెలుగులోనే వచ్చింది. దీనిని వంశీ నందిపాటి విడుదల చేశారు. ఇప్పుడీ సినిమాకు ప్రతికూల ఫలితం వస్తున్న నేపథ్యంలో మిగిలిన భాషల్లో విడుదల కావడం సందేహమే! బహుశా ఓటీటీ స్ట్రీమింగ్ టైమ్ లో అని ఇతర భాషల్లో ప్రసారం చేయొచ్చు!

**అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు





వెల : ₹.90/-




వెల : ₹.390/-





వెల : ₹.220/-





వెల : ₹.360/-





వెల : ₹.200/-




వెల : ₹.360/-





వెల : ₹.300/-





వెల : ₹.200/-





వెల : ₹.90/-





వెల : ₹.100/-





వెల : ₹.250/-





వెల : ₹.799/-




వెల :₹.495/-




వెల : ₹.549/-




వెల : ₹.399/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

**ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!**

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329, 8179163138
సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 02

